సనాతన సారథి

నవంబరు 2013

ప్రత్యేక సంచిక

‘పువ్వు పువ్వులోన నవ్వుచునుండె స్వామి... నవ్వులోన కరుణ నాట్యమాడె’

సనాతన సారథి

సత్య, ధర్మ, శాంతి, ప్రేమలద్వారా మానవజాతి సామాజిక,
నైతిక, ఆధ్యాత్మిక అభివృద్ధికి అర్పితము

సంపుటము 56
సంచిక 11

నవంబరు 2013

ప్రచురణ తేదీ
నవంబరు 1

1.	తొలి పలుకు	సంపాదకీయం	2
2.	సాయి నిజతత్త్వము	అవతారవాణి	4
3.	'నాకంతా తెలుసు బంగారూ!'	ఆర్.జె. రత్నాకర్	6
4.	ఆరోగ్య ప్రదాయి శ్రీ సత్యసాయి	డా॥ కె.వి. కృష్ణకుమారి	9
5.	సద్గుణములను పెంపొందించునదే విద్య	గురుదేవవాణి	12
6.	విశాల హృదయులు కావాలి	చీమలకొండ జయాశాస్త్రి	14
7.	సాయి లీలావిభూతి	కొప్పరపు బాలామనోహరరావు	16
8.	దైవం మానుష రూపేణా	చంద్రమౌళి రమాదేవి	18
9.	దీపావళి ప్రబోధ	అవతారవాణి	21
10.	ఆదర్శ కుటుంబం	డా॥ బి.వి. పట్టాభిరామ్	23
11.	స్త్రీ గృహ లక్ష్మిగా వర్ధిల్లాలి	అవతారవాణి	26
12.	'అందరినీ ప్రేమించు, అందరినీ సేవించు'	బి.వి. సత్యమూర్తి	28
13.	శివం, స్వామి హృదయం	వి.ఎస్.ఆర్. మూర్తి	32
14.	శరణాగతి	వై. శ్రీరంగనాథరాజు	34
15.	అడగగానే మార్గం చూపిన దేవుడు	వసంతభాను	36
16.	శ్రీ సత్యసాయి ప్రబోధామృతం	ఎమ్.ఎస్. ప్రకాశరావు	38
17.	పిలిచితే పలుకుతావట!	ప్రొ॥ జి.ఎన్. మూర్తి	41
18.	స్వామి సన్నిధిలో పురుషోత్తమానంద	డా॥ జంధ్యాల సుమన్‌బాబు	43
19.	ప్రశాంతి సమాచారం	దివి చతుర్వేది	45
20.	హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ	'సత్యం శివం సుందరం' ఆధారంగా...	48

© శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం, ప్రశాంతి నిలయం

ఎడిటర్ : బి.వి. రమణరావు

అసిస్టెంట్ ఎడిటర్ : వి. శ్రీనివాసులు

టెలిఫోన్: 287375 (సనాతన సారథి Extn. 128) STD: **08555** ISD CODE: **0091-8555**

E-mail: subscriptions@sssbpt.org, editor@sssbpt.org

శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం, ప్రశాంతి నిలయం, అనంతపురం జిల్లా (ఆం.ప్ర) - 515134 తరపున ప్రశాంతి నిలయంలోని శ్రీ సత్యసాయి ఆశ్రమ పరిధిలో ఉన్న శ్రీ సత్యసాయి ప్రెస్ షెడ్ (120'X40')లో ముద్రింపబడి ప్రచురింపబడింది.

ముద్రాపకుడు, ప్రచురణకర్త : కె.ఎస్. రాజన్

తొలి పలుకు

"స్వామీ, ఈ దివ్యశక్తులు మీకు ఏ వయస్సులో సంక్రమించాయి?" అని తానడిగిన ప్రశ్నకు, **"నేను పుట్టినప్పటినుండి"** అని, కొద్ది క్షణాలు అగి, **"అంతకు ముందునుండే"** అని భగవాన్ చెప్పిన సమాధానం నవకాల్ పత్రిక సంపాదకుణ్ని నిరుత్తరుణ్ని చేసింది. 1968లో జరిగిన సంభాషణ ఇది.

"నా పుట్టుకను నేనే నిర్ణయించుకున్నాను. నాకు కాగల తల్లిని నేనే ఎంచుకున్నాను" అని ప్రకటించారు, భగవాన్. ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది ఈ క్రింది పద్యసూక్తి:

"దుర్గుణంబులు సవరించి తొడరుటకును
సాధు సంరక్షణమ్ము సల్పుటకును
గర్భ దుఃఖమొకింతయు కాంచకుండ
పుట్టుచుండును స్వేచ్ఛగా పుడమి సాయి"

ఒక చీమ సముద్రపులోతును తెలుసుకోవాలని ప్రయత్నించటం ఎలాంటిదో మనం స్వామితత్వాన్ని గ్రహించాలని ప్రయత్నించటం అలాంటిది. **"సత్యసాయి బాబానుగురించి సమగ్రంగా తెలుసుకోవడం మరొక సత్యసాయిబాబాకు మాత్రమే సాధ్యం"** అన్నారు భగవాన్.

ప్రతి సంవత్సరం నవంబరు 23వ తేదీన మనం స్వామి జన్మదినోత్సవాన్ని జరుపుకుంటున్నాము. కానీ, **'ఇది ఈ దేహముయొక్క పుట్టినరోజేకానీ, నాకు పుట్టినరోజు లేదు'** అన్నారు, భగవాన్. మరి ఈ సాయి ఎవరు? ఈ ప్రశ్నకు వారే చెప్పిన సమాధానం, **"సాయి నిజతత్త్వము"**

అన్నీ తెలిసిన భగవంతుడు నిశ్చలంగా ఉంటాడు. తెలియకపోయినా మనిషి తెలిసినట్లు సంచరిస్తుంటాడు. కనుకనే, **"ఊరకుండేవాడు దేవుడు, ఊగులాడేవాడు జీవుడు"** అన్నారు భగవాన్. జగన్నాథ రథ చక్రముపై పారాడే చీమలు తమవల్లనే చక్రాలు తిరుగుతున్నాయని భావించటం ఎంత అజ్ఞానమో, అప్రతిహతంగా సాగిపోయే సాయి అవతారోద్యమంలో మనం కర్తృత్వాన్ని ఆపాదించుకోవటం అంత అవివేకం. సర్వం స్వామి సంకల్పానుసారమే జరుగుతుందని, మనం కేవలం నిమిత్తమాత్రులమేనన్న స్పృహతో మనవంతు కర్తవ్యంగా భక్తులకు తగిన సేవలందించినప్పుడే స్వామిని సంతృప్తి పరచినవారమవుతామన్న సందేశాన్నిస్తుంది ఆర్.జె. రత్నాకర్‌గారి రచన, **'నాకంతా తెలుసు బంగారూ!'**

చతుర్విధ పురుషార్థ సాధనకు ఆరోగ్యమే ఆధారం. కనుకనే, దశాబ్దాలుగా ఆరోగ్య విషయంలో భగవాన్ అనేక ప్రబోధాలు చేశారు. ఆరోగ్యపరమైన స్వామి సూక్తులలోని ఆధ్యాత్మికతను, వైద్యపరమైన అనుభవాలను జోడించి డా॥ కె.వి. కృష్ణ కుమారిగారు రచించిన **"ఆరోగ్యప్రదాయి శ్రీసత్యసాయి"** ఈ మాసం నుండి ధారావాహికంగా అందిస్తున్నాము.

"విద్యార్థులే నా ప్రోపర్టీ" అని భగవాన్ పలు సందర్భాల్లో ఉద్ఘాటించారు. సాయి విద్యాసంస్థల నుండి ప్రతి యేటా పట్టభద్రులయ్యే కేవలం కొన్ని వందలమంది విద్యార్థులతో సమాజంలో మార్పు తేవడం సాధ్యమా? అని ఒక భక్తుడు వ్యక్తం చేసిన సందేహానికి సమాధానం చెప్తూ, వేలాది సైనికులను ఒక్క సైనికాధికారి నియంత్రించినట్లుగా తమ విద్యార్థులు సమాజానికి నాయకత్వం వహించి దిశానిర్దేశం చేయగలరని భగవాన్ ఉద్ఘాటించారు. సాయి విద్యాసంస్థలో విద్యాభ్యాసం పూర్తి గావించుకొని బాహ్య ప్రపంచంలోకి అడుగిడే విద్యార్థినీ విద్యార్థులకు దివ్య ఛాన్సలర్ అనుగ్రహించిన స్నాతకోత్సవ సందేశం, **'సద్గుణములను పెంపొందించునదే విద్య.'**

"కవిం పురాణ మనుశాసితారమ్" అన్న గీతా శ్లోకాన్ని ఉటంకిస్తూ, **"కవి అంటే ఎవరు?"** అని సుప్రసిద్ధ కవి, పండితులు అయిన అమరేంద్రగారిని ప్రశ్నించారు, భగవాన్. ఆయన బదులు చెప్పేలోగా, **"పరమాత్ముడే కవి"** అని చిరునవ్వులు చిందిస్తూ ముందుకు సాగిపోయారు. స్వామియే ప్రత్యక్ష పరమాత్ముడని, అందరు కవులను పలికించే ప్రభువు వారేనని అనుభవపూర్వకంగా గ్రహించిన అమరేంద్రగారికి తాను కవిననే గర్వం తొలగిపోయిందట.

"కవిననెడి గర్వమంతయు కరిగిపోయె, ఓ కవీశ్వర, నీ పాదయుగళి దొరికె! కాను కవినింక, నేను నీ కావ్యమేను!" అంటూ ఆయన స్వామి పాదాలను హత్తుకున్నారు. "సత్య ధర్మము శాంతి ప్రేమలతో..." అన్న భగవాన్ స్వీయ రచనలోని భావగర్భితాన్ని, నిగూఢత్వాన్ని దర్శింపజేసే రచన, **"విశాల హృదయులు కావాలి"**

స్వామి విద్యాసంస్థలో పనిచేస్తున్న ఒక అధ్యాపకునికి ఉన్నట్లుండి హిమాలయాలకు వెళ్ళి తపస్సు చేసుకోవాలని కోరిక కలిగింది. తపస్సు పరమార్థమేమిటి? అని స్వామి ప్రశ్నించారు. "స్వామిని పొందడంకోసం" అని జవాబిచ్చారాయన. **"మరి స్వామి ఇక్కడే ఉండగా నీవేమో హిమాలయాలకు పోదల్చుకున్నావు. అనేక జన్మల తపస్సు ఫలితంగా నీకు స్వామిని ఇక్కడే సేవించుకొనే మహాదృష్టం లభించింది. దాన్ని జారవిడుచుకోకు"** అని ఉద్బోధించారు, భగవాన్. **"ఎవరైతే నన్ను విశ్వసించి, వారి సమస్త బాధలను, బాధ్యతలను నాకు అప్పగించి నన్ను సేవిస్తారో, వారికి అన్నంతోపాటు అమృతాన్నికూడా అనుగ్రహిస్తాను"** అని మరొక సందర్భంలో ఉద్ఘాటించారు. మాధవుడు మానవాకృతి దాల్చడంలో గల ఆంతర్యాన్ని, తద్వారా మానవాళికి కలిగే పరమ ప్రయోజనాన్ని విశదీకరించే రచన, **"దైవం మానుష రూపేణా"**

సర్వశక్తిమయుడైన కృష్ణ పరమాత్మ యుద్ధ భూమి నుండి వెనుదిరిగి పారిపోవడమేమిటి?! అదీ ఒకసారో రెండు సార్లో కాదు, ఏకంగా 17 సార్లు! నరకాసుర వధకు ఆ లీలావినోది పన్నిన 'మాస్టర్ ప్లాన్'ను అంతరార్థ సహితంగా వివరించే దివ్యోపన్యాసం, **"దీపావళి ప్రబోధ"**

కుటుంబ వ్యవస్థ పటిష్ఠంగా ఉన్నప్పుడే సమాజం సుక్షేమంగా ఉంటుంది. అందుకు ముఖ్యంగా తల్లిదండ్రులు ఆదర్శప్రాయులై పిల్లలను గుణవంతులుగా తీర్చిదిద్దాలి. తల్లిదండ్రులు తిట్టుకుంటూ లేస్తే పిల్లలు కొట్టుకుంటూ లేస్తారని చమత్కరించారు, భగవాన్. 'ధృతరాష్ట్ర ప్రేమ'తో పిల్లల భవిష్యత్తును పాడుచేయకూడదని కూడా హెచ్చరించారు. భగవాన్ సందేశాల వెలుగులో **'ఆదర్శ కుటుంబం'** అంటే ఎలా ఉంటుందో వివరిస్తున్నారు డా॥ బి.వి. పట్టాభిరామ్.

"యత్ర నార్యాస్తు పూజ్యన్తే తత్ర రమంతే దేవతాః" అని ఆర్యోక్తి. ఎక్కడ స్త్రీలు గౌరవింపబడతారో అక్కడ దేవతలు ఆనందంగా ఉంటారు. అందుకు అనుగుణంగానే భగవాన్ తమ అవతారోద్యమంలో స్త్రీ విద్యకు, మహిళా సాధికారతకు పెద్ద పీట వేశారు. బృందావనం, ప్రశాంతి నిలయం కాలేజిలకంటే ముందుగా 1968లోనే భగవాన్ అనంతపురం మహిళా కళాశాలను నెలకొల్పడం ఇందుకొక నిదర్శనం. "గత జీవుడగు పతిన్ బ్రతికించుకొన్నట్టి సావిత్రి భారత సతియె కాదె..." అంటూ భారతీయ స్త్రీ ఔన్నత్యాన్ని భగవాన్ పలు సందర్భాల్లో కొనియాడటం విదితమే! మహిళా దినోత్సవ దివ్యోపన్యాసం, **"స్త్రీ గృహలక్ష్మిగా వర్ధిల్లాలి"**

తొలి దర్శనంలోనే, **"ఆం వచ్చావా! నీకోసమే ఎదురు చూస్తున్నాను... వేచి ఉండు"** అని చెప్పిన భగవాన్ ఆ తరువాత పదిహేనేళ్ళు ఐజాక్ టైగ్రెట్ మొహం చూడలేదు. ఇంకొకరైతే మరో త్రోవ చూసుకునేవారేమో! కానీ, టైగ్రెట్, **"..ఊరక తిరిగిపోవుట భక్తుని దీక్షకాదు"** అని తెలిసినవాడు కావడంచేత అచంచల విశ్వాసంతో, దృఢ దీక్షతో వేచియుండి స్వామి అనుగ్రహానికి పాత్రుడైనాడు. అతని పవిత్ర గాథను తెలిపే సచిత్ర కథనం, **"అందర్నీ ప్రేమించు, అందర్నీ సేవించు"**

మానవుని ధర్మపథంలో నడిపించటానికి భగవాన్ నెలకొల్పిన మూడు మహాక్షేత్రాలు - ముంబైలో 'సత్యం' (సత్యదీప్), భాగ్యనగరంలో 'శివం', చెన్నైలో 'సుందరం'. "నలభై సంవత్సరాల కాలగమనంలో ఎన్నోసార్లు స్వామిని సాక్షాత్కరించుకున్న నిత్య కైలాసం 'శివం" అంటూ ఆ దివ్య క్షేత్ర ప్రాశస్త్యాన్ని తెలిపే రచన, **"శివం, స్వామి హృదయం"**

ఒక విద్యార్థి అడిగిన ప్రశ్నకు సమాధానంగా శరణాగతి తత్త్వానికి భగవాన్ అద్భుతమైన, అనితర సాధ్యమైన వివరణ ఇచ్చారు. ఆ నటనసూత్రధారి వెంటనే ఒక పరీక్షకూడా పెట్టి విద్యార్థులకు మరువలేని పాఠాన్ని కూడా నేర్పారు. నిగూఢమైన ఆధ్యాత్మిక అంశాలను సులభ శైలిలో బోధించటంలోనే కాదు, బోధించిన పాఠాలను మనకు అనుభవపూర్వకంగా నేర్పటంలోనూ స్వామికి స్వామే సాటి అని స్పష్టం చేసే రచన, **"శరణాగతి"**

- సం॥

అవతారవాణి:

సాయి నిజ తత్త్వము

చాలామంది సాయితత్త్వమును అర్థము చేసికొనలేక పోతున్నారు. ఈ సాయి ఎవరు? అనేది ఎవరూ అర్థం చేసుకోలేరు. **నేను సన్న్యాసిని కాదు, యోగిని కాదు, భోగిని కాదు, త్యాగిని కాదు. నేను నేనే.** ఈ 'నేను' అనే పదమే ఆత్మకు మొదటి పేరు. సన్న్యాసికిగాని, యోగికిగాని కొన్ని పరిమితులుంటాయి. కాని, నాకు ఎట్టి పరిమితులూ లేవు. అపరిమితమైన ఆనందమే నాది. **నా పేరు 'నేనే'.** ప్రతి ఒక్కనియందు 'నేను' అనేది నిండియుంటున్నది. అదే 'అహం బ్రహ్మాస్మి'. 'నేను' అనేదే బ్రహ్మతత్త్వం. ఈనాడు అందరూ తెల్లవారి లేచినది మొదలు రాత్రి పరుండునంత వరకు 'నేను' అనే పదాన్ని ఉపయోగిస్తున్నారు. కాని, ఆ 'నేను' ఎవరో ఎవరికీ అర్థం కావడం లేదు. మొట్టమొదట దానిని కనుక్కోవాలి ..... దేహమునకు చావు, పుట్టుకలున్నవిగాని, 'నేను' అనే బ్రహ్మతత్త్వానికి చావు, పుట్టుకలు లేవు. "మమాత్మా సర్వభూతాంతరాత్మా" అన్నాడు, కృష్ణుడు. ఈ 'నేను' అనే పదాన్ని అర్థం చేసుకుంటే అనర్థములకు అవకాశమే ఉండదు.

ప్రేమస్వరూపులారా! ఇది ఈ దేహముయొక్క పుట్టిన రోజేగాని, నాకు పుట్టినరోజు లేదు. **నేడు స్వామి మీకు అందించే సందేశమేమిటంటే, 'స్వామియే మీరు, మీరే స్వామి'. స్వామి మీకంటే ప్రత్యేకంగా లేడు.** మిమ్మల్ని ఇక్కడికి ఎవరు ఆహ్వానించారు?! స్వామిపై ఉన్న ప్రేమచేతనే మీరిక్కడకు వచ్చారు. మీకు, నాకు మధ్యగల ప్రేమచేతనే ఇన్ని వేలమంది ఇక్కడకు చేరారు. I am always ready. నేనెప్పుడూ సిద్ధంగానే ఉన్నాను, తీసికొని పొండి. ఎవరు హృదయపూర్వకంగా ప్రేమిస్తారో, వారి సొత్తునే నేను. నాకు కావలసింది ప్రేమ ఒక్కటే. కనుక, ప్రేమచేత జీవితాన్ని గడపండి. ప్రేమలో మీ జీవితాన్ని లీనం చేయండి. ఇదే మీరు స్వామికి ఇవ్వవలసిన కానుకగా భావించండి.

ప్రేమస్వరూపులారా! మీరు ఈనాడు ప్రత్యేకంగా నేర్చుకోవలసినది సత్యమును పలకడము. సత్యమే మన జీవితానికి ఆధారము. సత్యమే ప్రత్యక్ష పరమాత్మ. ముఖ్యంగా మీరు ఇక్కడికి వచ్చి స్వామి సంభాషణలను విన్నందుకు మీ జీవితాలలో కొంతైనా మార్పు తెచ్చుకోవటం చాలా అవసరం. విదేశాలనుండి అనేకమంది ఇక్కడికి వస్తున్నారు. సమయం చిక్కితే చాలు, ప్రశాంతి నిలయం వెళ్ళి స్వామిని దర్శించాలని కాచుకొని ఉంటారు వాళ్ళు. అలాంటి ఛాన్సు మీకు చిక్కింది. దీనిని మీరు సార్థకము చేసుకోవాలి.

ఎలాంటి పరిస్థితిలోనైనా అసత్యమాడవద్దు. ఒక్కొక్క పర్యాయము సత్యము చెప్పడంవలన ప్రమాదం జరగవచ్చు. అలాంటి పరిస్థితిలో సత్యమూ చెప్పవద్దు; అసత్యమూ చెప్పవద్దు; మౌనం వహించండి. మౌనంచేత సర్వ కార్యములూ సిద్ధిస్తాయి. సత్యం చెబితే అపకారం జరుగుతుందేమో అని భయపడవద్దు. అసత్యము చెబితే నేను పాపినౌతానేమో అని భయపడవద్దు. అలాంటి పరిస్థితిలో మౌనం వహించండి. సత్యాసత్యములు రెండింటికీ అతీతంగా ఉండండి. సాధ్యమైనంతవరకు జీవితమును సత్యమార్గంలో ప్రవేశపెట్టండి.

కొంతమంది, "స్వామీ! మీ పుట్టిన రోజు పండుగకు రావాలనుకుంటే సెలవు చిక్కడం లేదు. 'సిక్ లీవ్' పెట్టి వస్తామ"న్నారు. "అది మంచిది కాదు, నీవు రాకపోయినా మంచిదే కాని, అసత్యము చెప్పవద్దు" అని నేను చెప్పాను. సత్యవ్రతమును ఆచరించండి. సత్యవ్రతముచేత మీకు సర్వేశ్వరుడు సాక్షాత్కరిస్తాడు. సత్యవ్రతముచేత మనం దివ్యత్వమును పొందాలి. ప్రార్థనలచేత పవిత్రతను పొందాలి. జ్ఞానతత్త్వాన్ని మనం అభివృద్ధిపరచుకోవాలంటే ప్రార్థన అత్యవసరము.



నా పుట్టిన పండుగను జరుపుకోవాలని నేను ఎన్నడూ ఆశించలేదు. ఎంతోమంది భక్తులు ఎన్నో ప్రోగ్రాములు ఏర్పాటు చేయాలని ఆశించారు, అనుమతించవలసిందిగా కోరారు. వాటినన్నింటినీ తిరస్కరించాను. ఈనాడు ప్రజలు విశేష సంఖ్యలో వచ్చినారు కనుక, ఇంతమాత్రమైనా ఏర్పాటు చేయవలసివచ్చింది. లేకపోతే, నాకివన్నీ జరపాలనే కోరికే లేదు. ఈ పండుగ చేసుకోవాలనే ఆశే నాకు లేదు. నాకు నిత్యమూ పండుగే. నేను నిత్యానందుడను. నాకు ఆనందము ఇతరులు ఇచ్చేది కాదు. ఇతరులు ఇచ్చే ఆనందముకోసం నేను కాచుకోను. ఆనందము నాలోనే ఉంది.

నేను గుణాతీతుడను. నేనేది చేసినా మీ క్షేమం కోసమే; మీ పవిత్రతకోసమే; మీ ఆనందముకోసమే. మీరు నిరంతరం ఆనందంగా ఉండండి; దోషరహితులై జీవించండి. అదే నాకు ముఖ్యమైనది... నాకేవిధమైన విచారమూ లేదు; ఎలాంటి చింతా లేదు; ఆశలు లేవు. నేను ఏది చేసినా, ఏది చెప్పినా మీ నిమిత్తమే. Whatever I tell, whatever I do, is good for you, good for you. అసలు నేనే మీకోసం ఉన్నాను. నాకంటూ కావలసినదేదీ లేదు. కాబట్టి నన్ను ఉపయోగపెట్టుకోండి. నేను ఎప్పుడూ సిద్ధమేకాని, మీరు పవిత్రమైన భావాలు పెంచుకోవాలి; దివ్యమైన జీవితాన్ని గడపాలి. ఇదియే ముఖ్యమైనది. ... స్వామి విషయంలో సందేహాలకు ఏమాత్రం అవకాశము ఇవ్వకండి. "సంశయాత్మా వినశ్యతి". కనుక, నిస్సంశయులై, దృఢచిత్తులై ఉండండి.

L

'నాకంతా తెలుసు బంగారూ!'

ఆర్.జె. రత్నాకర్, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులు

అవజానన్తి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్
పరం భావ మజానన్తో మమ భూతమహేశ్వరమ్

"నా పరమ భావమును ఎఱుగని మూఢులు సర్వ ప్రాణులకును మహేశ్వరుడను, ప్రభువును అయిన నన్ను లోక కళ్యాణమునకై అవతారములను ఎత్తిన కారణమున సామాన్య మానవునిగా భావించి తక్కువగా ఊహింతురు."

(భగవద్గీత అధ్యా. 9 శ్లో. 11)

భగవంతుడు కాలస్వరూపుడు, కాలాతీత స్వరూపుడు. అందుకే మనం అష్టోత్తర శత నామావళిలో, "కాలాయ నమః కాలకాలాయ నమః కాలదర్ప దమనాయనమః కాలాతీతాయ నమః..." అని స్తుతిస్తుంటాము. అయితే, మనుజులమైన మనకి ఈ అనంతమైన కాలము మూడు విధములుగా వర్తిస్తుంటుంది. ఒకటి భూతకాలము, రెండవది వర్తమాన కాలము, మూడవది భవిష్యత్ కాలము.

అప్రతిహతంగా తిరుగాడే ఈ కాలచక్రంలో ప్రతి క్షణము భూతకాలములో చేరిపోతుంటుంది. రాబోయే నూతన క్షణము తెలియని భవిష్యత్తులో దాగి ఉంటుంది. అయితే, వర్తమానములోనే భూత, భవిష్యత్తులు నిక్షిప్తమై ఉన్నాయని, అందుచేత వర్తమానాన్ని సద్వినియోగ పరచుకొనుటయే దివ్య జీవితానికి నాంది మరియు పునాది అవుతుందని స్వామివారు ఉపదేశించారు. కనుకనే, ఈ 'ప్రెజెంటు' (వర్తమానము) ను 'ఆమ్నిప్రెజెంటు' అన్నారు. భగవంతుడు ఎల్లప్పుడు 'ఆమ్నిప్రెజెంటు'లో ఉంటాడు కాబట్టి, భూత భవిష్యత్తులు అతనికి వర్తింపవు. భూత, భవిష్యత్తులు లేనప్పుడు కాలానికి ప్రమాణమే యుండదు. అందుచేతనే, భగవంతుడు కాలాతీతుడైనాడు.

గడచిపోయిన కాలముగురించి మనము మన జ్ఞాపకాలపైన ఆధారపడుతున్నాము. జరుగబోయేది మనకు తెలియదు కాబట్టి, ఏదో ఒక ఆశావహ దృక్పథంతో జీవిస్తున్నాము. ఈ రెండింటివైపే చూస్తూ, మనముందున్న వర్తమానాన్ని అలక్ష్యం చేయటంవల్లనే మనకు ఇబ్బందులు ఎదురవుతుంటాయి.

భూతకాలమనే వృక్షమునుండియే వర్తమానమనే విత్తనం వచ్చిందని, ఈ వర్తమానములోనే భవిష్యత్తనే వృక్షము ఇమిడి ఉందని స్వామి మనకు పలు సందర్భాల్లో చెప్పారు. కాబట్టి, వర్తమానమును నిర్లక్ష్యం చేయకుండా సద్వినియోగపరచుకున్నప్పుడు భవిష్యత్తు సక్రమంగా, ఆనందమయంగా ఉంటుంది.

ప్రేమరతనాలు - 23

స్వామివారి 85వ జన్మదినోత్సవ వేడుకలను మనం అత్యంత ఆనందోత్సాహాలతో అంగరంగ వైభవంగా జరుపుకున్నాము. వయస్సు దేహానికేగాని, స్వామికి కాదు. ఎన్నోసార్లు స్వామి, "నేను దేహిని" అని చెప్పారు. అయినా మన ఆనందంకోసం ఇలాంటి ఉత్సవాలను జరుపుకోవటానికి ఎంతో దయతో అనుమతించారు. అలాంటి సర్వ సాక్షీభూతుని దివ్య సన్నిధిలో నాకు కలిగిన అనుభవాలు మీకోసం....

జన్మదినోత్సవానికి విశిష్ట అతిథులుగా ఎవరిని ఆహ్వానించాలన్న విషయం కొన్ని నెలల ముందే చర్చకు వచ్చింది. గౌరవనీయులైన భారత రాష్ట్రపతిని మరియు ప్రధానమంత్రిని ఆహ్వానించాలనే అభిప్రాయాన్ని స్వామివారికి మనవి చేశాము. సరే, దానికి తగిన ఏర్పాట్లు చేసుకోండి అని స్వామి తమ ఆమోదాన్ని తెలిపారు.



జన్మదినోత్సవానికి గౌరవనీయ రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభా పాటిల్‌ని, స్నాతకోత్సవానికి గౌరవనీయ ప్రధాన మంత్రి డా॥ మన్మోహన్ సింగ్‌ని ఆహ్వానించాలని తేదీలు ఖరారు చేసుకొని, ప్రోటోకాల్ అనుసారంగా వారిని ఆహ్వానించే ప్రక్రియను మొదలుపెట్టాము.

కొందరు పెద్దలద్వారా మా ఆహ్వానం వారికి అందజేయటం జరిగింది. నవంబరు 21వ తేదీన రాష్ట్రపతి విదేశీ పర్యటనకై పయనమై వెళుతున్నారు కాబట్టి, పుట్టిన రోజు వేడుకలలో పాల్గొనేందుకు వారు రాలేరని, నవంబరు 22వ తేదీన పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో స్నాతకోత్సవానికి ప్రధానమంత్రి రాలేకపోవచ్చునని వారివారి కార్యాలయాల నుండి మాకు అందిన సమాచారాన్ని స్వామివారికి విన్నవించాము. స్వామి అంతా విని మిన్నకున్నారు.

ఆరోజు సాయంకాలం భోజనానంతరం స్వామివారు తమ గదిలోకి ప్రవేశించేముందు, "ఏయ్ రత్నాకర్" అని పిలిచారు. వెళ్ళి దగ్గర నిల్చున్నాను. రాష్ట్రపతి ఎలాంటి చీరలు ధరిస్తారో, ఏ రంగులు ఇష్టపడతారో అడిగి తెలుసుకొని కొన్ని తెప్పించమని, అలాగే మగవారు ధరించే సూట్ దుస్తులుకూడా తెప్పించమని ఆదేశించారు. ఆహ్వానం మేరకు కార్యక్రమాలకు విచ్చేసే విశిష్ట అతిథులకి ఆశీఃపూర్వకంగా భగవాన్ క్రొత్త దుస్తులను ప్రసాదించడం ఆనవాయితీగా వస్తోంది.

స్వామివారి ఆదేశం విని ఆశ్చర్యపోయాము. తమ సంకల్పానుసారం జన్మదినోత్సవ వేడుకలలో వారిరువురూ తప్పక పాల్గొనబోతున్నారన్న విషయాన్ని పరోక్షంగా భగవాన్ మాకు సూచిస్తున్నారా అనిపించింది. ఆ సమయంలో పరిస్థితులు తద్విరుద్ధంగా అగుపిస్తున్నాయి కాని, వారి నోటినుండి ఈ మాట వెలువడిందంటే అది తప్పక జరిగి తీరుతుంది. వారి సంకల్పం ఏవిధంగా సిద్ధిస్తుందో చూసి ఆనందించడమే తప్ప మనం చేయగలిగింది కూడా ఏమీ ఉండదు.

స్వామివారిచ్చిన భరోసాతో మరోసారి ప్రయత్నించాలని నిర్ణయించుకున్నాము. రాష్ట్రపతిని నవంబరు 19న జరిగే మహిళా దినోత్సవానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించటానికి స్వామివారి అనుమతి తీసుకున్నాము. అదేరీతిగా, ప్రధాన మంత్రికికూడా ఇంకొకసారి ఆహ్వానం పంపుదామని నిర్ణయం చేసుకున్నాము.

రాష్ట్రపతిగారు నవంబరు 19వ తేదీన విచ్చేయటానికి ఆనందంగా వారి అంగీకారం తెలిపారు. ఆశ్చర్యకరంగా ప్రధానమంత్రికూడా, పార్లమెంటు సమావేశాలు ప్రారంభమవుతున్నప్పటికీ నవంబరు 22న స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేయటానికి తమ సంసిద్ధతను వ్యక్తం చేశారు.

ఈవిషయాన్ని పెద్దలు స్వామివారికి మనవి చేయగా చిరునవ్వుతో, **"అంతా నాకు తెలుసు బంగారూ!"** అన్నారు. నాకైతే, స్వామివారు మా అమాయకత్వాన్ని చూసి నవ్వినారనిపించింది. కస్తూరిగారు ఒక పర్యాయం స్వామివారికి ఏదో ఒక విషయాన్ని విన్నవించవలసివచ్చిన సందర్భాన్ని గురించి వ్రాస్తూ, "**I had to inform the all-knowing**" అన్నారు. సర్వమెఱిగిన సర్వజ్ఞునికి సమాచారం ఇవ్వటం అమాయకత్వమే కదా!

కచ్చితంగా అంతా స్వామి సంకల్పానుసారమే జరుగుతోందన్న విషయం మాకూ తెలుసు. సందేహమే లేదు. యుద్ధము చేయనని వెనుకడుగు వేసిన అర్జునునితో ఆనాడు కృష్ణ పరమాత్మ, **'నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్'** అని పలికిన పలుకులు ఈసందర్భంగా మనం గుర్తు చేసుకోవాలి. అంతేకదా! ఈ జగత్తంతయు భగవత్ సంకల్పానుసారమే నడుస్తుంది. మనమంతా కేవలం నిమిత్తమాత్రులమే!

నవంబరు 23వ తేదీన జరిగే పుట్టిన రోజు వేడుకలకై శ్రీ సత్యసాయి హిల్‌వ్యూ స్టేడియంలో మూడు నెలలుగా

ఏర్పాట్లు సాగుతున్నాయి. లక్షల సంఖ్యలో విచ్చేసే భక్తులందరూ ఆ పర్వదినమున స్వామివారి దివ్య దర్శనం చేసుకోవడానికి వీలుకల్పించే ఉద్దేశ్యంతోనే ఆ రోజు కార్యక్రమానికి హిల్‌వ్యూ స్టేడియంను వేదికగా ఎంపిక చేయటం జరిగింది. సభా వేదికకు కావలసిన అలంకరణలు, అనుకూలాలు అన్నింటినీ సమకూర్చే పనిలో ఎంతో భక్తి శ్రద్ధలతో రాత్రింబవళ్ళు పనిలో పాల్గొన్నాము.

స్టేడియంలో ఇలాంటి ఏ పెద్ద కార్యక్రమం తలపెట్టినా అప్పుడప్పుడు స్వామివారు వచ్చి సూచనలివ్వడం పరిపాటి. కాని, ఈసారి అనివార్య కారణాలవల్ల స్వామివారు ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో ఒక్కసారికూడా స్టేడియంకు రావటం జరగలేదు. అయితే, అంతకుపూర్వం పలు సందర్భాలలో స్వామివారు ఇచ్చిన సూచనలను, ఆదేశాలను దృష్టిలో పెట్టుకొనే ఏర్పాట్లన్నీ చేశాము.

నవంబరు 22వ తేదీన ప్రధానమంత్రి విచ్చేసి కుల్వంత్ హాల్లో స్నాతకోత్సవంలో పాల్గొని తిరిగి వెళ్ళారు. ఆరోజు సాయంకాలం భోజనానంతరం, స్వామివారికి మరుసటి రోజు జరగనున్న జన్మదిన వేడుకలకు సంబంధించిన వివరాలన్నింటినీ విన్నవించడం జరిగింది. హిల్‌వ్యూ స్టేడియం వారి రాకకోసం సర్వాంగ సుందరంగా ముస్తాబైందని తెలియజేశాము. అంతా విన్న భగవాన్, **"నాకు పుట్టిన రోజు వేడుకలపై ఏమీ ఆసక్తి లేదు. ఇక్కడే హాల్లో జరుపుకోండి"** అన్నారు.

ఆ మాటలు విని నిశ్చేష్టులమయ్యాము. మా కాళ్ళ క్రింద భూమి కంపిస్తున్నట్లనిపించింది. లక్షలాది భక్తులు స్వామివారి దర్శనార్థం పుట్టపర్తికి చేరి ఉన్నారు. ఏర్పాట్లన్నీ చేశాము. స్వామివారు బంగారు రథంపై ఊరేగుతూ వచ్చి భక్తులను ఆశీర్వదించే ఆ శుభ ఘడియలకోసం అందరి హృదయాలూ పరితపిస్తున్నాయని, స్వామి కరుణించి స్టేడియంకు దయచేయాలని పదే పదే వేడుకున్నాము.

"మీరు ఏమి ఏర్పాట్లు చేశారో నేను ఒక్కసారి కూడా వచ్చి చూడలేదు కదా" అన్నారు భగవాన్.

అప్పుడు వేదిక అలంకరణ, విద్యుద్దీపాలంకరణలు మున్నగువాటిగురించి ఒక్కొక్కరం ఎంతో విశదంగా చెప్పసాగాము. కానీ, స్వామి వాటిపట్ల ఏమాత్రం ఆసక్తి కనబర్చలేదు. **"భక్తుల సౌకర్యార్థమై ఏమి చేశారో చెప్పండి"** అన్నారు.

భక్తులు కూర్చోవటానికి స్టేడియంలో ముళ్ళను, రాళ్ళను తొలగించి, శుభ్రం చేసి, కార్పెట్ వేసి సౌకర్యవంతంగా చేశామని, స్టేడియంలోని స్టాండ్స్‌లో ఉండే చిన్నచిన్న రంధ్రాలను సిమెంటుతో పూడ్పించి, ఎలాంటి విషపురుగులకూ ఆస్కారం లేకుండా ఉండేటట్లు కూడా చేశామని విన్నవించాము. ఇంతేగాక, త్రాగునీటి సౌకర్యం, టాయిలెట్ సౌకర్యం, వైద్య సేవలందించడానికి డాక్టర్ల బృందం, అంబులెన్స్ లాంటి అన్ని ఏర్పాట్లూ చేశామని, భక్తులకు ఎట్టి అసౌకర్యం కలుగకుండా ఉండేలాగున అన్ని జాగ్రత్తలూ తీసుకున్నామని మనవి చేశాము.

స్వామి సంతోషించారు. కానీ, వస్తానని హామీ ఇవ్వకుండానే తమ గదిలోకి వెళ్ళిపోయారు. ఇంక, ఆ రాత్రి అంతా మా అందరికీ శివరాత్రే! స్వామి కనికరించి స్టేడియంకు వేంచేయాలన్న ప్రార్థనతో గడిపాము.

పుట్టిన పండుగరోజు ఉదయం దాదాపు పది గంటల సమయంలో స్వామివారు మేడపైనుండి క్రిందికి వచ్చారు. వస్తూనే నన్ను చూసి, **"బంగారు రథం ఎక్కడ నిలిపి ఉంచారయ్యా?"** అని అడిగారు. మా ఆనందాన్ని వర్ణించడానికి ఏ భాషలోనూ పదాలు సరిపోవు. ఒక్కసారిగా కృతజ్ఞతాపూర్వకంగా స్వామివారి పాదాలపై వ్రాలాము. తరువాత, అత్యంత వైభవంగా జరిగిన జన్మదిన వేడుకలను మనమంతా చూసి తరించాము.

స్వామివారికి ఉన్న ఏకైక కోరిక భక్తులకు ఆనందం పంచడమే! తమ శారీరక అసౌకర్యాన్ని సైతం వారు ఏనాడూ లెక్కచేయలేదు. భక్తులను నిత్య సంతృప్తులుగా చేయటమే తప్ప నిరాశపరచడం ఎఱుగరు భగవాన్. భక్తుల ఆనందమే, భక్తుల శ్రేయస్సే తమ అవతార కర్తవ్యంగా ఈ అవనీయానం సల్పిన ఆ మహనీయునికి ఏరీతిగా కృతజ్ఞతలు తెల్పుకోగలము?! ఎన్ని జన్మల్లో ఏమిచ్చి వారి ఋణం తీర్చుకోగలము?! వారి ఉపదేశానుసారం మనల్ని మనం మలచుకోవడమే మన జీవిత పరమార్థం. ఆ ప్రేమమూర్తి చల్లని చూపులు అందరిపై సదా ప్రసరించాలని ప్రార్థిస్తూ...

"సమస్త లోకాః సుఖినో భవంతు" f

ఆరోగ్యప్రదాయి శ్రీ సత్యసాయి

(ధారావాహికం)

డా॥ కె.వి. కృష్ణకుమారి

'ఏకం యేవ అద్వితీయం బ్రహ్మ". ఎక్కడ చూసినా ఒక్కడే ఉన్నాడు. రాముడు వేరు, కృష్ణుడు వేరు, శివుడు వేరూ కాదు. రూప నామాలు వేరైనా దైవం ఒక్కడే! ఇట్టి ఏకత్వాన్ని విశ్వసించి, దైవాన్ని హృదయపూర్వకంగా ప్రార్థించండి. ఎక్కడైనా సరే, వెంటనే సాక్షాత్కరిస్తాడు. ఈ సత్య ప్రేమతత్త్వాన్ని ప్రబోధించే నిమిత్తం సత్యసాయి అవతరించాడు. 'దైవం సర్వత్రా ఉన్నాడని నిరూపించే నిమిత్తమే నేను వచ్చాను. అంతేకాదు. నా ప్రేమను సర్వులకూ పంచే నిమిత్తమై వచ్చాను. అయితే, మీ హృదయమనే పాత్ర ఎంతనో అంతే చిక్కుతుంది. శరీర బంధనాలనుండి మీరు విముక్తులై, అంతరంగంలో ఉన్న భగవంతునిపైన మీరు ఆసక్తిని పెంచుకోండి. తోటి మానవులను ప్రేమించి, వారి బాధలలో భాగం వహించి, వారికి సేవలందించినప్పుడే స్వామికి మీరు జన్మదిన కానుకను అందించినట్లవుతుంది" అంటారు, స్వామి.

పుణ్యకార్యాచరణ ప్రభావం వలననే ఆరోగ్య పరిరక్షణ జరుగుతుంది. పాపభూయిష్ఠమైన ఆలోచనా విధానాలే అనారోగ్య రూపంలో బాధిస్తూంటాయి. త్యాగపూరితమైన సత్కర్మాచరణే పరమౌషధంగా పనిచేస్తుందన్నది పరమ సత్యం. పరమాత్మ సత్యం.

కృతే త్వస్థి గతాః ప్రాణాః త్రేతాయాం మాంస సంశ్రితాః
ద్వాపరే చర్మ సంస్థాశ్చ కలావన్న గతాన్యణాం॥

జీవియొక్క ప్రాణము, వరుసగా కృతయుగమునందు అస్థి (ఎముకలు), త్రేతాయుగమునందు మాంసమును, ద్వాపరమున చర్మమును, కలియుగమున అన్నమును (ఆహారము) ఆశ్రయించి ఉంటుంది. అన్నాశ్రితులైన ప్రాణులకు వివిధ ఆహార పానీయాదులవలన కలిగే అనారోగ్యములు తొలగించుటకు, ఔషధ సేవన కూడా చాలా అవసరం.

"శరీర మాద్యం ఖలు ధర్మసాధనమ్" ధర్మార్థ కామ మోక్ష సాధనకు శరీరమే ప్రధానము. దానిని కాపాడు మార్గమును బోధించుటకు శ్రీమహావిష్ణువు, శ్రీ మద్ధన్వంతరీ రూపములో, సర్వలోక హితమునకు ఓషధితో, అమృత భాండముతో, క్షీరార్ణవమున అవతరించాడు. దీర్ఘకాలంగా వేధిస్తున్న వ్యాధులను నశింపజేసి, సకల శుభములనూ ప్రసాదించడానికి, శ్రీమద్ధన్వంతరీ వ్రతమును చేయించవలసిందిగా విష్ణువు నారదుని ఆదేశించడమూ జరిగింది.

సాక్షాత్తు మూలవిరాట్, గోలోకవాసీ అయిన శ్రీకృష్ణ భగవానుని అవతారమైన సాయికృష్ణుడు సకల జీవకోటి సంక్షేమమునకై, ఆరోగ్య పరిరక్షణకై, కంకణం కట్టుకుని ఎన్నో దశాబ్దాలుగా వారివారి శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, వికాసంకోసం నిర్విరామంగా, దివ్య ప్రబోధాలనూ, ప్రవచనాలనూ అందిస్తూ అనేకవిధాలుగా ఆశీర్వదిస్తూనే ఉన్నారు.

శ్రీమద్ధన్వంతరీ భగవానుడు శ్రీ సత్యసాయి భగవానునిలోని అంశావతరణము. సాయికృష్ణుని నుండి ఆవిర్భవించిన ఆధ్యాత్మిక రూపం, అద్వైత తేజం.

ఐతే, శ్రీకృష్ణాద్యవతార సమయంలో జీవించియుండీ, అవతార రహస్యములేమాత్రం తెలియక, వారిని ఆరాధించక జీవితాలను వ్యర్థం చేసుకున్నవారికన్నా స్వామిని సాక్షాత్తూ శ్రీమన్నారాయణునిగా తెలుసుకుని, దర్శన, స్పర్శన, సంభాషణా భాగ్యములను పొందిన, పొందుతున్న మనమెంత అదృష్టవంతులం!

సంపూర్ణ ప్రేమావతారులైన స్వామి చూపులలో మన ఆరోగ్యం గురించిన ఆర్తి కనిపిస్తుంది. వాక్కులో ధన్వంతరీ సూక్తులు వినిపిస్తాయి. ఆయన అన్వేషణలో మన ఆధ్యాత్మిక ప్రగతికి చెందిన సూత్రాలు గోచరిస్తాయి.

స్వామి అత్యంత ప్రాధాన్యత నిచ్చేదీ, ప్రబోధించేదీ, వ్యాధులు వస్తే తగ్గించుకునే మార్గాలనుగురించి మాత్రమే కాదు, వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలగురించీ, తద్వారా అందుకునే అంతరంగ ప్రక్షాళనగురించికూడా.

"ప్రివెంషన్ ఈజ్ బెటర్ దేన్ క్యూర్" అన్నదే స్వామి ఆకాంక్ష, స్వామి ఆదేశం, స్వామి సందేశం.

"చతుర్విధ పురుషార్థ సాధనకు ఆరోగ్యము అత్యంత అవసరమూ, ఆవశ్యకమూ. హెల్త్ అనేది 'హీలిమ్' అనే పదమునుండి పుట్టింది. 'హీలిమ్' అంటే పవిత్రమూ, పరిపూర్ణమూ అని అర్థము. మానవుని దేహము పవిత్రముగా ఉన్నప్పుడే ఈ పదమునకు సార్థకత చేకూరుతుంది. శరీరమూ, మనసూ, ఆత్మా ఈ మూడింటి చేరికే మానవత్వము. శరీరము మనస్సునూ, మనస్సు ఆత్మనూ ఆశ్రయించాలి. ఈ మూడింటి అన్యోన్యాశ్రయముచేతనే, దేహము ఆరోగ్యమును పొందగలుగుతుంది. దీనికి ఆహారమూ, పానీయమూ, పరిశ్రమా, విశ్రాంతీ అవసరము. కానీ, ఈనాటి మానవుడు ఆహార విహారములను అలక్ష్యం చేయటం వలననే అనారోగ్యవంతుడవుతున్నాడు అంటారు, స్వామి.



"ఓం శ్రీసాయి ఆరోగ్యప్రదాయ నమః"

దశాబ్దాలుగా స్వామి ఆరోగ్య విషయంలో మనకెన్నో ప్రబోధాలు చేశారు. ఆరోగ్యపరమైన ఆవశ్యకతలను, అనేక కోణాలలో విపులీకరించారు. శరీరం ఆరోగ్యవంతంగా, పవిత్రంగా ఉన్నప్పుడే హృదయదేవాలయంలో అంతర్యామి ఆవిష్కరణ జరుగుతుంది. అందుకోసమే, తమ నెలవును శాశ్వతం చేసుకోవటంకోసమే – మనకోసమే స్వామి మన ముందు వైద్యనారాయణునిగా సాక్షాత్కరించారు.

ఈ నేపథ్యంలో ఆరోగ్యపరమైన స్వామి సూక్తులలోని ఆధ్యాత్మికతను, వైద్యపరమైన అనుభవాలను జోడించి 'సనాతన సారథి' పాదాలపైన ఉంచగల అదృష్టం కలగటం, నా పూర్వజన్మ పుణ్యవిశేషం. స్వామి నా కలలోనూ, కలంలోనూ, భావనలలోనూ, భావాలలోనూ, అంతరంగంలోనూ, అంతరాత్మలోనూ నిలిచి, ఆశీర్వాద బలంతో నా సంకల్పానికి ప్రాణప్రతిష్ఠ చేస్తారని అభిలషిస్తున్నాను.

"నా జీవితమే నా సందేశం" అంటారు స్వామి. కనుక, స్వామి ఉపదేశాలలోని సమగ్ర స్వరూపంకోసం, ఉదాహరణకోసం ఎక్కడో వెతకాల్సిన అవసరం లేదు. స్వామి నిత్యాచరణలోనే, నిత్యజీవితంలోనే వారి ఉపదేశాల సారాంశం ప్రతిబింబిస్తూ ఉంటుంది. అంతేకాదు, స్వామి సందేశాత్మకమైన తమ ప్రసంగాలగురించి వివరిస్తూ, 'నావి లెక్చర్లు కావు, మిక్చర్లు' అంటారు. మన భవరోగాలకు దివ్యమైన ఔషధులే స్వామి లెక్చర్లు. ఈ లెక్చర్లు అనే ఔషధాలనుకూడా వినేవాళ్ళకు అవసరమైనంత స్థాయిలో తగిన మోతాదుల్లో అందిస్తారు స్వామి.

డాక్టర్లు కూడా మానవమాత్రులే. వాళ్ళకు వ్యాధులు వస్తే తప్పనిసరిగా ఔషధం తీసుకోవాలి. ఔషధం తీసుకోవటంతోపాటు దానికి తగినట్లుగా ఆహార నియమాలూ, వేళకు నిద్రా విశ్రాంతీ అవసరము. లేకపోతే, వ్యాధి నయం కాదు. ఎవరైనా సరే, రోగ నివారణకు చివరి మోతాదువరకూ ఔషధంమీద విశ్వాసం ఉంచి, ఆ ఔషధం ఇచ్చిన డాక్టర్లమీద కూడా నమ్మకముంచి తీసుకోవాలి. అప్పుడే స్వస్థత చిక్కుతుంది.

అదేవిధంగా ఆధ్యాత్మిక రంగంలో కూడా తన గురువు సర్వవ్యాపకుడై, సర్వజ్ఞుడై, సకల జీవరాసుల

హృదయాలలోనూ నివసించే సర్వాంతర్యామి అన్న విశ్వాసం ఉండాలి. ఈ విశ్వాసంతోపాటు ప్రబల దీక్షతో, అకుంఠితమైన ఆత్మవిశ్వాసంతో సాధన కూడా చెయ్యాలి. "యాదృశీ భావన స్యాత్ సిద్ధిర్భవతి తాదృశీ" భావన ఎట్టిదో సిద్ధి అట్టిది. కనుక, స్వామి ఆదేశాలను ఆచరణలోకి తీసుకురావటంలో మనకు అచంచలమైన విశ్వాసం కూడా తోడ్పడాలి.

"వైద్యో నారాయణో హరిః" సాక్షాత్తు నారాయణుడే మన స్థాయికి దిగి వచ్చి మానసిక, శారీరక, ఆధ్యాత్మికపరమైన ధర్మసూక్ష్మాలను మనకందచేస్తూ, ఆచరణ దిశగా మనలను నడిపిస్తున్నారంటే, ఎంత అదృష్టవంతులం మనం!!

"ప్రతి మానవుని దేహమందు రెండు విధములైన క్రిములున్నాయి. ఆరోగ్యమును నిర్మూలం గావించేవీ, ఆరోగ్యమును అభివృద్ధి గావించేవీ. మన ఆరోగ్యాన్ని సక్రమంగా కాపాడుకోగలిగితే మన శత్రు క్రిములు నిర్వీర్యమైపోతాయి. మానవుడు ఏ కార్యమును చేయవలసి వచ్చినప్పటికీ ఆరోగ్యం అత్యవసరం. ఆనాటి ఋషులు కూడా ఆరోగ్యపరంగానే దివ్యత్వాన్ని అనుభవించ గలిగేవారు.

"శరీర మాద్యం ఖలు ధర్మసాధనం" ధర్మబద్ధమైన ఆత్మసంతృప్తిని అందించే కర్మలనే ఆచరించాలి. శరీరాన్ని ఆశ్రయించే దివ్యత్వాన్ని పొందాలి. శరీరము లేకుండా ఏ సాధనలు చేయుటకూ వీలుకాదు. ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. "ఈనాడు మానవుడు విచారమువలనా, ఆందోళనవలనా గుండెను బలహీనపరచుకుంటున్నాడు. హర్రీ (తొందరపాటు), వర్రీ (ఆందోళన), కర్రీ (కొవ్వు పదార్థము) ఈ మూడింటివలననే గుండె దెబ్బతింటుంది. అందుకే ఈ మూడింటినీ సక్రమమైన మార్గంలో ఉంచగలగాలి" అని స్వామి చెప్పారు.

పూర్వకాలంలో వైద్యులు ఎంతో నిస్వార్థంగా, నిజాయతీగా, త్యాగభావంతో ఉండేవారు. కానీ, ఈనాడు? "వైద్యో నారాయణో హరిః" అన్న ఆర్యోక్తికే కళంకం తీసుకువస్తున్నారు. బీదల బాధలను గుర్తించటం లేదు. త్యాగభావం ఉన్నప్పుడే వ్యాధులు నివారణ అవుతాయి. కానీ, ధనకాంక్ష, భోగభావములు ప్రవేశించడంవలన వ్యాధులులు అభివృద్ధి చెందుతున్నాయి.

ప్రేమభావముతో, ఆత్మీయంగా రోగులను పలకరిస్తే, ఆ ఆదరణ వారిపైన సైకోథెరపీలాగా పనిచేస్తుంది. వారి బాధలన్నీ మరచిపోగలుగుతారు. ఎంత తీవ్రమైన వ్యాధితో వచ్చినవారి దగ్గరైనా వ్యాధి తీవ్రతను చెప్పి పెదవి విరవకూడదు. ఈవిధమైన చర్యలు రోగులను మానసికంగా క్రుంగదీస్తాయి. త్వరగా మృత్యుముఖం దగ్గరకు చేరుస్తాయి. ఔషధాలకన్నా వైద్యుల ప్రియ వచనాలూ, ప్రేమపూరితమైన ధైర్యవచనాలూ రోగుల పాలిట సంజీవనిలా పనిచేస్తాయి అని స్వామి పలు సందర్భాలలో చెప్పారు.

స్వామి ఉద్బోధలలో ధన్వంతరీ రూపం తొంగి చూస్తుంది. ఆ వాక్కులలో దివ్యప్రేమామృతమే పొంగిపొరలుతుంటుంది.

దశాబ్దాల స్వామి ఆరోగ్యసూత్రాలనూ, చికిత్సా విధానాలనూ ఆధ్యాత్మికపరంగా, అంతర్యామి సాక్షిగా, అవలోకన చేసుకుంటూ, నా ఈ సంకల్ప పుష్పాన్ని స్వామి దివ్యపాదపద్మములకు జన్మదిన కానుకగా సమర్పించుకుంటున్నాను.

(సశేషం)

m m

దేహములోని సర్వాంగములు ఎంత సుందరముగా, పుష్టిగా ఉన్నప్పటికీ వీటన్నిటికీ ఆధారమైన గుండె పని చేయని యెడల అవన్నియు ఎంత నిష్ప్రయోజనకరమో మీకు భౌతికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అన్నియు పుష్టిగా, తుష్టిగా ఉన్నప్పటికీ భగవచ్చింతన అనే గుండె లేనియెడల మీరు నిర్జీవులే!

- బాబా

గురుదేవవాణి:

సద్గుణములను పెంపొందించునదే విద్య

నవంబరు 22 సాయి విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ సందర్భంగా...



ప్రేమస్వరూపులైన విద్యార్థినీ విద్యార్థులారా!

వ్యక్తియొక్క విలువ కేవలం విద్యవల్లనే ఏర్పడదు, దీనికి సంస్కారం కూడా తోడుకావాలి. సంస్కారం లేని జీవితం దీపం లేని ఇల్లువంటిది, చెల్లని కాసువంటిది, తెగిన గాలిపటంవంటిది. 'ఎడ్యుకేషన్ (విద్య) అనే ఆంగ్లపదము 'ఎడ్యుకేర్' అనే లాటిన్ పదమునుండి వచ్చింది. 'ఎడ్యుకేర్' అనగా వెలుపలకు తీయడం అని అర్థం. మనకు అగోచరంగా ఉన్నదానిని గోచరింప జేసుకోవడమే ఎడ్యుకేర్; అంతర్భావమునందున్న ఆత్మతత్త్వాన్ని వెలుపలకు తీయడమే ఎడ్యుకేర్. కానీ విద్యార్థులు గ్రంథపరిచయమును మాత్రమే విద్యగా భావిస్తున్నారు. దీని సత్యస్వరూపాన్ని ప్రజలుగాని, ప్రభుత్వంగాని గుర్తించుకోలేక దేశంలో విద్య చాల అభివృద్ధి చెందినదని విశ్వసిస్తున్నారు. విద్యార్థి ప్రధానంగా సంఘ సంక్షేమాన్ని ఆశించాలి; సమాజాన్ని సంరక్షించడానికి పూనుకోవాలి; సమాజసేవ చేయడానికి సర్వవిధములైన జ్ఞానమును సముపార్జించుకోవాలి; సమస్త సద్గుణములను కల్గియుండాలి. కానీ ఇట్టి పవిత్రమైన భావములు ఈనాడు విద్యార్థియందు ప్రవేశించుటకు అవకాశమే లేదు. ఈ దోషం ఎవరిది? విద్యార్థిదా? కాదు. అధ్యాపకునిదా? కాదు. మరి ఎవరిది? అందరిది!

ప్రభుత్వం సంవత్సరానికి విద్య నిమిత్తమై వేల కోట్ల రూపాయలు ఖర్చుపెడుతున్నది. కానీ దీనివల్ల కల్గుతున్న ఫలితమేమిటని విచారణ చేసేవారే లేరు. ఇంతేకాదు, విద్యార్థులను రాజకీయాలలో ప్రవేశపెట్టి వారి భవిష్యత్తును పాడుచేస్తున్నారు. విద్యార్థులు రాజనీతిని నేర్చుకోవడం అవసరమేగాని విద్యారంగాన్ని రాజకీయ రంగంగా మార్చకూడదు. తల్లిదండ్రులు తమ కుమారుడు బాగా చదువుకొంటున్నాడనీ, గొప్ప మార్కులు తెచ్చుకొంటున్నాడనీ, గొప్పవాడుగా తయారౌతున్నాడనీ ఆనందిస్తున్నారేగాని మంచివాడుగా అభివృద్ధికి రావాలని ఆశించడం లేదు. గొప్పతనముండి ఏమి ప్రయోజనం? రావణుడు, దుర్యోధనుడు, శిశుపాలుడు వీరందరూ గొప్పవారే. కారణమేమిటి? వీరికి అన్ని తెలివితేటలు, అన్ని విద్యలు ఉండినాయి. కానీ వాటిని సద్వినియోగపర్చలేదు. శ్రీరాముడు తాను నేర్చిన విద్యలను ఆచరణలో పెట్టి మంచివాడుగా పేరొందాడు. కనుక, తల్లిదండ్రులు ఆశించవలసింది గొప్పతనం కాదు, మంచితనము నాశించాలి. ఈనాటి విద్యార్థులు A నుండి Z వరకు ఉండే డిగ్రీలన్నింటినీ తీసుకొంటున్నారు. కానీ ఫలితమేమిటి? పశుపక్షి మృగాదులవలె వాళ్ళు కూడా కేవలం పొట్టకూటి నిమిత్తమై పాటుపడుతున్నారు. విలువలేని డిగ్రీలను తీసుకొని విలువైన గుణమును కోల్పోతున్నారు. కలిమిని, చెలిమిని, బలిమిని పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నారేగాని

గుణమును పెంచుకోవడానికి ప్రయత్నించడం లేదు. గుణము ఒక్క ఆధ్యాత్మిక మార్గమునందే లభిస్తుంది.

విద్యను ఉచితంగా అందిస్తే సమస్యలే ఉండవు

ప్రాచీన కాలమందలి విద్యను, దాని విలువలను ఒక్కసారి వెనుకకు తిరిగి చూడండి. ఆ కాలంలో వైద్యశాస్త్రాన్ని అభ్యసించే విద్యార్థులను అరణ్యానికి పంపించేవారు. అక్కడ ఏమి నేర్చుకున్నారో తెలుసుకోవడానికి వారిని అప్పుడప్పుడు పరీక్ష చేసేవారు. "నాయనా! నీవు వెళ్ళిన అడవిలో ఏ వృక్షం పనికిరానిది?" అని ప్రశ్నించేవారు. అది పనికిరాదు, ఇది పనికిరాదు అని జవాబు చెప్పినవారికి మార్కులిచ్చేవారు కాదు. ఎందుకంటే ప్రతి వృక్షము రోగములను నివారణ గావించునదే! ఏదీ చేయకపోయినా కనీసం కార్బన్-డై-ఆక్సైడ్‌ను పీల్చుకొని ఆక్సిజన్‌ను అందిస్తుంది కదా! కనుక ప్రతి వృక్షమూ ఔషధమే! ఆ కాలంలో విద్యను ఉచితంగా అందించేవారు. కానీ ఈనాడు అన్నింటికీ ఫీజు ఎక్కువైపోయింది. కనుకనే దేశం ఇన్ని అవస్థలకు గురియైపోతున్నది. ప్రభుత్వం ఫీజు లేకుండా విద్యను ఫ్రీగా అందిస్తే సమస్యలే ఉండవు. మా సంస్థయందు ఫ్రీ ఎడ్యుకేషన్ ఉండడంవల్ల ఏ సమస్యలూ లేవు. మా పిల్లలు, టీచర్లు ఆనందంగా ఉన్నారు, మేమూ ఆనందంగా ఉన్నాము. ఉచిత విద్యాబోధనవల్ల పిల్లల్లో కృతజ్ఞతాభావం కల్గుతుంది, పవిత్రమైన పరివర్తన జరుగుతుంది. ఇట్టి ప్రాచీన విద్యావిధానము, ప్రాచీన సంస్కృతి ఈనాడు పునరుద్ధరింపబడాలి.

విద్య విజ్ఞానంకోసం, కృషి కూటికోసం

విద్యార్థులారా! మీరు గొప్పవారు కావాలని ప్రయత్నించకండి, హృదయంలో మంచితనాన్ని పెంచుకోవడానికి ప్రయత్నం చేయండి. తల్లిదండ్రులను గౌరవించండి, సమాజాన్ని ఉద్ధరించండి, తోటివారికి సహాయపడండి. మీ పాఠ్య గ్రంథాలు ప్రధానం కాదు. ఈ ప్రకృతియే ఒక పెద్ద గ్రంథము. దీని నుండి మీరు నేర్చుకోవలసినవి ఎన్నో ఉన్నాయి. మీరు గురువుకోసం వెతుకనక్కర లేదు. మీ హృదయమే మీ గురువు. మీకు స్నేహితుడు కావలెనా? మంచి స్నేహితుడున్నాడు. అతడే దైవం. అతని స్నేహం పట్టినవానికి జీవితంలో ఎప్పుడూ సుఖమే. ప్రపంచంలో ప్రతి విషయాన్ని మీరు పరిశీలన చేసి అందులోని మంచిని అందుకోవాలి. మంచితనం చేతనే మానవత్వం రాణిస్తుంది. అది లేకుండా కొందరు తామేదో గొప్ప విద్యావంతులమని విఱ్ఱవీగుతుంటారు. అది నాకేమాత్రము ఇష్టం ఉండదు.

విద్యార్థులారా! ఏ చదువు చదివితే మాకు ఏ ఉద్యోగం దొరుకుతుందనీ, సొసైటీ నుండి మాకు ఎంత ఆదాయం వస్తుందనీ మీరు విచారణ చేయకండి. మా చదువులవల్ల సొసైటీకి కలిగే ఉపకారమేమిటని ప్రశ్నించుకోండి. విద్య ఉద్యోగాలకోసం కాదు. విద్య విజ్ఞానంకోసం, కృషి కూటికోసం. ప్రపంచంలో ఎన్నో గొప్పగొప్ప ఉద్యోగాలుంటున్నాయి. అవి చేసేవారికి వేలకొలది రూపాయల జీతాలిస్తున్నారు. ఎవరికి వారు తాము జీతానికి తగిన పని చేస్తున్నామా లేదా? అని ప్రశ్నించుకోవాలి. నెలకు 20 వేల రూపాయల జీతం తీసుకుంటూ 20 రూపాయల పని కూడా చేయకపోతే అది దేశద్రోహమే కదా! ఇలాంటి దుర్మార్గంలో పిల్లలు ప్రవేశించరాదు. కష్టపడి పని చేయాలి, జీతానికి తగిన పని చూపించాలి. అప్పుడే మీ కాన్షియన్స్ సంతృప్తి నొందుతుంది.

విద్యార్థులారా! మీరు ఇక్కడ సద్గుణములను సంపాదించుకొని ఎక్కడికి పోయినా, ఏ సంస్థలో పని చేసినా ఆ సంస్థకు తగిన పేరుప్రతిష్ఠలు తేవాలి. విద్యార్థినులు వివాహమైన తరువాత అత్తవారింటికి పోయినప్పుడు అత్తమామలకు, భర్తకు సంతృప్తికరంగా ప్రవర్తించి మంచిపేరు సంపాదించాలి. "మా కోడలు ఫలాని సత్యసాయి ఇన్‌స్టిట్యూట్‌లో చదివింది. మమ్మల్ని చాలా బాగా చూస్తుంది" అనే మాట అత్తగారి నోటినుండి రావాలి. మిమ్మల్ని కన్నతల్లి Mother in love, మీ అత్తగారు Mother in law. Law లో Love , Love లో Law – ఈ రెండూ చాలా ప్రధానం. మీరెక్కడికి వెళ్ళినా మీ పనులు సక్రమంగా చేయండి. Do your duty sincerely. మీ అధికారుల నుండి సత్కీర్తిని అందుకోండి. ఇదే నాకు ఆనందము, ఇదే నా సందేశము.

(1997 నవంబరు 22న భగవాన్ అనుగ్రహించిన దివ్యసందేశమునుండి)

కవీనాం కవిః (7)

విశాల హృదయులు కావాలి

చీమలకొండ జయాశాస్త్రి

భగవాన్ బాబావారు **"సత్య ధర్మము శాంతి ప్రేమలతో నీ నిత్య జీవనయాత్ర సాగించు"** అని పాడిన పాటలోని కొన్ని చరణముల అంతరార్థమును సెప్టెంబరు సంచికలో అవగాహన చేసుకునేందుకు ప్రయత్నించాము. ఈ పాటలోని మరికొన్ని చరణములయొక్క భావగర్భితాన్ని, నిగూఢత్వాన్ని అనుభవంగా దర్శింపచేసే కవి భగవానునికి కృతజ్ఞతాంజలి.

అష్టసిద్ధుల సాధనెందులకు
అది వట్టి భ్రమలతొ కట్టివేయునుగా
దట్టమైన ఈ జీవితాటవిలో
వట్టి నామమె పట్టపగలొ ॥సత్య॥

అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్య, ఈసిత్వ, వసిత్వ మొదలగు అష్ట సిద్ధులను ఏళ్ళ తరబడి, ఘోర తపస్సులు చేసి సాధించిన ఎందరో, ఇక సాధించవలసినది ఏదీ లేదనే భ్రమలతో సర్వమూ వారి అధీనమే అనే అహంకార, డంబములతో స్వార్థ ప్రయోజనములకు వారి విద్యలను వృథా చేయడము వలన ఎంతో విలువైన కాలమును, మానవత్వమునూ రెండూ మంటగలుపుకుని అధోగతిపాలైనవారి చరిత్రలు ఎన్నో చదివాము. అవి వట్టి జారుడు బండలే కానీ, మానవ జీవితాన్ని పురోగతికి తీసుకొనిపోయే మెట్లు కావని స్వామి చాలా స్పష్టముగా అవి "వట్టి భ్రమలు" అన్నారు. ఇక్కడ 'వట్టి' అంటే ఏమీ లేనటువంటిది మరియు ఊహా జనితమైనదేనని అంటూ, ఎడారిలోని ఎండమావిలాంటి భ్రమలను కల్గించే విద్యలే తప్ప, మానవునికి సద్గతి కల్గించలేవని చెబుతున్నారు. అటువంటి బంధనాలలో చిక్కుకోవద్దని హెచ్చరిస్తున్నారు. భగవాన్ మనకు భగవంతుని చేరే మార్గము గురించి చెబుతూ "దట్టమైన జీవితాటవిలో వట్టి నామమె పట్టపగలొ" అన్నారు. సాధారణముగా అడవి అంటే తీరుతెన్నూలేని దట్టమైన వృక్షాలతో కప్పబడి చీకటితో, కొండలు, కోనలు, నదులు, ఊబులతో, క్రూరమృగములు సంచరించే భయంకర ప్రదేశము. మన జీవితముకూడా ఇటువంటిదే! మనము నిత్యం ప్రమాదాలతో, అభద్రతతో, భ్రమలతో ఏ దారిన వెడితే, ఎక్కడికి పోతామోకూడా తెలియక ఈ అగమ్య గోచరమైన ప్రదేశమునుండి బయటకు వచ్చే దారి తెలియక తిరిగినచోటనే తిరుగుచూ అలసిపోయి మన జీవితాన్ని అర్థాంతరంగా, అర్థరహితముగా ముగించుకుంటున్నాము. అందుకనే మన స్వామి దయతో మనకు "వట్టి నామమే పట్టపగలొ" అన్నారు. ఇక్కడ చాలా చమత్కారముగా "వట్టి" అనే పదము మరల ఉపయోగించారు. ఇక్కడ "వట్టి"కి గూఢార్థముంది. "వట్టి" అంటే ఎటువంటి శ్రమలేకుండా, అత్యంత సులువు అనే అర్థము వచ్చేట్టు చెప్పారు. మొదట చెప్పిన "వట్టి" అంటే అంతా ఉత్తిదే, వృథాయే అనే అర్థము వచ్చేట్టు చెప్పారు. పదము ఒక్కటే, కానీ రెండూ వ్యతిరేకార్థములే! ఎంత చిత్రము! "నామమే పట్టపగలొ" అన్నారు. మనము నిత్యము ఏ పని చేస్తున్నప్పటికినీ, నామస్మరణ మరవకుండా ఉంటే, ఆ నిరంతర నామస్మరణ విష్ణువుయొక్క దివ్య ఆయుధాలలోని ఖడ్గమైన 'నందకి' వలె ఈ జీవితాటవిని నరికి మనల్ని పట్టపగలు తలపించే వెలుగువైపుకి తీసుకొని వెడుతుందని, అంటే నామస్మరణ విడవకుండా ఉంటే చాలును, అది మనలను ఈ తమోంధకారము నుండి జ్ఞానమనే వెలుగువైపునకు తీసుకుని వెడుతుందని, ఇది చాలా సులభమైన మార్గమని చెబుతున్న 'సాయి కవి విష్ణువు'కి శతధా కృతజ్ఞతలు.

హృదయ భూమిని సాగుచేయండి
మీ మనస్సు మడకగ గుణములే ఎద్దుల్
వివేకమను చెలకోలను తీసి
విశాలమగు మీ హృదయము దున్నుడు ॥ సత్య॥

స్వామి మన హృదయమును రాళ్ళు, రప్పలు, కలుపు మొక్కలతో నిండిన సాగుచేయని భూమిగా వర్ణించారు. చిత్రముగా ఇక్కడ చంచలమైన మనస్సునే పనిముట్టుగా చేసుకొని సాగు చేయమంటున్నారు. నాగలి, యరక అనకుండా 'మడక' అని మాండలీకానికి మనుగడ ఇచ్చారు. చంచలమైన మనస్సునకు కఠినమైన పనిని అప్పగిస్తే చంచలముండదని సుస్పష్టంగా తెలియ చేస్తున్నారు. గుణములు ఎద్దులుగా చేసుకొమ్మన్నారు. మంచి, చెడు ఈ రెండు గుణములను పశువులుగా వర్ణించారు. అంటే, మనకు ఒక సమయములో మంచి చెడుగాను, చెడు మంచిగాను తోస్తుంది. ఇవి విచక్షణా జ్ఞానములేని పశు గుణములని చెబుతున్నారు. గుణములనే ఈ రెండు ఎద్దులను అదుపులో పెట్టడానికి వివేకమను చెలకోలను ఉపయోగించమన్నారు. బుద్ధిని ఉపయోగించడమే వివేకము. మంచి, చెడు యొక్క విచక్షణ చేయడమే వివేకము. అందుకని వివేకముతో గుణములనే ఎద్దులను అదుపులో పెడుతూ విశాలమగు మన హృదయ భూమిని దున్నమంటున్నారు. సహజముగా మానవుని హృదయము విశాలమైనదని, దానిని సంకుచిత భావాలతో ఇరుకు చేసుకోవద్దని ఎంత చక్కగా చెబుతున్నారు!

మానవ ధైర్యము మంచి ఎరువుగా
ప్రేమధారలే పంట విత్తులుగా
భక్తే వర్షము భావమే కలుపులు
బ్రహ్మానందమే పండెదు పంట ॥సత్య॥

మానవ ధైర్యము అంటే ధైర్యములు ఎన్నో రకము లున్నాయని కాదు కదా! మానవుని సహజ స్వరూపము ధైర్యము, ఆనందము, ప్రేమ మొదలగునవి. మనకు లోకములో సహజముగా ధైర్యము ఎప్పుడు కలుగుతుంది? మనము తలచిన పనులు ఆత్మవిశ్వాసముతో, సరియైన ప్రణాళికతో చేసి విజయము సాధించినప్పుడు మనము చాలా ధైర్యముగా ఉంటాము. ఎందుకంటే ఆ పని ఏ రకముగా సాధించవచ్చో, ఏమేమి అడ్డంకులు వస్తాయో వాటిని ఎలా అధిగమించాలో ముందుగా క్షుణ్ణంగా తెలుసుకుంటాము కాబట్టి మనము అవగాహనతో ధైర్యముగా ముందుకు పోగలుగుతాము. ఇక్కడ స్వామి మనలను సహజముగానే మీరు ధైర్యస్వరూపులు అంటున్నారు. స్వామి చెప్పిన ఈ మాటతో మనలో ఎంతో ఆత్మవిశ్వాసము, ధైర్యము కలుగుతున్నాయి. ఇటువంటి సహజ ధైర్యమే మంచి ఎరువు అంటున్నారు. ప్రేమధారలే పంట విత్తులుగా చల్లమంటున్నారు. మనము పొలములో ఏ పంటను కావాలనుకుంటే దాని సంబంధించిన విత్తులనే నాటాలి కదా! మనకు ప్రేమ కావాలనుకుంటే ప్రేమ విత్తులనే ధారగా చల్లమంటున్నారు. ఇక ఈ పంట పండడానికి కావలసిన నీరుని భక్తి అంటున్నారు స్వామి. ఎటువంటి భక్తి? నిత్య, సత్య, నిర్మలమైన భక్తి కావాలంటున్నారు. ఇటువంటి భక్తిని వృష్టిగా కురిపించమంటున్నారు. ఇంతటితో మనకు పంట చేతికి రాదు కదా! పైరు పెరుగుదలకు అవరోధమయ్యే కలుపు మొక్కలను సమూలంగా పెరికివెయ్యాలి. మన హృదయ భూమిలో కలుపు మొక్కలైన మన భావాలు లేకుండా ఏరి పారెయ్యాలి అని చెబుతున్నారు. మనకు సద్భావములు, దుర్భావములు రెండూ కూడా మనస్సు నుండే ఆవిర్భవిస్తాయి. ఏ భావములైనా అప్పుడు మనమున్న స్థితిని బట్టి కలుగుతాయి. ఇవన్నీ మారిపోయే భావములే కాని శాశ్వతముగా ఉండేవి కావు. అందుకనే భగవాన్ ఏ భావములైనా సమూలంగా పెరికివేసి నిర్మలముగా ఉండమంటున్నారు. ఏ ఇతర ఆలోచన లేకుండా సర్వమూ భగవదధీనమే అనుకునేవానికి ఇచ్ఛాశక్తి పెరుగుతుందని స్వామి చెబుతుంటారు. అందుకనే స్వామి ఏ భావమునైనా సమూలంగా పెరికివెయ్యమంటున్నారు. లేకుంటే అదే మహా వృక్షములాగ పెరిగి మనకు బంధనమై పురోగతి లేకుండా చేస్తుంది. మన హృదయమును ప్రక్షాళన చేసుకొని బ్రహ్మానందమను పంటను (ఎల్లప్పుడు చెదిరిపోని ఆనందమును) పొందుటకు ఎంత చక్కగా మన కళ్ళకు, మన మనస్సుకు ఆహ్లాదము, ఆనందము కల్గించే పచ్చని పైరుని చూపిస్తున్నారు మన స్వామి.

(సశేషం)



సాయి లీలా విభూతి

కొప్పరపు బాలామనోహరరావు

L

వృత్తులను నివృత్తి చేసుకుంటేనే 'ముక్తి' అంటుంది ఆధ్యాత్మికం. దైవానుభూతులను స్మరించుకోవటం వలన ముందు మార్గదర్శకానికి బలం చేకూరుతుందని అంటారు, సాధకులు. దైవానుభూతులు మార్గదర్శకానికేకానీ, అహంకరించుటకు కాదు. శ్రీ సత్యసాయి అఖండ జ్యోతి. అందరి జీవన జ్యోతులను వెలిగించే దివ్యజ్యోతి.

జీవనజ్యోతి ప్రజ్వలన

27.7.1965న ఈ దాసునకు స్వామి ఒడిలో ప్రవేశం దొరికినప్పుడు వారికి తల్లి అనారోగ్య పరిస్థితిని విన్నవించగా, వారు విభూతి ప్రసాదం పేకెట్లు అనుగ్రహించారు. అవి స్వగ్రామంలోనున్న తల్లిదండ్రులకు పంపించాను. రోజుకొకటి ఆ ప్రసాద పొట్లం సేవించగా, అమ్మకు 25 సం॥ల నుండి బాధిస్తున్న హిస్టీరియా వ్యాధి సంపూర్ణంగా నయమైనది. ఆవిధంగా భగవాన్ ఆమెకు గండము తొలగించి దివ్య జీవితము నిచ్చుట జరిగింది.

ముక్తిప్రదాయ నమః

గత జన్మ స్మృతి కల్గిన మా తండ్రిగారికి 5.9.65న ప్రశాంతి నిలయంలో అభయమిచ్చి, నొసటన తన హస్తముతో ఫాలభాగమున పూయగా మూడు విభూతి రేఖలు ఏర్పడినవి. తన ఆయుర్దాయం 60 సం॥లు అని తెలుసుకున్న తండ్రికి వయస్సు వచ్చిన కొలదీ ఆవేదన ఎక్కువైనది. ఎందుకంటే, 100 రోజుల తపస్సు బాకీ ఉండి ఈ జన్మకు వచ్చితినని, అది పూర్తి చేసుకోవాలని ఆయన తపన. '100 రోజులు కాదు, 54 రోజులు చేయాలి. నీవనుకున్న 100 రోజుల తపస్సును 54 రోజులలో పూర్తి చేసుకొని, తిరిగి నీ గురుపీఠంలో దీక్షా విరమణ చేయాల'ని దీక్షావిధులన్నింటినీ వివరించి, ఆచరింపజేసి స్వామివారు ఆయనకు ముక్తి ప్రసాదించారు. రోజులు ఎందుకు తగ్గించారా అనుకుంటే, దీక్షా విరమణ అనంతరం జడివాన రోజుల తరబడి కురిసి దేవుని ఇంటి వసారా, నివాస గృహము పడిపోయినవి. సర్వజ్ఞులైన సాయి పరమాత్మకు తెలియనిదేమున్నది! అంతకుముందు మా తండ్రిగారి వీపున మెడ క్రింద వెన్నెముక పైభాగంలో ఏర్పడిన పెద్ద వ్రణం కేవలం స్వామి విభూతితో నయమైంది.

జగత్తు అంతయు పరమేశ్వరుని లీలా విభూతి. జగత్తుకు మూడు రెట్లు వారి విభూతులు విస్తరించి యుంటాయని అంటారు పెద్దలు. అదేవిధంగా భగవాన్ బాబావారి ప్రత్యక్ష లీలలు ప్రపంచవ్యాప్తంగా ఎంత విస్తరించినా, పరోక్షంగా దానికి మూడు రెట్లు మానవ మేధస్సుకు అందకుండా విస్తరించియున్నవనుటలో సందేహం లేదు. అవతార పురుషుని సమకాలికత్వాన్ని అనుభవించి, ఆ దివ్యప్రేమను పంచుకొని, పెంచుకొని నవ్య సమాజానికి మార్గదర్శనం చేస్తూ, అఖండ సాయి దివ్యజ్యోతిలో మన జీవన జ్యోతి ఐక్యం చెందుటకు సాధన చేయుటే మన లక్ష్యం, కర్తవ్యం అని తోచుచున్నది.

తల్లిదండ్రులనుండి సాయి ప్రేమను పంచుకున్న తరువాత శ్రీ సత్యసాయి సేవాసంస్థలలో సేవాభాగ్యాన్ని పొందటం స్వామి అనుగ్రహమే! రచన, కార్యాచరణ సర్వమూ సాయిదే! సాయి పరికరాన్ని ఇంకా కొంతకాలం ఉపయోగపెట్టుకోవాలని స్వామి సంకల్పిస్తే, శిక్షణాభారం, భక్తరక్షణాభారం అంతా స్వామియే స్వీకరిస్తారు. ఈ దాసునకు కేన్సర్ వ్యాధి వచ్చిన సమయంలో జ్ఞానాచరణ, ప్రశాంతి, ప్రేమ మొదలైన చిరుపుస్తకములు వ్రాయించి కేన్సర్‌ను కేన్సిల్ చేసినారు. ప్రతి కార్యాచరణ, ఆలోచనల్లో సాయి స్పృహ కలిగి ఉంటేనే హాయి. అప్పుడే స్వామి చెప్పిన మాట వింటాము. ఏమిటా మాట? ప్రేమను పెంచుకొని, సేవద్వారా సాయిప్రేమను విస్తరింపజేసి, సాయీస్వరూపులై ప్రకాశించడం. పరిమాణంకోసం ప్రాకులాడక పరిణామంకోసం ఐక్యత, శ్రద్ధ, సహనము, ప్రేమలతో ముందుకు సాగిపోవటం మరువరాదని స్వామి మనలను సదా హెచ్చరిస్తున్నారు.

మన మధ్యనే నడయాడుచుండి మనతో
మాట్లాడుచున్ నిత్యమున్
కనులకు తోచెడువాడితండని
అలక్ష్యంబైన భావంబున్ మీ
మనమందున్ తల ఎత్తనీయకుదు,
ధర్మశ్రీని రక్షింపగా వ
చ్చిన బ్రహ్మంబని సత్యసాయి
ప్రభునిన్ సేవించినన్ మేలగున్

\- బాబా

దైవం సర్వభూతాంతరాత్మ

మానవుడు భుజించిన ఆహారము ఉదరములో జీర్ణమై దాని సారము సర్వాంగములకు సరఫరా అయినట్లుగా, తాను హృదయంలో స్మరించిన భగవన్నామముయొక్క దివ్యప్రభావం కన్నులలో చేరాలి, చెవులలో చేరాలి, నాలుకపై చేరాలి, చేతులలో చేరాలి, పాదములలో చేరాలి. ఈరీతిగా సర్వాంగములలోనూ ప్రసరించినప్పుడే మానవుడు నిజంగా భగవన్నామమును స్మరించిన వాడౌతాడు. జీర్ణమైన ఆహారముయొక్క సారము కన్నులలో చేరినప్పుడు ఏమౌతుంది? ఎలాంటి ఆహారమో అలాంటి దృష్టి కల్గుతుంది. అదేరీతిగా, హృదయంలో స్మరించిన భగవన్నామంయొక్క ప్రభావము కన్నులలో చేరినప్పుడు దృష్టి పవిత్రమైనదిగా రూపొందుతుంది; నాలుకపై చేరినప్పుడు పవిత్రమైన పలుకులనే పలుకుతాము; చెవులలో చేరినప్పుడు పవిత్రమైన విషయాలనే వింటాము; పాదములలో చేరినప్పుడు పవిత్రమైన ప్రదేశాలకే నడుస్తాము; చేతులలో చేరినప్పుడు సార్థకమైన పనులనే చేస్తాము. ఈరీతిగా, తన సర్వాంగములతో సార్థకమైన కర్మలనాచరించేవాడే నిజమైన మానవుడు. ఏదో దేవాలయాలకు వెళ్ళినప్పుడో, పుణ్యక్షేత్రములను సందర్శించినప్పుడో దైవానికి నమస్కరిస్తే సరిపోదు. ఎవరికి నమస్కరించినా అది దైవానికే చెందుతుందనే సత్యాన్ని గుర్తించాలి. దైవములేని దేహము లేనేలేదు. భగవంతుడు సర్వభూతాంతరాత్మ. ఇట్టి సత్యాన్ని గుర్తించి వర్తించడమే మానవుని ప్రధాన కర్తవ్యం. మానవుడు మొట్టమొదట ఆధ్యాత్మిక మార్గములో ప్రవేశించి, సమాజాభివృద్ధికి కృషి చేయాలి. వ్యక్తిగత ప్రయోజనాలను చివరికి నెట్టాలి. మొదట **S**pirituality (ఆధ్యాత్మికత), తరువాత **A**ssociation (సమాజము), చివరికి **I**ndividual (వ్యక్తి). **SAI** (సాయి) సందేశమిదే.

\- బాబా

3

దైవం మానుష రూపేణా

చంద్రమౌళి రమాదేవి

"భగవంతునికి ఏదీ అవసరం లేదు. ఎందుకంటే, అన్నీ తనకు చెందినవే! మానవులు భగవంతుణ్ని మరచి పోకుండా గుర్తు చేసుకునేందుకు వీలుగా భగవంతుడు అవతరిస్తాడు. మీరు ఉత్తములుగా మారి, మీ జీవితాలను సార్థకం చేసుకునేందుకు తగిన అవకాశాలు కల్పించేందుకే నేను వచ్చాను. నేను అవతరించటానికి అదొక్కటే కారణం."

ఇవి మన ప్రియాతిప్రియమైన ప్రభువు పలికిన మధుర వచనాలు. అంటే, మనలను సన్మార్గాన నడవమని ప్రోత్సహించటానికి, మనిషి జన్మ చరితార్థం చేసుకునే సువర్ణావకాశాలు కూడా తామే ప్రసాదించటానికి శ్రీవారు అవతరించారు. ప్రేమ, కరుణ సాకారమై మానవాళికి మానవత్వం, నైతిక విలువలు బోధించటానికి వస్తే ఆ అనుగ్రహ ప్రసాదం అందుకోలేనివారి, ఆ విలువను గ్రహించలేనివారి అజ్ఞానం చాలా విచారకరమైనది కదా! దైవం మానుష రూపేణ వచ్చి మనిషికి కలిగే శారీరక బాధలు, భౌతికమైన సమస్యలు, చిక్కులు, విమర్శలు, నిందలు ఎందుకు ఎదుర్కొంటాడు? మన స్థాయికి దిగి వస్తే, సామాన్య మానవునిగా భావించవచ్చా? ఆ దేవదేవుని స్థాయి, మహిమ, వైభవం, శక్తిసామర్థ్యాలు మానవుని మేధస్సుకు అందనివి. అందువలననే, తన రాకకి కారణం మరల ఆ అవతారమూర్తే వివరిస్తున్నారు, చూడండి –

"చంటిబిడ్డ భూమిపై ఆడుకుంటూ ఉంటుంది. ఆ బిడ్డయొక్క తల్లి తాను పెద్దదాన్ని కదా అని అహంకరించి, ఆ బిడ్డతో 'నీవు ఎగిరితే నేను ఎత్తుకుంటాను' అంటుందా? ఆ బిడ్డ ఎగరగలదా? ఆ బిడ్డపైనున్న ప్రేమచేత తల్లి తానే స్వయంగా వంగి ఆ బిడ్డను ఎత్తుకుంటుంది. ఆ తల్లి వంగినంతమాత్రాన ఆ బిడ్డకు లొంగిపోయినట్లు అవుతుందా?! కాదు. కాబట్టి, దివ్యస్థానాన్ని పొందలేని అశక్తులైన మానవులను అనుగ్రహించే నిమిత్తమై దివ్యత్వము మానవాకారము ధరించి వారి స్థాయికి దిగి వస్తుంది. మానవ స్థాయికి వచ్చిన మాధవుని అజ్ఞాని తక్కువగా అంచనా వేస్తాడు. ఈరీతిగా రావటం 'వంగటమే' కానీ, 'లొంగటం' కాదు."

"నీవు ఒక అడుగు వేస్తే నేను పది అడుగులు వేసి నీ దగ్గరకు వస్తాను" అని ఎటువంటి భేషజం, అహంకారం లేకుండా ఆ ప్రేమావతారి దయార్ద్ర హృదయంతో పలికితే, ఎందరో ఎందరెందరో స్వామివారి కృపాచ్ఛత్రం ఛాయలోకి చేరుకుని తరించారు, తరించే ప్రయత్నాలు చేస్తున్నారు. సరియైన సమయానికి చేరి ఆ దివ్యావతారి అందించిన ప్రేమామృతాన్ని చవిచూసిన ధన్యజీవులెందరో ఉన్నారు. 'ఆc... ఇప్పుడు దేవుడి అవసరం ఏముంది గనుక?' అంటూ నిర్లక్ష్యం చేస్తున్నవారిని చూసి స్వామి ఈ ఉదాహరణ చెప్పి ఉంటారు:

"పూర్వం ఒక లోభి ఉండేవాడు. వర్షం కురిస్తే అతని ఇంట్లో నీళ్ళు పడుతూండేవి. పొరుగువారు అతణ్ని చూసి ఇల్లు బాగు చేయించుకోవచ్చు కదా అనేవారు. కానీ, అతను 'వర్షాలు కురుస్తుంటే నేనిప్పుడు ఎలా బాగు చేయించగలను? వర్షాలు తగ్గిన తరువాత బాగు చేయిస్తా' అనేవాడు. వర్షాలు తగ్గిన తరువాత, 'వర్షాలు తగ్గాయి కదా. ఇప్పుడింక తొందర ఎందుకు?' అనేవాడు. అదేవిధంగా, వర్షాలు వచ్చిన తరువాత బాధపడటం కాదు, ఇప్పుడే బాగు చేయటం ప్రారంభించండి."

'దుష్ట శిక్షణ' అనే మాట లేకుండా మనుష్యులను దుర్గుణాల వలయం నుండి బయటికి లాగి సత్ప్రవర్తన, సన్మార్గం, సంస్కారం, సత్సంగం, సద్గుణాలు అనే మాటలకి అర్థం తెలియజేసి, సరిదిద్దడానికే తాము వచ్చామని స్వామి పదేపదే తెలియజేశారు. భక్తి అంటే స్వామి చెప్పినట్లు నేను నడుచుకుంటున్నానా లేదా అని గమనించుకోవటం. ఇలా గమనించుకుంటూ ఎందరో స్వామి భక్తులు 'సద్భక్తులు' అనిపించుకునే స్థాయికి ఎదిగారు. తమ అవతార లక్ష్యం గురించి చెబుతూ, తాము

అవలంబించే విధానం కూడా ఆ భక్త వత్సలుడు వివరిస్తున్నారు:

"మిమ్మల్ని నావైపు లాక్కుని మారుస్తాను, తీర్చిదిద్దుతాను. విరిగిపోయి, చిల్లులుపడి, పాడైన లోహపు సామానును బాగు చేసేటటువంటి లోహపువాణ్ణి నేను. విరిగిపోయిన హృదయాలను, వంకరబుద్ధిని, బలహీనమైన నిర్ణయాలను, మసకబారుతున్న, మరుగునపడిపోతున్న విశ్వాసాన్ని పునరుద్ధరిస్తాను."

ఇంకా స్పష్టంగా, అర్థమయ్యేలా వివరిస్తున్నారు, భగవాన్ బాబావారు – "ఆలస్యం కాకముందే నీ మనస్సుని భగవంతుడికి సమర్పించుకో. ఆయన ఇచ్ఛానుసారంగా ఆయనను దానిని తీర్చిదిద్దుకోనియ్యి. మంచిగా ఉన్నటువంటి ఆభరణాన్ని కంసాలికి నీవు ఇవ్వవు. ఆభరణాలను అవి విరిగినప్పుడో, నొక్కులు పడ్డప్పుడో, పాత ఫ్యాషన్‌వి అయినప్పుడో, బాగు చేయడానికో, మార్చడానికో అతనికిస్తావు. అట్లాగే, మొత్తంగా మార్చడానికి కాకపోయినా బాగు చేయాల్సిన అవసరం ఉన్న నీ మనస్సుని భగవంతునికి ఇచ్చేసెయ్యి."

అలా ఆ ప్రత్యక్ష పరమాత్మకి తమ హృదయ మందిరంలోని సింహాసనంపై ఆసీనులు కావలసినదిగా విన్నవించుకున్న భక్తులు లక్షలాదిగా ఉన్నారు. స్వామివారి అవతారోద్యమంలో పనిముట్లుగా సాక్షాత్ ఆ దేవదేవునిచేత ఎంపిక చేయబడ్డ పుణ్యాత్ములకి ఆ భాగ్యం ఎన్ని జన్మల సుకృతఫలమో కదా! స్వామివారు స్థాపించిన విద్య, వైద్య సంస్థలు, సేవాసమితులు, ట్రస్ట్ మున్నగువాటిలో శ్రీవారి నిర్ణయాలపైనే ఎంపిక చేయబడి, స్వామివారి ఆదర్శాలు, సందేశాలు పాటించడమే జీవిత పరమావధిగా భావించి, స్వామి కార్యానికే జీవితాలను అంకితం చేసినవారికి లభించే పుణ్యఫలం ఏ కొలతతో లెక్కింపగలం! ఆ దివ్యహస్తాల సాధనాలుగా వారిని పేర్కొంటారు కదా! మరి ఆ అద్భుత హస్తాల మహిమ ఎటువంటిదో గమనిద్దామా.

రామరావణుల మధ్య యుద్ధం జరుగనున్నది. యుద్ధ సన్నాహములు ప్రారంభమైనాయి. వానరులు సేతు నిర్మాణ కార్యంలో నిమగ్నులై ఉన్నారు. పెద్దపెద్ద రాళ్ళని తెచ్చి, వాటిపై శ్రీరామ అని వ్రాసి, నీళ్ళలోకి వదలివేస్తే, అవి నీళ్ళపైన తేలుతున్నాయి. ఆ దృశ్యాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న రామచంద్ర ప్రభువు మదిలో ఏదో ఆలోచన మెదిలింది. వారు ఒక రాయిని తీసుకుని నీళ్ళలో వేశారు. ఆశ్చర్యం! రాయి 'బుడుంగ్'మని మునిగిపోయింది. తన పేరు వ్రాసి ఉన్న రాళ్ళు తేలుతూండగా, సాక్షాత్తు తన చేతులతో వేసిన రాయి మునగడమేమిటి?! ఇంతలో వెనుకనుండి రాములవారికి ఎవరిదో నవ్వు వినిపించింది. వెను తిరిగి చూస్తే హనుమంతుడు! "ఎందుకు నవ్వుతున్నావు? నీకు అర్థమైన వింత ఏమిటి?" అని ప్రభువు ప్రశ్నించగనే, "ప్రభూ! అందరికీ తెలిసిన విషయమే ఇది. మీరు ఎవరినైతే చేతుల్లోకి పదిలంగా తీసుకుంటారో వారు భవసాగరం దాటిపోతారు. మీరు వదిలేస్తే వాళ్ళు మునిగిపోతారు, అంతే!" అన్నాడు.

వాస్తవానికి ఈ జీవిత సత్యాన్ని ప్రారంభంలోనే గ్రహించినవారు వివేకం గలవారని చెప్పవచ్చు. ఒకసారి అవతారమూర్తి దివ్యచరితని గమనించండి. స్వామి తమ జన్మస్థానంగా లేక అవతారోద్యమ కేంద్రంగా ఢిల్లీ, బొంబాయి, మద్రాసు, బెంగళూరులాంటి మహానగరాలను ఎన్నుకోలేదు. మారుమూల కుగ్రామమైన పుట్టపర్తి. శిరిడీ సాయినాథుని పేరు కూడా తెలియనివారి ఎదుట తాము అవతార పురుషుడనని ప్రకటించారు. కానీ, దివ్యత్వం దాగి ఉండదు. అలాగే దానికి ఎల్లలు ఉండవు. నేడు భక్తులందరూ స్వామివారి దివ్యత్వానికి, సిద్ధసంకల్పానికి కోకొల్లలుగా ఉదాహరణలు చెప్పగలరు. కానీ, అప్పుడు ఈ నీటి సరఫరా పథకాలు, విద్య, వైద్య సౌకర్యాలు, అన్నదాన – ఉపాధి పథకాలు వగైరాలు ఏమీ లేవు. ఈ ఋజువులు ఏమీ లేకుండానే స్వామివారి దివ్యత్వాన్ని ప్రజలు అనుభవపూర్వకంగా విశ్వసించారు. అసలు దివ్యత్వానికి ఋజువులు అవసరమా?! ఎటువంటి ప్రయాణ సౌకర్యాలు, వసతి సౌకర్యాలు లేని రోజుల్లో తరచుగా పుట్టపర్తి వచ్చి, రోజుల తరబడి స్వామివారి దివ్యసన్నిధిలో గడిపిన పుణ్యాత్ముల పూర్వజన్మల సుకృతం ఏమని కొనియాడగలం?! ఆ మహిమాన్వితమూర్తి సాన్నిహిత్యం, ఆ మధురానుభూతులు, అరుదైన అపురూప అనుభవాలు భక్తుల స్మృతిపుటలలో మధురానుభవాలుగా భద్రపరచబడి ముందు తరాలవారికి అద్భుత లీలలుగా అందించ బడుతున్నాయి.

బ్రహ్మాండనాయకుడు మనముందు ప్రత్యక్షంగా మానవాకృతితో కదలి రావటానికి కారణం పలుమార్లు ప్రస్తావించారు. మరి భక్తుల మనోభావాలు ఆలకిద్దాం. ఈ సందర్భంగా కొందరి అభిప్రాయాలు –

స్వామివారిని పరిపూర్ణంగా విశ్వసించిన విదేశీ భక్తులు శ్రీ జేమ్స్ సింక్లెయిర్ అంటారు, "ఎన్నో అవతారాలు వచ్చాయి కానీ, వాటిలో జనబాహుళ్యానికి ఇంతగా అందుబాటులో ఉన్న అవతారం మరేదీ లేదు. భగవంతుడు మన మధ్య నడుస్తున్నాడు, మనను ఓదారుస్తున్నాడు, దారి చూపుతున్నారు, ఎన్నో బోధిస్తున్నారు."

ఫ్రాన్స్ దేశ వాస్తవ్యురాలైన శ్రీ జెన్నీ సోక్రెట్ ఇలా స్పందించారు, "సాయిబాబావారు మనకు లౌకికమైన వస్తువులు ఇవ్వడానికి రాలేదు. మన అజ్ఞానంచేత, వారు ఏ ముఖ్యమైన వస్తువును ఇవ్వటానికి వచ్చారో దాన్ని వదలి తక్కినవాటికి అనురక్తులమవుతున్నాము. వారివ్వదలచినది మోక్షం. వారి పాదపద్మాలకు గాఢంగా, సంపూర్ణంగా నిజాయతీతో సమర్పించుకుంటే తప్ప ఏదీ లభించదు."

అమెరికా నివాసి అయిన దయానా బాస్కిన్ ఇలా వివరించారు, "ఈ అవతారం మానవజాతికి ప్రదానం చేసిన మహత్తర అంశాలను చరిత్ర జాగ్రత్తగా భద్రపరుస్తుంది. ఇంతకు ముందటి మా శూన్య జీవితాలకు మన ప్రియతమ భగవాన్ లక్ష్యాన్నీ, ఆనందాన్నీ, ప్రేమను జతకూర్చారు. అందువల్ల వారి మహత్తుని ధ్యానించి, స్మరించడం తప్ప ఈ జీవితానికి అంతకన్నా ఎక్కువగా ఏమి అడుగుతాము!"

కొంచెం ఆలోచించండి. ఇంతకుపూర్వం ఏ అవతార పురుషునికైనా భౌతిక రూపంలో నడయాడుతుండగా దేశ విదేశాలలో ఇంతటి కీర్తి ప్రతిష్ఠలు లభించాయా? ప్రపంచం మూలమూలల నుండి ఇంత పెద్ద సంఖ్యలో భక్తులు ఎవరి దర్శనానికైనా విచ్చేశారా? ఏ దివ్య పురుషుడైనా ఇన్ని ప్రజాహిత ప్రణాళికలను అమలుపరచారా? ఇంకెవరైనా ఇంత విశాల జన సముదాయాన్ని సన్మార్గాన నడిపించే ప్రేరణగా నిలిచారా? ఇంత సులభమైన సేవా భక్తి మార్గాన నడచి మోక్షం పొందగలమని మనకెవరైనా సూచించారా? జాతి, కుల, భాషా, ప్రాంత భేదాలను మరచి ఐకమత్య భావనతో, దీనజనోద్ధరణ కార్యక్రమంలో అందరూ పాల్గొనగలిగేలా అద్భుత లీల ఎవరైనా చేయగలిగారా? భక్తులకి నామస్మరణమనే మధురాతి మధురమైన సాధనను ఎవరైనా బోధించారా? త్యాగం, వైరాగ్యం, ప్రేమల సమ్మిళిత సాకార రూపం ఇలా లక్షలాదిమంది బాధలను విని సాంత్వన చేకూర్చిన విధానం ఇంకా ఎవరి గురించి అయినా విన్నామా? 'ప్రేమ' అనే ఒక విశాలమైన వృత్తం గీసి, పూర్తి మానవాళిని అందులోకి ఆహ్వానించిన అద్వితీయమైన, అపురూపమైన, అద్భుత లీల శ్రీ సత్యసాయిబాబావారు తప్ప మరెవరైనా చేశారా, చేయగలరా?!! తమకి తామే సాటి అయిన, హృదయవాసి అయిన ప్రభువుని సరిగ్గా కీర్తించగలగడం మనకి సాధ్యమా?! మానుష రూపేణా వచ్చి ఆదరించిన దైవానికి కృతజ్ఞతలు ఏ మాటలలో తెలుపగలము?!

నవంబరు మాసంలో ప్రశాంతి నిలయంలో జరుగనున్న విశేష కార్యక్రమాలు, ఉత్సవాలు

2013 నవంబరు 18	**రథోత్సవం**
2013 నవంబరు 19	**మహిళా దినోత్సవం**
2013 నవంబరు 22	**సాయి విశ్వవిద్యాలయ 32 వ స్నాతకోత్సవం**
2013 నవంబరు 23	**భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి జయంతి**

దీపావళి ప్రబోధ

L

పర్వదినములు ఒక్క భారతదేశమునందేకాక, సమస్త ప్రపంచమందు వేరువేరు కాలములు, కారణములు, నామములను పురస్కరించుకొని పవిత్రతను అందించుచున్నవి. మహనీయుల అనుభూతులచే ఆధ్యాత్మిక మార్గమును చూపించుచు, మానవ జాతిని భగవంతునివైపు మరల్చుచున్నవి. ఆత్మతత్త్వమును ప్రబోధించుచున్నవి.

శ్రీకృష్ణుడు సత్యభామాసమేతుడై నరకాసురుని పైకి యుద్ధానికి వెళ్ళాడు. సత్యభామ చేతిలో నరకాసురుడు హతుడయ్యాడు. సర్వశక్తిమయుడైన కృష్ణుడే అతనిని ఎందుకు హతమార్చకూడదు? సత్యభామచేత ఎందుకు చంపించాడు? అనగా, భగవంతుని చేతిలో మరణించడానికికూడా కొన్ని క్వాలిఫికేషన్లుండాలి. నరకాసురుడు దయాప్రేమలు లేని రాక్షసుడు. అలాంటి దుర్మార్గునికి తన చేతిలో మరణించే అర్హత లేదని భావించాడు కృష్ణుడు. నరకుడు స్త్రీలను చెఱపట్టి వారిని అనేకవిధాలుగా హింసించాడు. కాబట్టి, ఒక స్త్రీ ద్వారానే వానిని చంపించాలని నిర్ణయించుకొని, సత్యభామను తన వెంటపెట్టుకొని కృష్ణుడు వానిపైకి యుద్ధానికి వెళ్ళాడు.

(నరకుడు భూమాత పుత్రుడనియు, తల్లి తనను ఎలాగూ చంపదనే ధైర్యంతో నరకుడు తల్లిచేతిలోనే తనకు మరణం సంభవించవలెననే వరము పొందినాడని, ఆ కారణముచేతనే శ్రీకృష్ణుడు భూదేవి అంశయైన సత్యభామ చేత నరకుని సంహరింపజేశాడని భగవాన్ మరొక సందర్భంలో వివరించారు).

నరకాసురుని రాజ్యమునకు ముఖ్యపట్టణం ప్రాగ్జ్యోతిష పురం. 'ప్రాగ్' అనగా ముందు. 'జ్యోతి' అనగా వెలుగు. 'ష' అనగా మర్చిపోవటం. ప్రాగ్జ్యోతిషపురము అనగా ముందు జ్యోతిని మరచినవారు ఈ ప్రాగ్జ్యోతిష పురములో నివాసము చేస్తారు. ముందు జ్యోతి అనగా ఏమిటి? అదియే ఆత్మజ్యోతి. ఆత్మజ్యోతిని మరచినవారికి ప్రాగ్జ్యోతిష పురములో నివాసము. నరకాసురుడు ఆత్మతత్త్వాన్ని మరచిపోయి దేహతత్త్వాన్ని అభివృద్ధిపరచుకొని దేహభావము పెంచుకొని అజ్ఞానాంధకారములో కాలమును గడుపుతూ వచ్చాడు. మనము ఆత్మజ్యోతిని పెంచుకోవాలి, ఆత్మాభిమానము పెంచుకోవాలిగానీ, దేహాభిమానమును కాదు. ఈ దేహాభిమానమే అనేక కష్టములకు, నష్టములకు, దుఃఖములకు గురిచేస్తున్నది. అనేక అనర్థములకు మూలకారణం దేహాభిమానమే.

తమోగుణముచేత చేరినవాడు కనుక నరకుడు అని పేరు. అధోగతికి ప్రయాణం సల్పేవాడే నరకుడు. ఊర్ధ్వగతిని ప్రయాణం చేసేవాడు నరుడు. మన జీవన జ్యోతిని మనం ఊర్ధ్వగతిగా ప్రజ్వలింపచేసుకోవాలి, పెంచుకోవాలి. ఉత్తమమైన భావములు, పవిత్రమైన చర్యలు నిశ్చలమైన చిత్తముతో అభివృద్ధిపరచుకోవాలి. అపవిత్రమైన చర్యలచేత అసహ్యమైన చర్యలచేత, మనయొక్క దృష్టిని అధోగతికి పోనిచ్చుకుంటున్నాం. ఇటువంటి దుశ్చర్యలలో పాల్గొన్న దుర్మార్గులను

భగవంతుడు కూడా సంహరించటానికి ప్రయత్నించడు. వానిపైన దయనా? ప్రేమా? కాదు, కాదు. వానిని సమీపించటానికి కూడా భగవంతుడు అంగీకరించడు. కనుక, కృష్ణుడు నరకుని శక్తి సామర్థ్యములు క్రమక్రమేణ క్షీణింపచేయటానికి ఒకవిధమైన master plan వేశాడు. ఆ నరకాసురుని దేహపుష్టి చాలా గొప్పది. మానసిక శక్తి కూడా చాలా గొప్పది. కనుక, అతని శరీర, మానసిక శక్తులను క్రమక్రమేణా క్షీణింపజేయాలని సంకల్పించాడు. మానవుడు ఎంత బలవంతుడైనా మితిమీరి క్రోధానికి గురి అయినప్పుడు దేహపుష్టి తగ్గిపోతుంది. మానవునికి ఒక్క పర్యాయం క్రోధం వచ్చిందా, మూడు నెలలు ఆహారం భుజించటంవలన ఏర్పడిన శక్తి అంతా క్షీణించిపోతుంది. అనేక పర్యాయములు నరకాసురునిపై యుద్ధమునకు పోవటం, అతను క్రోధంతో తరుముకొని వచ్చినప్పుడు తిరిగి వెనక్కు రావటం చేస్తూ ఉండేవాడు కృష్ణుడు. క్రోధాన్ని తెప్పించి తద్వారా అతని శరీర శక్తిని పూర్తిగా హతమార్చాలని సంకల్పించుకున్నాడు. ఈవిధంగా మితిమీరిన క్రోధముచేత నరకుడు శక్తినంతా హతము చేసుకొని బలహీనుడైనపుడు శ్రీకృష్ణుడు తాను చంపకుండా ప్రకృతి ధర్మం ప్రకారం స్త్రీలను బాధపెట్టినవానిని స్త్రీతోనే చంపించాలి కనుక, సత్యభామను తీసుకొనిపోయి ఆమెచేత చంపించాడు.

నిరహంకారమే ఆత్మజ్ఞానియొక్క ప్రథమ లక్షణము, లక్ష్యము. అహంకారముచే భుజబలము, ధనబలము, బుద్ధిబలము లభివృద్ధి చేసికొన్నప్పుడు మానవుడు, దానవుడైపోతాడు; లోకకంటకుడైపోతాడు. అసత్యమైన అనిత్యమైన దేహమునే సత్యమని నమ్మితే, అధోగతికాక మరేమీ ప్రాప్తించదు. అహంకార మూలముగా దేహభ్రాంతి, దేహభ్రాంతివలన అన్ని రకముల వాంఛలు పెరుగును; తన తత్త్వమే తాను మరచిపోవును, మరుగునపడును. అనేకత్వమే కనబడును, నామరూపములే నాట్యమాడును. అయితే, ఏకత్వములోనే శాశ్వతమైన ఆనందమున్నది. అనేకత్వములో నిరహంకారము యేమాత్రమూ రాదు. దేహభ్రాంతిని, చంచలత్వముతో కూడిన మనోతత్త్వమునూ విసర్జించి, అందరియందు వెలుగొందే ఆత్మతత్త్వమును తెలుసుకొన్నవానికి నిత్యానందము లభించును. సర్వ అనర్థములకూ ప్రాగ్జ్యోతిషమే కారణము. అంటే, ఆత్మసత్యమును మరచిపోవుట. అసురుడు అంటే ఎవరు? అంధకారములో పడినవాడు, నక్తంచరుడు, చీకటిలోనే విహరించువాడు, జ్ఞానజ్యోతి హృదయస్థానమందు వెలుగనివాడు. కామ క్రోధ లోభ మోహములచే మలినమైన బుద్ధికి ఇంద్రియములను అరికట్టుటకు సామర్థ్యముండదు. అప్పుడు మనస్సు తమస్సుచే నిండిపోతుంది. సత్యముచే, అతని అసత్యము నశించినప్పుడు, పరమాత్మలో నరకుడు లీనమైనాడు. ఇది ఈ కథయొక్క ప్రబోధ.

దీపము వెలిగించి పర్వదినమాచరించేది, దివ్యజ్ఞానము యొక్క సంకేతము మాత్రమే కాదు; అది ఏకత్వమునుకూడ ప్రబోధించును. దీపమాలను వెలిగించునప్పుడు ఒక్కొక్క దీపమును విడివిడిగా, ఒక్కొక్క పుల్లతో అంటించ నక్కరలేదు. ఒక జ్యోతిని ప్రథమమునందు అంటించుకొని దానితో అన్నిటినీ అంటిస్తాము. ఈ జీవనజ్యోతులన్నిటికీ ఒక్క ఆత్మజ్యోతియే ఆధారము. ఎన్ని వేల దీపములను అంటించిననూ, మొదటి జ్యోతి తగ్గదు, పెరుగదు. అన్నిటినీ అంటించు ఆత్మజ్యోతి ఆధారము లేనిది; బంధితులైన జీవన జ్యోతులను అది ముక్తపరచును.

నరకాసుర సంహారమనగా నరునిలో దాగిన అసురుని చంపడం. ప్రతి వ్యక్తియందు ఒక అసురుడున్నాడు. వానిని చంపాలంటే ఎక్కడికో పోయి అస్త్రశస్త్రములను సంపాదించనక్కర్లేదు. హృదయమునందే ఉన్న ఆత్మస్వరూపాన్ని చింతిస్తూ రావాలి. అదియే ప్రేమస్వరూపము. ప్రేమచేతనే నరునిలో ఉన్న అసురుని సంహారము చేయవచ్చును. వీడు అస్త్రశస్త్రములతో చచ్చేవాడు కాదు. ఈ లోకంలో ఎన్ని అస్త్రశస్త్రములు లేవు?! అవేమి చేయగల్గుతున్నాయి?! నిజం చెప్పాలంటే, ఈ అస్త్రశస్త్రములద్వారా మానవుడు తనను తానే హింసించుకుంటున్నాడు. మొట్టమొదట మానవుడు ఆత్మాభిమానమును అభివృద్ధిపరచుకోవాలి. అప్పుడే తనలో ఉన్న నరకుడు చచ్చిపోతాడు. ఈ సత్యాన్ని గుర్తించి వర్తించడమే నిజమైన భక్తి.

(దీపావళి పర్వదిన సందర్భమున భగవాన్ అనుగ్రహించిన దివ్యోపన్యాసములనుండి)

ఆదర్శ కుటుంబం

డా॥ బి.వి. పట్టాభిరామ్

H

“జగత్తునకు కుటుంబం చాలా ప్రధానమైనది. కుటుంబం సక్రమంగా ఉన్నప్పుడే జగత్తు సక్రమంగా ఉంటుంది. కుటుంబంలో ఐకమత్యం క్షీణిస్తే జగత్తు అనేక బాధలకు గురికావలసివస్తుంది. ఐకమత్యం జీవితానికి బలము కనుక మానవుడు ఐకమత్యం సాధించాలి. అన్యోన్యతను పెంచుకోవాలి” అని 2003వ సంవత్సరం శివరాత్రినాడు భక్తులకు సందేశమిచ్చారు, భగవాన్ బాబా.

ఈ ఐకమత్యం, అన్యోన్యతలు ఈనాటి కుటుంబాల్లో చాలా అరుదుగా కనబడతాయి. తల్లిదండ్రులంటే భక్తి భావం తగ్గుతోంది. తాత బామ్మల సంగతి సరేసరి. భార్యాభర్తల మధ్య సత్సంబంధాలు కొరవడుతున్నాయి. విడాకుల సంఖ్య పెరుగుతోంది. ఇంట్లోంచి పారిపోయే పిల్లల సంఖ్య పెరుగుతోంది. ఆస్తులకోసం అన్నదమ్ములే కత్తులు దూసుకుంటున్నారు. ఆనాడు రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు ఐకమత్యంతో, అన్యోన్య ప్రేమతో సుప్రీం స్టేజికి వెళితే, ఈనాడు అన్నదమ్ములు ఆస్తుల తగాదాతో సుప్రీం కోర్టుకు వెళుతున్నారు. అంతేకాదు, పెద్దలకోసం వృద్ధాశ్రమాల సంఖ్య పెరుగుతోంది. పిల్లలు పోషించలేని స్థితిలో ఉంటే వృద్ధాశ్రమంలో చేరినా అర్థం ఉంది. సమాజంలో ఆర్థికంగా స్థిరపడినవారుకూడా తమ తల్లిదండ్రుల్ని ఆ ఆశ్రమాలకు పంపించివేస్తున్నారు, లేదా వాళ్ళే వెళ్ళే పరిస్థితి తెస్తున్నారు, అని స్వామి అన్నారు. “ఒకప్పుడు మా అబ్బాయి తిండి తినక ఏడ్పించేవాడు, ఇప్పుడు పెద్దయ్యాక తిండి పెట్టక ఏడిపిస్తున్నాడు” అని కుమిలిపోతున్న తల్లులున్నారు.

ఆదర్శ కుటుంబమంటే ఈశ్వర కుటుంబమే

ఆదర్శ కుటుంబమంటే ఎలా ఉండాలో వివరిస్తూ బాబా ఈశ్వరుడి కుటుంబంగురించి ఆసక్తికరమైన విషయాలు ప్రస్తావించారు.

“ఈశ్వర కుటుంబంలో ఉన్న సభ్యులు నలుగురే, వారు ఈశ్వరుడు, పార్వతి, గణపతి, సుబ్రహ్మణ్యం. ఈ నలుగురూ జగత్తునకొక గొప్ప ఆదర్శాన్ని అందిస్తున్నారు. వీరిలో ఒకరికొకరి మధ్య ఏ సమస్యలుకానీ, ఎలాంటి భేదాభిప్రాయాలుకానీ లేవు. అలాగే వీరి వాహనాలు చూడండి. ఈశ్వరుని వాహనము నంది. పార్వతీదేవి వాహనం సింహము. అవి అన్యోన్యంగా ఉంటూ ఆదర్శం అందిస్తున్నాయి. అంతేకాదు. సుబ్రహ్మణ్యుని వాహనం నెమలి, వినాయకుడి వాహనం మూషికం, ఈశ్వరుని ఆభరణాలు నాగములు. సాధారణంగా నెమలిని చూస్తే పాములు బుసకొడతాయి; ఎలుకను చూస్తే పట్టుకుని మ్రింగడానికి ప్రయత్నిస్తాయి. కానీ, సుబ్రహ్మణ్యుని వాహనమైన నెమలి, గణపతి వాహనమైన ఎలుక, ఈశ్వరుని ఆభరణములైన పాములు ఐకమత్యంగా జీవిస్తున్నాయి. ఇంక ఈశ్వరుని స్వరూపం ఎలాంటిది? శిరమునందు గంగ, శిఖపైన చంద్రుడు, ఫాలనేత్రములో అగ్ని. నీరు, అగ్ని పరస్పర విరుద్ధమైనవి...... పార్వతీ పరమేశ్వరుల కుటుంబం ప్రపంచానికి అడుగడుగునా ఆదర్శం అందిస్తోంది. కానీ, ఇట్టి ఆదర్శం ఈనాడు ఏ కుటుంబంలోనూ కనిపించడం లేదు. తమ్ముని భార్య ఏదైనా మంచి నగ చేయించుకుంటే, అన్న భార్యకు అసూయ కలుగుతుంది. ఒకరి మంచిని చూసి

ఆనందించవలసిందిపోయి అశాంతిని పొందుతున్నారు. ఐకమత్యం, అన్యోన్యత ఉన్నచోట అశాంతికానీ, భయముకానీ ఏర్పడవు" అని సందేశమిచ్చారు, భగవాన్.

ఈ కాలం యువతీ యువకుల్లో అధిక శాతం పాశ్చాత్య ప్రభావంలోపడి మన మర్యాదలకు, సంప్రదాయాలకు తూట్లుపొడుస్తున్నారు. గతంలో ఒక్కో ఉమ్మడి కుటుంబంలో నలభైమంది కుటుంబ సభ్యులు, ఆనందంగా, ఐకమత్యంగా, ఒకరికొకరు తోడుగా ఉంటూ జీవించేవారు. కుటుంబ పెద్ద ఆజ్ఞలను అందరూ శిరసావహించేవారు. ఆయన చెప్పిందే వేదం. అందుకే ఆ రోజుల్లో అత్తా కోడళ్ళ సమస్యలు లేవు. అన్నదమ్ములమధ్య తగాదాలు లేవు. తోడి కోడళ్ళు తోడబుట్టినవారి కన్నా ఆత్మీయంగా ఉండేవారు. ఎవరు ఏ పని చేయాలన్నా పెద్దాయనే నిర్ణయించేవారు. ఆయనే ఆ ఇంటికి జడ్జి, ఆయనే నాయకుడు, ఆయనే సలహాదారుడు, ఆయనే ఆ ఇంటి సైకాలజికల్ కౌన్సిలర్.

ఆరోజుల్లో ఎవరైనా విద్యార్థి పరీక్ష తప్పితే, ఇప్పటిలాగ ఆత్మహత్యలు చేసుకోవటం, ఇల్లు వదలి పారిపోవటంకానీ చేసేవారు కాదు. తిన్నగా తాతయ్య దగ్గరకు వెళ్ళేవారు. ఆయన, "ఫరవాలేదులే! మీ నాన్న ఏమీ అనడు. తానుకూడా ఫెయిలయ్యాడు. ఇప్పుడు బాగా చదువుకో. నీకు సైకిల్ కొనిపెడతాను" అని ధైర్యం చెప్పేవాడు. ఆ మాటల్లో ఓదార్పుతోపాటు ప్రేరణకూడ ఉండేది. ఇపుడు వారేరీ?

కిం కర్తవ్యం?

పూర్వం ఉమ్మడి కుటుంబాల్లో ఉన్న ఐకమత్యం ఇప్పుడు ముగ్గురు, నలుగురు సభ్యులున్న కుటుంబాల్లో కూడా తగ్గటానికి కారణాలు విశ్లేషణ చేయటంకన్నా, ప్రస్తుతం ఎలా ఉండాలి? అనే ప్రశ్నకు సమాధానం బాబా ప్రసంగాల్లో అడుగడుగునా దొరుకుతుంది. ఒకసారి విద్యార్థులతో మాట్లాడుతూ, "అందరితో ప్రేమగా మాట్లాడండి. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఒకరినొకరు ద్వేషించకూడదు. మన చేతికున్న ఐదు వ్రేళ్ళూ ఐకమత్యంతో పనిచేయకపోతే ఏ చిన్న పనైనా మనం చేయలేము కదా! పాండవులు ఐదుమందే కానీ ఐకమత్యంతో పరమాత్మ ప్రేమకు పాత్రులు కాగలిగారు. కానీ, కౌరవులు నూరుమంది ఉన్నప్పటికీ ఏమి సుఖాన్ని అనుభవించారు?! వాలి, సుగ్రీవుల పరిస్థితికూడా అంతే! కాబట్టి, ఎన్ని కష్టములైనా సహించుకుని, భరించుకుని మీరు ఐకమత్యాన్ని పోషించుకోవాలి" అని ఉద్బోధించారు.

కుటుంబంలో ఐకమత్యం అభివృద్ధి చేసుకోవాలంటే, ఇటు పెద్దలు, అటు పిల్లలుకూడా పవిత్ర హృదయాలతో ఒకరినొకరు ప్రేమించుకుంటూ, అభినందించుకుంటూ ఉండాలి. సమయాన్ని వృథా చేసే టీవీ కార్యక్రమాలు, కబుర్లు విడిచిపెట్టి, సత్సంగాల్లో పాల్గొనాలి. సామాజిక కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి.

తల్లిదండ్రుల బాధ్యత

నేటి యువత పక్కదోవ పట్టటానికి సమాజం మాత్రమే పూర్తి బాధ్యత వహించాలనుకోకూడదు. తల్లిదండ్రుల బాధ్యతకూడా ఉంది. ఈనాటి తల్లిదండ్రులు తమ పిల్లలతో రిలేషన్‌షిప్ తగ్గించి ఫ్రెండ్‌షిప్ పెంచుకోగలిగితే, కుటుంబంలో ప్రశాంతతను నెలకొల్పవచ్చు.

నువ్వు తప్పు చేస్తున్నావని వేలెత్తి చూపే బదులు వారి వేలు పట్టుకుని నడిపించాలి.

చెడ్డ స్నేహితులు వద్దని చెప్పే బదులు మీరే వారికి మంచి స్నేహితులుగా మారిపోవాలి.

సమాజం తమకేమిచ్చిందని ప్రశ్నించే పిల్లలకు మనం సమాజానికి ఏవిధంగా సేవ చేద్దాం? అనే ప్రేరణ కలిగించాలి.

ర్యాంకులు, బ్యాంకులు ముఖ్యమేకానీ, మానవతా విలువలు అంతకన్నా ముఖ్యం అని పిల్లలకు బోధించాలి.

పెద్దలను, ఉపాధ్యాయులను గౌరవించాలి. భారతీయ సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడుకోవాలి.

బాబా ఉపదేశించినట్లుగా సత్య, ధర్మ,శాంతి, ప్రేమ, అహింసలనే ఆయుధాలుగా స్వీకరించి ముందుకు సాగాలి.

తల్లిదండ్రులు రోల్‌మోడల్‌గా ఉండాలి. వారు తమ పెద్దలను గౌరవించినప్పుడే పిల్లలనుండి గౌరవాభిమానాలను పొందగలుగుతారు.

ఐదు 'టీ'లు

ప్రతి ఉదయం తల్లిదండ్రులు ఐదు 'టీ'లు పాటించాలి. అంటే ఇంగ్లీషు అక్షరం T తో మొదలయ్యేవి.

T : Time: పిల్లలతో సరదాగా గడపండి

T : Talk: పిల్లల్తో మాట్లాడండి

T : Touch: పిల్లల్ని ప్రేమతో నిమరండి

T : Trust: వారు అద్భుతాలు చేయగలరని నమ్మండి

T : Teach: వారికి విలువలు బోధించండి

ఈనాటి తల్లిదండ్రులు కొంతమంది ఇటువంటి విషయాలు మరచి పిల్లలకు సకల సౌకర్యాలు అందజేస్తున్నారు.

అందుకే బాబా ఒక ప్రసంగంలో ఇలా అన్నారు:

"తమ కుమారుడు ఎట్టివాడైనప్పటికీ ధనార్జన చేసి అతనికి అందించటమే తల్లిదండ్రుల కర్తవ్యమని భావిస్తున్నారు. ధనమును సంపాదించి, లేక గృహమును కట్టించి, సదుపాయములు చేయుటయే తల్లిదండ్రుల కర్తవ్యం కాదు. గుణవంతునిగా పుత్రుని తీర్చిదిద్దాలి. అట్టి విద్యను ఈనాటి బాలబాలికలందు, యువకులయందు ప్రవేశపెట్టాలి. గుణముకంటే మించిన బలముకానీ, ధనముకానీ లోకములో లేదు."

స్వామి సందేశంలోని అంతరార్థం గ్రహించి ఈనాటి తల్లిదండ్రులు తమ పిల్లలను ఆదర్శంగా తీర్చిదిద్దటమే ప్రథమ కర్తవ్యంగా భావించాలి.

HÍÖÏxl ãkíxÜ∂Qo KÜ∂e



"కొక్కొరొకోయని కోడి కూయగనే చక్కగా నిద్రమంచము నుండి లెమ్ము..." అని ఆనాడు తల్లిదండ్రులు పిల్లలకు మంచి అలవాట్లు నేర్పించేవారు. ఈనాడు కోడికూతలు కాదు, రైలుకూతలు కూసినా లేవరు! తెల్లవారి 8 గంటలకో, 9 గంటలకో లేస్తారు. కారణమేమిటి? రాత్రి ఆలస్యంగా నిద్రపోతారు. ఎందుకీ ఆలస్యం? పోనీ, చదువులో కాలాన్ని సార్థకం చేస్తున్నారా? కాదు, కాదు. టీవీలు, రేడియోలు అన్నీ వేసుకొని కాలమును వ్యర్థం చేయడమే గాకుండా మనస్సును కూడా పాడుచేసుకుంటున్నారు. టీవీలో చాలా అసభ్యకరమైన దృశ్యములన్నీ చూపుతున్నారు. ఇది గవర్నమెంటుకు ఏమి ఆనందమో, ఆదాయమో నాకు తెలియదు. ఈవిధంగా, పిల్లలను పాడుచేసేది ప్రభుత్వమే. యువకులయొక్క హృదయాలను చాలా అపవిత్రంగా, అసహ్యంగా తయారుచేస్తున్నారు... ఈవిధమైన దురభ్యాసాలకు పిల్లలకు తోడ్పడేకంటే సదభ్యాసాలు నేర్పకూడదా?! సచ్చరిత్రలు చూపకూడదా?! ఇంట్లో తల్లిదండ్రులుగాని, బయట విద్యావంతులుగాని, టీచర్లుగాని, పెద్దలుగాని ఎవ్వరూ పట్టించుకోవడంలేదు. కారణం? వారందరూ ఇదే అభ్యాసంలో ఉన్నారు.... వారే టీవీ ముందు కూర్చుంటారు. ఇంకా, కొంతమంది ఏమి చేస్తారో తెలుసునా? "నాయనా! నీవు పుట్టపర్తిలో సంవత్సరమంతా ఉండినావు. ఒక్క టీవీ ప్రోగ్రాముగాని, సినిమాగాని చూడలేదు. చూడు నాయనా, నీ ఇష్టమొచ్చినట్లు చూడు" అని కంచంలో భోజనం తెచ్చి, 'ప్రేమ'గా టీవీ ముందర పెడుతుంది తల్లి. బిడ్డ క్షేమాన్ని కోరే తల్లి చేయవలసిన పనేనా ఇది?!

- బాబా

4



అవతార అనుగ్రహ భాషణం:

స్త్రీ గృహ లక్ష్మిగా వర్ధిల్లాలి

నవంబరు 19 మహిళా దినోత్సవ సందర్భంగా...

'స్త్రీ' అనే శబ్దంలో సకార రకార తకారములు మూడూ చేరియున్నాయి. సకారము సాత్త్విక గుణమును, రకారము రజోగుణమును, తకారము తమోగుణమును సూచిస్తాయి.

సత్యమును పలికేవారు స్త్రీలు. సామాన్యంగా మన భారతదేశమునందేగాక అన్నిదేశములందు సత్యమంటే స్త్రీలకు చాలా ప్రీతి. సత్యం, ధర్మం, న్యాయం, ప్రేమ, కరుణ, ఆదరణ ఇలాంటి సాత్త్విక గుణములు వారిలో అధికంగా ఉంటాయి.

అంతేకాదు, త్యాగమునకు స్త్రీ పుట్టినిల్లు. కుటుంబ గౌరవమును, పతి గౌరవమును కాపాడే నిమిత్తమై అవసరమైతే తమ ప్రాణాన్నైనా త్యాగం చేయడానికి సిద్ధంగా ఉంటారు. ఇది స్త్రీలలోని రజోగుణమును సూచిస్తుంది. ఇంక తకారము తామసికమునకు చిహ్నం. ఆడవారు తమోగుణ సంపన్నులు. ఇక్కడ తమోగుణ మనగా నిద్రాహారములకు సంబంధించినది కాదు. ఇది వారిలోని వినయ విధేయతలను, గౌరవ మర్యాదలను, బిడియమును సూచిస్తుంది. ఇంటిని చూసి ఇల్లాలును చూడమంటారు. ఇంటి గౌరవమును, దేశ గౌరవమును కాపాడేవారు స్త్రీలే. కనుకనే స్వదేశాన్ని మాతృదేశ మంటారుకాని పితృదేశమని అనరు.

ఇంటి పని తర్వాతనే బయటిపని

స్త్రీలు చదువుకోవడం మంచిదే. కానీ ఆ చదువును ఆచరణలో పెట్టడం మరింత మంచిది. అయితే ఉద్యోగం చేసే వనితలకు ఏమాత్రం సుఖం లేదు.

"ఉద్యోగములు చేయ నువిదలందరు పోవ
గృహ కృత్యములు తీర్చు గృహిణులెవరు!
ఆలుమగలిద్దరు ఆఫీసులకు పోవ
ఇంటి పనులను చేయు ఇంతులెవరు!
పరబాలురకు నేర్ప పాఠశాలకు పోవ
తమ బాలురకు నేర్పు తల్లులెవరు!
పుస్తకాల్ చేపట్టి పురుషులవలె పోవ
వంట ఇంటిలో చేయు వనిత లెవరు!
డబ్బు లేనియట్టి ఇబ్బంది తీరిన
ఇంటిలోని కొరత ఎట్లు తీరు!
సుఖము చూడబోవ శూన్యమే యగు కదా!
ఉద్యోగ పదవియందున్న పడతి కెపుడు

స్త్రీలు ఉద్యోగం చేస్తున్న ఇంట్లో చాలా అశాంతిగా ఉంటుంది. అయితే పని చేయవలసిందే. కానీ ఇంటిపని తరువాతనే బయటి పని. ఇల్లే స్త్రీకి ప్రధానమైన స్థానము. అందువల్లనే ఆమెకు గృహలక్ష్మి, ఇల్లాలు, ధర్మపత్ని,

అర్ధాంగి అని గొప్పగొప్ప టైటిల్స్ ఇచ్చారు. కానీ ఈనాటి స్త్రీలు ఈ బిరుదులకు తగిన ప్రయత్నం చేయక పద్మశ్రీ, పద్మవిభూషణ్ వంటి భౌతికమైన బిరుదులకోసం ప్రాకులాడుతున్నారు. ఇవి కాదు స్త్రీలు తెచ్చుకోవలసిన బిరుదులు. కష్టనష్టములలోను, సుఖదుఃఖములలోను పతికి అర్ధభాగముగా అలరారుతూ 'అర్ధాంగి' అనే బిరుదును సార్థకం చేసుకోవాలి. నిరంతరము ఆనందంతో కళకళ లాడుతూ గృహలక్ష్మిగా వెలుగొందాలి. ధర్మాచరణలో పైచేయిగా ఉంటూ ధర్మపత్ని అనిపించుకోవాలి.

మొట్టమొదట ఇంటిని చక్కదిద్దుకోవాలి. పతి క్షేమానికై పాటుపడాలి. పిల్లలను ఆదర్శప్రాయులుగా పెంచాలి. తదుపరి ఏ పనైనా చేసుకోవచ్చు. ఇప్పుడు కూడా చాలామంది సుజనులు, పవిత్ర హృదయులు ఉద్యోగాలు చేసుకొంటూనే గృహంలో ఏ లోటూ లేకుండా చూసుకొంటున్నారు.

పురుషుల బాధ్యత

స్త్రీ జీవితం చాలా ఆదర్శవంతమైనది. గృహమును చక్కదిద్దుకోవడానికి స్త్రీలే సమర్థులు. స్త్రీ లేని గృహం కేవలం ఒక మఠంవలె, సత్రంవలె ఉంటుంది. అయితే స్త్రీలు కేవలం వంట ఇంట్లో పడి కుమిలిపోవాలని పురుషులు భావించకూడదు. "కలకంఠి కంట కన్నీరొలికిన సిరి ఇంట నుండనొల్లదు". ఇంట్లో స్త్రీ కన్నీరు పెట్టుకుంటే ఆ ఇంటి సంపదంతా హరించుకుపోతుంది. కనుక స్త్రీలు కన్నీరు కార్చకుండా చూసుకోవలసిన బాధ్యత పురుషుల కున్నది. కానీ ఈ సత్యాన్ని పురుషులు గుర్తించడానికి ప్రయత్నించడం లేదు. స్త్రీకంటే పురుషుడే ప్రధాన మంటున్నారు. అసలు పురుషుడనే పదమునకు అర్థం వారికే తెలియదు. ప్యాంటు, షర్టు వేసుకొన్నంత మాత్రమున పురుషులౌతారా? కాదు, కాదు. దేహమనే పురంలో నఖశిఖపర్యంతము సంచరించే చైతన్య శక్తికే పురుషుడని పేరు.

ఈనాడు ఉద్యోగం పురుష లక్షణమంటున్నారు. ఉద్యోగం చేసే ఆడవారెంతమంది లేరీ లోకంలో?! ఏ ఉద్యోగమూ లేని పురుషు లెంతమంది లేరు?! కాబట్టి పురుష లక్షణం ఉద్యోగమొక్కటే కాదు. గృహమును నిలబెట్టుకొనే బాధ్యత ఇరువురిపై ఉన్నది. ఇంటి గౌరవమర్యాదలను కాపాడుకొనే బాధ్యత ఇరువురిపై ఉన్నది.

కౌసల్య కనటంచేతనే రాముడు దేవుడైనాడు; సీతా మహాసాధ్వి సాకటంచేతనే లవకుశులు గొప్ప వీరులుగా తయారయ్యారు. జిజియాలలామ సద్బోధలవల్లనే వీర శివాజీ పేరు గాంచాడు. చిన్న పిల్లలు తల్లికి సమీపంగా ఉంటారు కనుక, ఆ వయస్సునందే తల్లి వారికి సరియైన మార్గమును చూపించాలి. ఈ ప్రపంచానికి గుణవంతులైన బాలబాలికలను అందించాలంటే మాతృమూర్తి మంచితనమును పోషించుకోవాలి. ప్రతి పనిని తాను ఆచరించి ఆదర్శాన్ని నిరూపించాలి.

మొట్టమొదట ఇంటిని చక్కదిద్దుకోవాలి. దేహము ఎంత ప్రధానమో ఇల్లు కూడా అంత ప్రధానం. కానీ కొంతమంది ఇంటికి తాళం వేసి ఇష్టం వచ్చినట్లు తిరుగుతుంటారు. ఇది మంచిది కాదు. ఇది కాదు మనం కోరవలసిన స్వేచ్ఛ. ఆత్మ ఇచ్ఛయే నిజమైన స్వేచ్ఛ. స్త్రీలు మంచివారైనప్పుడే దేశం మంచిదవుతుంది. పురుషులయందు గొప్పతనమున్నది; స్త్రీలయందు మంచితనమున్నది. స్త్రీలు ఎక్కడ గౌరవింపబడతారో దైవం అక్కడే ప్రత్యక్షమవుతాడు. కనుక మొట్టమొదట స్త్రీలకు తగిన గౌరవ మర్యాదల నివ్వాలి. స్త్రీలకు కూడా తగిన స్వాతంత్ర్యం కావాలి. దేనికోసం? ఇంటిని అభివృద్ధిపరచే కోసం, పేరుప్రతిష్ఠలను నిలబెట్టేకోసం, ధర్మాన్ని ఆచరించేకోసం, సత్యాన్ని ప్రచారం చేసేకోసం. స్త్రీలు కూడా చక్కగా చదువుకోవచ్చు, డిగ్రీలు తీసుకోవచ్చు, ఉద్యోగాలు చేసుకోవచ్చు, రాజకీయాలలో చేరవచ్చు, దేశోద్ధరణకు పాటుపడవచ్చు. దానిలో తప్పులేదు. కానీ గృహమును ఆధారం చేసుకొనియే మిగిలినవన్నీ చూసుకోవాలి. ఇల్లు వదలి ఏమి చేసినా పేరుప్రతిష్ఠలు ఉండవు. గృహస్థ ధర్మాన్ని పాటిస్తూ పిల్లలను ఆదర్శవంతమైన పౌరులుగా తీర్చిదిద్దాలి.

(శ్రీవారి దివ్యోపన్యాసాలనుండి)

j

అందరినీ ప్రేమించు, అందరినీ సేవించు

(Love All, Serve All)

బి.వి. సత్యమూర్తి

ఐజాక్ టైగ్రెట్ అమెరికాలో 'హార్డ్ రాక్ కఫే' అన్న పేరుతో ప్రపంచవ్యాప్తంగా రెస్టారెంట్లు స్థాపించి విజయ వంతంగా నడుపుతూ వచ్చేడు. తన వ్యాపారంలో ధర్మబద్ధంగా, విశాల హృదయంతో న్యాయమార్గంలో ఎంతో ధనం సంపాదించడంవల్ల ఆత్మసంతృప్తిని, ఆనందాన్ని పొందగలిగేడు.



సత్యధర్మశాంతిప్రేమలను ఆచరణయుక్తంగా కొన సాగిస్తూ విశ్వవిఖ్యాతి గాంచిన భగవాన్ బాబానుగురించి విని వారి యెడల భక్తి విశ్వాసాలు పెంచుకున్నాడు. 1974లో మొదటిసారి భారతదేశం వచ్చి, దూరంగా నిలబడి స్వామిని దర్శించేడు. స్వామి అతడివైపు నడచి వచ్చి మందహాసంతో, "ఆc! వచ్చేవా! సంతోషం. నీకోసమే ఎదురుచూస్తున్నాను. మన మధ్య జన్మాంతర స్నేహబంధ మున్నది. సమయం వస్తుంది. వేచి ఉండు" అన్నారు. టైగ్రెట్ ప్రతి ఏటా మూడు సార్లు స్వామి దర్శనానికి వస్తూ 15 సంవత్సరాలు భగవాన్ అనుగ్రహంకొరకు ఎదురు చూశాడు. స్వామి అతనిని పలకరించలేదు.

1975లో ఒక తెల్లవారుఝామున కాలిఫోర్నియాలో గంటకు 90 మైళ్ళ వేగంతో కారు నడుపుతూ పర్వతశ్రేణి మార్గంలో ఇంటికి తిరిగి వస్తున్నాడు.



అలవాటైన రోడ్డే కానీ, ఆరోజున తప్ప త్రాగిన మైకంలో కారు నడుపుతూ ఉండటంవల్ల అదుపు తప్పి 300 అడుగుల దిగువన ఉన్న లోయలోకి కారు తొమ్మిదిసార్లు పల్టీ కొట్టి క్రిందపడింది.

కారు పల్టీలు కొడుతున్నప్పుడు స్వామి అతని నడుము చుట్టూ చెయ్యివేసి, అదిమి పట్టుకున్నట్లు చూశాడు.

కారు తుక్కుతుక్కు అయిపోయింది. అతడు ఎలా బయటపడ్డాడో, ఎటువంటి గాయాలూ లేకుండా లేచి నిలబడ్డాడు. స్వామి చేసిన ప్రాణదానానికి కృతజ్ఞత చెప్పాలని ప్రశాంతి నిలయం వచ్చి చాలా రోజులున్నాడు. స్వామి దగ్గరికి రాలేదు, పలకరించలేదు.

టైగ్రెట్‌కి 'ఫిట్స్' (మూర్ఛ) వ్యాధి ఉండటంవల్ల ఆ బాధ నివారణకి మాదకద్రవ్య ఔషధం మ్రింగటం అలవాటైంది. ఒకరోజు అమెరికాలో ఒక హోటల్లో అర్ధరాత్రి ఒక్కడే ఉండగా, ఆ మందు మోతాదు ఎక్కువవ్వడంవల్ల నాలుక వెనుకకు మడతబడి గొంతు మూసుకుపోవడంతో ఊపిరి ఆడక ప్రాణం పోతుండగా స్వామిని ప్రార్థించేడు.

ప్రాణం లేని తన శరీరాన్ని అదృశ్య శరీరంతో చూస్తున్నాడు. స్వామి ప్రత్యక్షమై అమాంతంగా అతనిని మంచంమీద పడుకోబెట్టేరు. తిరిగి అతని శరీరంలో



ప్రాణం ప్రవేశించింది. కానీ, ఇంతలోనే స్వామి అదృశ్యమయ్యేరు.

టైగ్రెట్‌ది ఒకటే ఆలోచన. స్వామికి తన కృతజ్ఞతలు ఎలా చెప్పుకోవాలి!



15 సంవత్సరాలుగా పుట్టపర్తికి ఎన్నిసార్లు వెళ్ళినా స్వామిని దర్శించి వారికి తన కృతజ్ఞతాభివందనాలు తెలియజేసి వారి ఆశీస్సులు పొందే అవకాశం లభించటం లేదు.

మళ్ళీ పుట్టపర్తి వెళ్ళేడు. మళ్ళీ నిరాశే ఎదురైంది.

స్వామి పుట్టపర్తిలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కట్టే ఆలోచనలో ఉన్నారు.

ఆ సమయంలో బృందావన్‌లో అమెరికానుంచి వచ్చిన సుప్రసిద్ధ వైద్యులతోపాటు టైగ్రెట్ స్వామిని దర్శించగలిగేడు.





ట్రైగ్రెట్‌కి రెండు పర్యాయములు ప్రాణదానం చేసిన సంఘటనలను స్వామి ధ్రువీకరించేరు.

అంతేకాదు, "అంతక్రితం కూడా నిన్ను చాలా సార్లు కాపాడేను" అనగానే ట్రైగ్రెట్ తన ప్రాణదాతకి నమస్కారం చేసేడు.

పుట్టపర్తిలో క్యాంటీనులో భోజనం చేసి అతని గదికి తిరిగి వెడుతూండగా ట్రైగ్రెట్ దృష్టి గోడమీద ఫలకంపై నున్న "లవ్ ఆల్, సర్వ్ ఆల్" (అందర్నీ ప్రేమించు, అందర్నీ సేవించు) అన్న భగవాన్ సువాక్యంపై పడింది.

"అవును, ఈ వాక్యం నా జీవిత పరమావధి కావాలి" అన్న దృఢ సంకల్పం ట్రైగ్రెట్‌కు కలిగింది.

"నాకు అఖండమైన ఐశ్వర్యం, ఎన్నోసార్లు ప్రాణదానం, ఆనందం స్వామి అనుగ్రహంవల్లనే లభించేయి. ఇకమీదట మరింత దృఢ విశ్వాసంతో స్వామి బోధించిన బాటలో మానవ సేవాకార్యక్రమాలు చేపట్టాలి. అందుకు స్వామి అవకాశం అనుగ్రహించాలి అని ప్రార్థించేడు.

అతను స్వామిని తొలిసారి దర్శించిన తరువాత 15 ఏళ్ళకుగానీ స్వామితో మొదటి ఇంటర్వ్యూ లభించలేదు.



ఇంటర్వ్యూ గదిలో ట్రైగ్రెట్‌తోపాటు ఎందరో ఉండగా, భగవదనుగ్రహం పొందటానికి ఏది ఉత్తమమైన మార్గం? అని స్వామి ప్రశ్నించేరు.

అక్కడ కూర్చున్నవారిలో ఎవ్వరూ జవాబు చెప్పలేకపోయారు.

అప్పుడు స్వామి, "లవ్ ఆల్, సర్వ్ ఆల్" అన్న తమ ధర్మసూత్రాన్ని పునరుద్ఘాటించేరు.



ట్రైగ్రెట్ తన జీవిత పరమావధి అదే అని నిశ్చయించుకున్న ఆ తరుణంలో, స్వామియొక్క ఆ ప్రబోధ మరింత దృఢ విశ్వాసం కలిగించాలన్న సంకల్పంతో ట్రైగ్రెట్‌కేసి చూసి, మందస్మిత వదనంతో అభినందిస్తూ ఆశీర్వదించేరు.

1989లో తన వ్యాపార సంస్థను కొనడానికి మరొక పెద్ద సంస్థ ముందుకొచ్చింది.

మంచి లాభసాటిగా వచ్చిన ధరకి అమ్మేసి, ఆ ధనాన్ని స్వామి చేపట్టిన ఏ ప్రజాసంక్షేమ కార్యక్రమానికైనా వినియోగపరచవచ్చునని నిర్ణయించుకుని మనశ్శాంతితో ఎదురు చూస్తున్నాడు.

1991లో పుట్టపర్తిలో స్వామి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కట్టనున్న ఆ సందర్భంలో తనకి ఆ అవకాశం ప్రసాదించినందుకు ఎంతో ఆనందించి, ఆ బాధ్యతను విజయవంతంగా నిర్వహించి స్వామి అనుగ్రహానికి పాత్రుడయ్యేడు.

ప్రబలమైన మానసిక వైరాగ్యంతో ట్రైగ్రెట్, “స్వామీ! నా శేష జీవితాన్ని ఏ గుహలోనైనా తపస్సు చేసుకుంటూ గడపదలచుకున్నాను, స్వామి అనుగ్రహిస్తే...” అన్నాడు.



“ప్రాపంచికమైన కోరికలు దూరం చేసుకుని నీ హృదయమే నీ తపోమందిరం చేసుకో! నేను చేపట్టే మానవోద్ధరణ పథకాలతో స్ఫూర్తిని పొంది, నీవొక ముఖ్యమైన దీపస్తంభంగా కొనసాగుతూ నీ జీవితం చరితార్థం చేసుకో” అని స్వామి ఆశీర్వదించేరు.

B

శివం, స్వామి హృదయం!

వి.ఎస్.ఆర్. మూర్తి



త్రేతలో శ్రీరామచంద్రుడు అయోధ్యలో అవతరించినా, ఆయన కార్యక్రమమంతా అరణ్యాలలో, కొండలలో, నదీ తటాలలో, సముద్ర సమీపంలో, లంకలో సాగింది.

ద్వాపరాన చెఱసాలలో ప్రభవించి, వ్రజభూమిలో లీలాకాండ సాగించి, హస్తినలో ప్రవేశించి, ధర్మసంస్థాపనకోసం యుద్ధ క్రీడను నడిపించి, శ్రీకృష్ణావతారం ప్రవర్తిల్లింది.

మనకు సమకాలీనంగా భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు పుట్టపర్తిని అవతరించి, అక్కడే నిలిచి, తాము కదలక, సమస్త కార్యకలాపాలను అక్కడే ప్రారంభించి, అవని అంతటా విస్తృతం చేయటం ఒక అద్భుత సన్నివేశం. అవతార పరిసమాప్తి అక్కడే చేయటమూ ఒక అనుపమాన సంఘటనే.

రామకృష్ణుల సంచారమంతా వింధ్య పర్వతాలకు అవతలే. సీతాన్వేషణ, రావణ వధ వంటి కలాపంలో రాముడు కొంతకాలం వింధ్య కివతల ఉండటం జరిగింది.

దీనికి భిన్నంగా సత్యసాయి భగవానుడి అవతార లక్ష్యము, లక్షణము, కార్యకలాప నిర్వహణ కొనసాగింది, కొనసాగుతున్నది.

స్వామి, ధర్మప్రబోధము, ధర్మప్రచారము, ధర్మప్రసారము లక్ష్యంగా తమ అవనీ సంచార సమయాన్నంతటినీ వింధ్యకు ఇవతలే కేంద్రీకరించి నానా దేశాల, నానా దిక్కుల, నానా జనుల ప్రసారించ, పుట్టపర్తిని కేంద్రబిందు క్షేత్రంగా తీర్చిదిద్దారు. తమ ప్రణాళికలో అంతర్భాగంగా మూడు ప్రధాన దివ్యశక్తి క్షేత్రాలను సంకల్పించారు. ఆ మూడూ వింధ్యకివతలే, దక్షిణా పథంలో ఉండటం ఒక చారిత్రక విశేషం.

సంత్ దేశమైన మహారాష్ట్రంలో తొలి సంకల్పం 'ధర్మక్షేత్ర'మైంది. అది 'సత్యం'.

మలి సంకల్పం త్రిలింగ దేశంలో 'శివ'మైంది.

ఆపై దేవాలయ సమాహార ప్రదేశం, తమిళనాట 'సుందర'మైంది.

జీవితమే సత్య, శివ, సుందరాత్మకం!

జీవుడు సచ్చిదానంద ప్రతిరూపం!!

అవిద్య, అస్పష్టత, అనాచారం వంటి అలస భావాల వలన జీవుడు సత్, చిత్, ఆనందాలను, సత్య, శివ, సుందర స్థితులను గమనించక, గ్రహించుకోలేక, ఎల్లవేళల యాతన ననుభవిస్తుంటాడు. ఈ పరిస్థితిని చక్కదిద్ది, మానవుణ్ని తిరిగి ధర్మమార్గంలో నడిపించటమే అవతార లక్ష్యం. ఆ లక్ష్యం ప్రధానంగా స్వామి, సత్యం – శివం – సుందరం అనే మూడు మహాక్షేత్రాలను సాధనా భూమికలుగా రూపొందించారు. జగన్నాయకుడి సంకల్పమే శక్తిగా, భక్త జనుల విశ్వాసమే బలంగా, సంపదగా, జగదవసరమే చోదక శక్తిగా, ఈ మూడు మహాక్షేత్రాలనుండీ అధ్యాత్మ సాధన కర్మ, భక్తి, జ్ఞానయోగాలుగా నిరంతరం ప్రవర్తిల్లుతుంది.

సత్యమే ధర్మక్షేత్రం. అది ఆలోచనా భూమిక. ఏ సమయానికి, జగత్తుకు ఏది అవసరమో ఊహించి, సంభావించి, ప్రణాళికను రచించి, సిద్ధపరచటం 'సత్యం' పని. సర్వమూ ధర్మాన్ని ఆశ్రయించి, సనాతన ధర్మానికి లోబడి, రూపుదిద్దుకోవాలి. పది కాలాలు చల్లగా ప్రజలకు చెందాలి. కనుక, అది ధర్మక్షేత్రం.

ఆలోచనలన్నీ పవిత్రతనూ, పరిపుష్టిని సంతరించుకుని జన బాహుళ్యానికి చేరువై, స్వార్థరహిత సేవగా, మంగళప్రదంగా కళకళలాడాలి. ఇదే శివం.

ఆలోచనలన్నీ ఆచరణాత్మకమై బహు సుందరంగా ప్రజాబాహుళ్యానికి అక్కరకు రావాలి. ఇది సుందరం.

ఈ నేపథ్యంలోనే త్రిలింగ దేశంలో మరొక లింగం ప్రాదుర్భవించింది.

పైకి లింగాకృతిగా గోచరించే మహా శివశక్తి వేదిక అది. పానవట్ట సహితంగా పరమశివుడు ఆలోచనను, ఆచరణను జమిలి చేసి, ఇలపై నిలిపిన కైలాస సదృశమది.

సమస్త భాగ్యానుగ్రహప్రదాత సత్యసాయీశ్వరుడు భాగ్యనగర సిగ నిలిపిన నిండు నగ.

నలభై సంవత్సరాల కాలగమనంలో ఎన్నోసార్లు స్వామిని సాక్షాత్కరించుకున్న నిత్య కైలాసమది.

అది మంగళదాయిని, ఆనందదాయిని, ఆహ్లాద దాయిని. ఉత్తర దేశంనుండి ప్రశాంతి నిలయ యాత్రకు తొలి గడప అది. అది దేహళీ దత్తదీపం, అంటే గడపను వెలిగిన అధ్యాత్మ జ్యోతి.

దాని పేరు 'శివం'.

అహంకార, మమకారాలనే కొమ్ములను త్రుంచుకుని మనసా, వచసా శిరసు వంచి నిలిచే వినమ్రమూర్తి 'శివం'.

సత్యసాయి పరదైవతాన్ని దర్శించి, స్పర్శించి, సంభాషించి పులకాంకుర ప్రకర దేహాలతో తరించిన దివ్యక్షేత్రం శివం.

ఈశ్వరుడే తప్ప ఈసులెరుగని, కామేశ్వరుడే తప్ప కాసులెరుగని, సర్వేశ్వర శక్తిని సేవగా మలుచుకున్న పుణ్యతీర్థం శివం!

శివంలో స్వామి దక్షిణ దిక్కును చూస్తూ నిలబడిన వైనం అద్భుతం. జీవుడు, స్వామిముందు నిలిచి స్వామిని దర్శించటం, జ్ఞానాన్ని కోరటంకోసమే. ఇక్కడ స్వామి దక్షిణామూర్తి. సంసార మోచకుడు. జ్ఞానప్రదాత. అరిషడ్వర్గ ధ్వంసకుడు. ఇహలోక భోగంనుండి యోగంవైపు నడిపించే యోగమూర్తి. మాటలు మలిగి మౌనం వెలిగే వ్యాఖ్యా స్ఫూర్తి. సదానంద సంపన్మూర్తి.

ఆవేశాన్ని అణచి, అహాన్ని త్రుంచి, సమత, మమత, దివ్యతలను అనుగ్రహించే పరమ కారుణ్యం నడచిన పవిత్ర ప్రాంగణం శివం. జీవుడు తనలోని దైవాన్ని దర్శించగల స్థితి ననుగ్రహించు పుణ్యసీమ శివం.

'శివం' నిన్నటి తరానికి ఒక స్మృతి పేటిక.

నడుస్తున్న తరానికి ఒక అనుభవానంద వాటిక.

రాబోయే తరాలకి ఆశయ, ఆదర్శ, ఆధ్యాత్మిక పాలిక.

నిత్య భగవన్నామ స్మరణంతో, నిరంతర స్మృతి మననంతో, మౌన, ధ్యాన, నిదిధ్యాసనంతో, అలుపెరగని, ఎడతెగని సేవాయోగంతో, పరస్పరానురాగ మైత్రీ బంధంతో, సమైక్యత, పవిత్రత, దివ్యత త్రిపుటిగా 'శివం' నిత్య వసంత శోభతో వెలుగొందాలి. సమస్త మానవాళి శివం ప్రాంగణంలో అధ్యాత్మ పిపాసను తీర్చుకోవాలి. నిరంతర పరిణామస్సహ స్పృహ అందగించాలి.

'శివం' స్వామి అనుగ్రహించిన యోగావరణం.

సర్వేశ్వరుడి శిరస్సు 'సత్యం'.

సాయీశ్వరుడి హృదయం 'శివం'.

స్వామి సర్వాంగీణ దేహం 'సుందరం'.

హృదయస్థానగత 'శివం' హృదయాలను వికాసమానం చేయాలి. ఆనందం, అనుభూతి, విభూతి వంటి ఆధ్యాత్మిక పరిమళాలతో శివం శోభిల్లాలి.

'శివం'లోకి ప్రవేశించటం అంటే అంతర్ముఖం కావటమే. మౌనంలో పరవశించటమే. మనల్ని మనం ఎరగటమే. స్వామి, తమ దివ్య పాదచారణంతో పునీతం చేసిన 'శివం' ప్రాంగణంలోని ప్రతి అణువు శివలింగ సమానమే! శివం, స్వామి హృదయం!

j

B భక్త మార్కండేయునివలె శివుని కౌగలించుకొనిన సుఖము పొందవచ్చును. శవమును కౌగలించుకొనిన మీకు దుఃఖమే ప్రాప్తించును. దేహాభిమానమే శవము, ఆత్మాభిమానమే శివము. B

5

- బాబా



శరణాగతి

వై. శ్రీరంగనాథరాజు

'స్వామీ! ఆకర్షణకు మూలం ఏమిటి?"

నెలలపాటు నా మనసును తొలిచివేస్తున్న ప్రశ్నను స్వామిని సూటిగా అడిగాను.

చెన్నై అతిరుద్ర మహాయజ్ఞంలో భాగంగా స్వామి తమ వెంట తీసుకుపోయిన విద్యార్థులమంతా స్వామి చుట్టూ కూర్చున్నాము.

"ఆకర్షణకు మూలం దృష్టి. దృష్టి అంటే ఈ కళ్ళయొక్క దృష్టి కాదు. అది మనసుయొక్క దృష్టి" అంటూ స్వామి జవాబిచ్చారు. ప్రేమతో చూస్తూ నవ్వారు.

ప్రక్కనే ఉన్న నా మిత్రుడు జగదీశ్‌చంద్ర, "స్వామీ, శరణాగతి అంటే ఏమిటి?" అని ప్రశ్నించాడు.

స్వామి నవ్వి, "నువ్వే చెప్పు" అన్నారు. "శరణాగతి అంటే స్వామికి సర్వం అర్పించటం" అని శరణాగతికి తనకు తెలిసిన నిర్వచనం చెప్పాడు, జగదీశ్. తక్కున స్వామి సరిచేశారు, "శరణాగతిలో ఇచ్చుకోవటం, పుచ్చుకోవటం అంటూ ఏమీ ఉండవు. ఏది జరిగినా ఇది నా మంచికే అనుకోవాలి. సుఖానికి సంతోషించటం, కష్టానికి దుఃఖించటం శరణాగతి లక్షణం కాదు. ప్రతి సన్నివేశమూ, సంఘటనా స్వామి ప్రసాదమని భావించటమే శరణాగతి." స్వామి మాటల్లో మేము నిమగ్నమయ్యాము.

స్వామి శరణాగతి తత్త్వాన్ని విపులంగా వివరించ సాగారు:

"మీ అందరికీ కారు నడపటం తెలుసు కదా! కారులో 1,2,3,4,5 గేర్లు ఉంటాయి. ఒకటవ గేరులో కారు నడపటం కష్టం కాదు. రెండవ గేరులోనూ నడపటం కష్టం కాదు. మూడవ గేరు, నాల్గవ గేరు కూడా అంతే! మరి కష్టమైనదేది? ఒక గేరునుండి బండిని మరొక గేరులోకి సున్నితంగా మార్చటం. ఈ మార్పు నేర్చుకోవాలి. గేరు మార్చటం సులువుగా ఉండటానికి మీరు క్లచ్ వాడతారు. జీవితం కూడా అంతే! ఒకసారి కష్టం, మరొకసారి సుఖం. మళ్ళీ కష్టం, మళ్ళీ సుఖం. 'ప్లెజర్ ఈజ్ ఎన్ ఇంటర్వెల్ బిట్వీన్ టూ పెయిన్స్'. సుఖం నుండి కష్టానికైనా, కష్టం నుండి సుఖానికైనా జారుతున్నప్పుడు బుద్ధి అనే క్లచ్ వాడాలి. ఇది నా మంచికే, ఇది భగవంతుని ప్రసాదమే అన్న క్లచ్ వాడితే జీవితమనే పయనం ఏ ఇబ్బందులూ లేకుండా సుఖంగా సాగుతుంది."

సాక్షాత్తు భగవంతుడే శరణాగతి అనే ఒక ఆధ్యాత్మిక తత్త్వాన్ని అంత సులువుగా బోధిస్తుంటే, విని కృతజ్ఞతతో మనస్సు నిండిపోయింది.

మరుసటిరోజు స్వామి జగదీశ్‌ను అతిరుద్ర యజ్ఞ కార్యక్రమాలలో భాగంగా ఉపన్యసించమన్నారు. జగదీశ్ జన్మతః మంచి వక్త. దానికితోడు భగవంతుని అండ. ఇంక గురు-శిష్య సంబంధంపై జగదీశ్ ఉపన్యాసం ఆద్యంతం అద్భుతంగా సాగింది. వింటున్న వేలమంది ముఖాలలో ఆ ఆనందం కనబడింది. ఉపన్యాసం ముగిసిన తరువాత వారి కరతాళ ధ్వనులు మిన్నంటాయి.

సాధారణంగా తన విద్యార్థులు చక్కగా ఉపన్యసిస్తే స్వామి ఎంతో గర్వపడతారు. రెండు మూడు రోజులవరకు ఆ ఉపన్యాసాన్ని గురించి గుర్తు చేస్తుంటారు. అంతకుముందు దినం వరకూ మేము నలుగురమూ ఉపన్యసిస్తే స్వామి కనబరచిన ఆప్యాయత, కురిపించిన ప్రశంసలు అనిర్వచనీయం. కానీ, ఆ రోజు మాత్రం స్వామి చాలా భిన్నంగా ప్రవర్తించసాగారు.

యజ్ఞ మంటపం నుండి మందిరానికి తిరిగి వెళ్ళిన తరువాత ఎన్నడూ లేనివిధంగా స్వామి మా అందరిముందు జగదీశ్‌ను పిలచి, 'నీ ఉపన్యాసం ఏమీ బాగా లేదు' అని తీవ్ర అసంతృప్తిని వెలిబుచ్చారు.

స్వామి ఆవిధంగా అంటారని ఎవ్వరూ ఊహించలేదు. పూర్వపు వైస్ ఛాన్సలర్ మెచ్చుకోబోతే, "ఏమీ బాగాలేదు, ఎందుకు మెచ్చుకుంటున్నావు?" అని వారినికూడా స్వామి మందలించారు.

ఏమి జరుగుతోందో ఎవరికీ అర్థం కావట్లేదు.

ముఖం నిండా విసుగుతో స్వామి భోజనానికి బయల్దేరారు. అయోమయ స్థితిలో మేము స్వామి వెంట బయల్దేరాము.

స్వామి ప్రశంసకోసం, స్వామి ఆనందంకోసం ఎదురుచూసిన జగదీశ్ ముఖంలో మాత్రం నిరాశ, బాధ చాలా స్పష్టంగా ఏర్పడుతున్నాయి. మాతోటి విద్యార్థి అలా బాధపడుతుంటే మాకూ చాలా బాధగా అనిపించింది. భగవంతుడే చివరకు కోపగించుకుంటే, ఓదార్పుకోసం ఎవరివైపు తిరిగేది?

సాధారణంగా స్వామి ఇష్టాగోష్ఠితో ఆనందంగా, ఉల్లాసంగా జరిగే భోజన కార్యక్రమం ఆరోజు మాత్రం మౌనంగా ముగిసింది. స్వామి ముఖం నిండా విసుగు ప్రస్ఫుటంగా కనబడుతోంది. ఆ సమయంలో ఎవరూ స్వామిని మాట్లాడించే సాహసం చేయలేదు.

ఇక మా పడక గదులకు తిరిగి వెళ్ళే సమయం దగ్గర పడింది. బాధతో ఉన్న మా అందరినీ, ప్రత్యేకంగా జగదీశ్‌ను స్వామి ఒక్కసారి తీవ్రంగా చూశారు. చెమర్చిన జగదీశ్ కళ్ళలోకి లోతుగా చూస్తూ, **"ఏమైందిరా మీ శరణాగతి?"** అని నవ్వారు.

అప్పటివరకూ స్వామి ముఖంలో తాండవించిన విసుగు, కోపం ఆ క్షణంనుండి మటుమాయమయ్యాయి. మునుపటిదంతా నటన అని ఒక్కసారి తేటతెల్లమైంది. స్వామి కళ్ళలో ప్రేమ పెల్లుబికింది. **"నిన్న చెప్పిన శరణాగతి గురించి ఏమీ గుర్తులేదా?"** అని చిరునవ్వుతో అంటూ స్వామి తమ గదిలోకి వెళ్ళిపోయారు.

ముందురోజు స్వామి చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి.

"సుఖానికి సంతోషించటం, కష్టానికి బాధపడటం శరణాగతి లక్షణము కాదు. ప్రతి సన్నివేశమూ, ప్రతి సంఘటనా భగవంతుని ప్రసాదమని తలచటమే శరణాగతి."

నిన్నటి పాఠాన్ని నేడు అనుభవపూర్వకంగా మాకు నేర్పటానికే స్వామి ఈవిధంగా ప్రవర్తించారని గుర్తించాము. మరుసటి రోజు ఉదయాన్నే జగదీశ్‌ను ప్రత్యేకంగా పిలచి, చక్కటి ఉపన్యాసానికి ఆశీర్వాద ప్రశంసలను స్వామి దండిగా అందించారు. అటు జగదీశ్ నిరాశను దూరం చేశారు, ఇటు మాకు మరువలేని పాఠాన్ని నేర్పారు.

రానూరానూ మా జీవిత స్వీయానుభవం ప్రతి నిమిషమూ భగవంతుని ప్రసాదమన్న భావనతో గడిపితే, మన ఆలోచనా దృక్పథంలో మార్పు కలుగుతుందనీ, ప్రతి నిమిషమూ ఆ భగవానుని అండదండలు ప్రత్యక్షంగా అనుభవంలోకి వస్తాయని మాకు నేర్పింది.

అదే స్వీయానుభవం ఆనాడు అంతటి అమూల్యమైన పాఠాన్ని నేర్పిన బంగారు భగవానునికి కృతజ్ఞతలు ఏవిధంగానూ తెల్పుకోలేమనికూడా నేర్పింది.

పాఠకులకు గమనిక: స్థలాభావంచేత ఈ సంచికలో **'జ్ఞాపకాల పందిరి'** మరియు **'మహా మహిమాన్విత ప్రేమావతారి'** ధారావాహికలు ప్రచురించటం లేదు. డిసెంబరు సంచిక నుండి తిరిగి యథాప్రకారం వాటిని కొనసాగించడం జరుగుతుందని మనవి చేస్తున్నాము. - సం॥

అడగగానే మార్గం చూపిన దేవుడు

వసంతభాను

ఆ తల్లి పేరు రత్నావళి. ఆమె కొడుకు రోహిత్ పది నెలల ప్రాయంలో 'తలసీమియా' అనే భయంకరమైన వ్యాధి బారిన పడ్డాడని తెలిసింది. ఆ లోపంతో పుట్టే పిల్లలలో రక్తాన్ని ఉత్పత్తి చేసే శక్తి ఉండదు. బిడ్డ పరిస్థితిని బట్టి రెండు మూడు వారాలకోసారి రక్తం ఎక్కించాలి. అంత తరచుగా రక్తం దొరకడం కష్టం. అలా తరచు రక్తం ఎక్కించడంవల్ల పిల్లల శరీరంలో పేరుకుపోయే ఇనుమును 'ఐరన్ ఛిలేషన్ ట్రీట్‌మెంట్' ద్వారా తొలగించాలి. అందుకయ్యే ఖర్చుకూడా చాలా ఎక్కువ. అన్ని దారులూ మూసుకుపోతుంటే ఎలా ఉంటుందో, ఆ స్థితిని రత్నావళికూడా అనుభవించింది. కేవలం భర్త ఆర్జనతో అటు సంసారాన్ని, ఇటు కొడుకు చికిత్సకయ్యే ఖర్చును భరించడం, ఆ మధ్య తరగతి ఇల్లాలికి సాధ్యమయ్యే పనేనా?! ఆమె తనలాంటి తల్లులు ఇంకెందరో ఉన్నారని తెలిసి తల్లడిల్లింది. మరో 20 మంది తలసీమియా పిల్లల తల్లిదండ్రులతో పరిచయం ఏర్పడింది. సహాయంకోసం ఆమె తట్టని తలుపు లేదు. ఆ ప్రయత్నంలో భాగంగా ప్రముఖ వైద్యులను సంప్రదించింది. డా॥ కృష్ణ కుమారి గారు, మరికొందరు వైద్యుల సహకారంతో తలసీమియా పిల్లల తల్లిదండ్రులే నిర్వహించుకునే, **"తలసీమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ" (టిఎస్‌సిఎస్)** రూపుదిద్దుకుంది.

ఈ నడుమ కాలంలో ఏది జరుగకూడదని ఆ తల్లి కోరుకుందో అదే జరిగింది. ఉన్నన్నాళ్ళు చిరునవ్వుతో బాధననుభవిస్తూనే, తల్లికి స్ఫూర్తి నిచ్చి, తల్లి చేపట్టిన యజ్ఞానికి బాసటగా నిలిచిన రోహిత్ తన 21వ ఏట తరలిరాని లోకానికి వెళ్లిపోయాడు. తను లేకపోయినా తనవంటివారికి అండగా నిలవమని కొడుకు ఇచ్చిన స్ఫూర్తికి నివాళిగా, మొక్కవోని స్థయిర్యంతో రత్నావళి తనకు దేవుడిచ్చిన పిల్లల సంక్షేమంపై దృష్టి సారించింది. కొడుకు చివరి కోరిక మేరకు అతని కళ్ళు దానం చేసింది.

టిఎస్‌సిఎస్ ప్రారంభమైన తొలి రోజుల్లో (1998), 20 మందికి మాత్రమే సహాయమందించింది. 2013 నాటికి రక్తంకోసం, మందులకోసం **టిఎస్‌సిఎస్**కి వచ్చే పిల్లల సంఖ్య 1800కి పెరిగింది. వారికి సంస్థలో ఉచితంగా వైద్య పరీక్ష చేస్తున్నారు, ఉచితంగా రక్తాన్ని ఇస్తున్నారు. ఇందుకోసం 25 పడకలతో రక్తాన్ని ఎక్కించే సదుపాయం ఉంది. ఐరన్ ఛిలేషన్ మందులు సబ్సిడీపై అందిస్తున్నారు. ఫలితంగా సంస్థకు అయ్యే ఖర్చులో నెలకు ఆరేడు లక్షల రూపాయల లోటు కనిపించడం మొదలైంది.

గతంలో ఒకసారి చేసిన మాదిరిగా రవీంద్రభారతిలో స్టేజి షో ఏర్పాటు చేసి, డోనర్ పాసులద్వారా నిధులు సమకూర్చుకునే ప్రయత్నం చేయాలని తలపోశారు. కానీ, అనివార్య కారణాలవల్ల ఆడిటోరియం కేటాయింపు రద్దుకావడంతో **టిఎస్‌సిఎస్** శ్రీ సత్యసాయి నిగమాగమం వైపు దృష్టి సారించింది. ఆ ప్రయత్నంలో భాగంగా

తెలిసినవారి సహాయంతో రత్నావళి 'శివం' మందిరానికి వెళ్ళింది. కానీ, కావలసిన వ్యక్తులు దొరకలేదు. దిగులుగా ఆమె మందిరంలోకి పోయి, స్వామికి మొక్కి, నీవే దిక్కని వేడుకుంది. ఇంతలో ఎవరో సలహా ఇవ్వగా, 'శివం' సమీపంలో నివసించే సాయి భక్తులు శ్రీ వి.ఎస్.ఆర్. మూర్తిగారి ఇంటికి వెళ్ళింది. తాను వచ్చిన పనిని వివరించింది. తనవారు కాని తలసీమియా పిల్లల బాగు కోసం ఆమె పడుతున్న తపన గ్రహించి, ఆ పిల్లలకు తోడుగా నిలవడానికి అది స్వామి తనకిచ్చిన అవకాశంగా భావించి, తక్షణమే మూర్తిగారు స్వామి భక్తులైన శ్రీ హెచ్.జె. దొరగారిని, సిబిఐ జాయింట్ డైరెక్టర్ శ్రీ వి.వి. లక్ష్మీనారాయణగారిని (జె.డి.గా విఖ్యాతులు) సంప్రదించారు. శ్రీ దొరగారి చొరవతో స్టేజి షోకోసం వేదికగా శ్రీ సత్యసాయి నిగమాగమం దొరకడమేగాక అద్దెలో రాయితీ లభించింది. జె.డి.గారి కృషితో 'వసుధ' ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీ మంతెన వెంకటరామ రాజుగారితోసహా పలువురు వదాన్యులు ముందుకొచ్చారు.

తలపెట్టిన విధంగా 2013 జులై 15న సత్యసాయి నిగమాగమంలో స్టేజి షో దిగ్విజయంగా జరిగింది. ఆ రోజున (సోదర సంస్థల సహకారంతో) 'వసుధ' ఫౌండేషన్ **టిఎస్‌సిఎస్**కు రూ॥ 50 లక్షల విరాళాన్ని ప్రకటిస్తూ, ఫిబ్రవరి 2014 నాటికి మరో 50 లక్షలు అందిస్తామని వాగ్దానం చేసింది. కలయో నిజమో తెలియని స్థితిలో ఒక్క క్షణం ఆడిటోరియంలో నిశ్శబ్దం రాజ్యమేలింది. మరుక్షణం కరతాళ ధ్వనులతో దద్దరిల్లింది. **టిఎస్‌సిఎస్** కార్యకర్తలు, తలసీమియా పిల్లల తల్లిదండ్రుల కళ్ళలో ఆనందబాష్పాలు వెల్లివిరిసాయి. శ్రీ చక్రి ఫౌండేషన్ తరఫున శ్రీ పి.ఎస్.ఎన్. రాజు రూ॥ 5 లక్షల విరాళం ప్రకటించారు.

ఆర్థిక సహాయం అందించడమేకాక **టిఎస్‌సిఎస్**ను దర్శించి, కార్యకలాపాలను పరిశీలించిన పెద్దలంతా పలు సూచనలు చేశారు. వారి సలహా ప్రకారం, పిల్లలకు ఏ రోజూ రక్తానికి కొరత లేకుండా, పలు ఇంజనీరింగు కళాశాలలను సంప్రదించి, ఏ రోజు ఏ కాలేజిలో రక్తదాన శిబిరాలు నిర్వహించాలో ఓ టైమ్ టేబుల్ తయారుచేశారు. ఆ ప్రకారం రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తాన్ని సేకరిస్తున్నారు. అంతేకాదు. తలసీమియా వ్యాధిగ్రస్తులైన పిల్లలు పుట్టకుండా నివారించేందుకు, యువతీ యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించి, అతి సులభమైన ఓ పరీక్షద్వారా తలసీమియా వ్యాధి రహిత సమాజం నెలకొల్పాలన్నది **టిఎస్‌సిఎస్** లక్ష్యం. ఆ కృషిలో సహకరించాలని కూడా దాతలు నిర్ణయించారు.

చేతిలో చిల్లిగవ్వలేని స్థితిలో తీవ్ర నిరాశకు లోనై ఒక దశలో బాధ్యతల నుండి తప్పుకుందామనుకున్న రత్నావళి శ్రీ సత్యసాయి నిగమాగమంలో "స్టేజి షో" అనంతరం, కలలో కూడా ఊహించనివిధంగా లభించిన మద్దతుకు స్పందిస్తూ, భావోద్వేగంతో పూడుకున్న గొంతుతో, **"బాబాను దారి చూపించమని కోరాను. రహదారి చూపించారు"** అన్నది.

ఎన్నో రోజులుగా కష్టపడుతున్నా ఒక్క అంగుళం ముందుకు సాగలేని స్థితినుంచి, నిమిషాల్లో అన్నీ సమకూడి, అందరి చేయూత లభించడం, స్వామి కృపే తప్ప మరోటి కాదన్న విశ్వాసం ఆమెలో చోటుచేసుకుంది. రోజూ నిద్ర లేవగానే, **"నేనుండ భయమేల?"** అంటూ, ఎదురుగా గోడకున్న ఫోటోలోంచి చిరునవ్వుతో పలకరించే బాబా, తన వెంట ఉన్నారనే ధైర్యంతోనే ఆమె ముందుకు సాగుతోంది.

ప్రారంభంలో ఎందరో తల్లులవలె, కేవలం తన కుమారునికోసమే ఆక్రోశించింది. కొడుకు దూరమయ్యాక పిల్లలందరిలోనూ అతన్నే చూసుకుంటూ, 1800 మంది పిల్లల బాగుకోసం ఆర్తితో ఆమె పెట్టుకున్న మొరను స్వామి ఆలకించారు. సర్వాంతర్యామి, ప్రేమస్వరూపులైన భగవాన్ శ్రీ సత్యసాయి అంతటా, అందరిలో తానే ఉండి నడిపించారు. స్వార్థ రహితమైన సత్సంకల్పంతో తలపెట్టే ఏ పనికైనా తమ ఆశీస్సులుంటాయనే సందేశాన్నిచ్చారు.

(కేవలం రెండు నెలల వ్యవధిలో హైదరాబాదులో జరిగిన ఒక యథార్థ సంఘటన. స్వామి మహాభినిష్క్రమణ అనంతరం జరిగిన పరమాద్భుత లీల)

శ్రీ సత్యసాయి ప్రబోధామృతం

ఎమ్.ఎస్. ప్రకాశరావు



స్వామి దివ్యలేఖిని నుండి వెలువడిన ఆణిముత్యం **'శివ శివ శివ శివ యనరాదా'** అన్న గీతం. మానవుణ్ని సరైన సాధనతో మాధవునివైపు నడిపించగలిగేవి మనస్సు, ఇంద్రియాలు. ఆ మనస్సునూ, ఇంద్రియాలనూ, ఏవిధంగా మన అధీనంలో ఉంచుకోవాలో, మన సాధనకు వాటిని ఎలా వినియోగించుకోవాలో, ఎంతో ప్రేమతో, మనం అర్థం చేసుకోగల స్థాయికి దిగి వచ్చి, ఈ గీతంలో లలితమైన పదాలతో, సున్నితంగా సూచించేరు స్వామి.

శివశివ శివశివ యనరాదా జీవా
చింతలెల్ల బాపుకొని మనరాదా
శివసాయీశుని కనరాదా జీవా
సువివేకంబును గొనరాదా ॥శివ॥

శివమెత్తి జగమెల్ల తిరిగేవు
ఓ చిత్తమా! నీకెంత సిగ్గులేదె
అవని సుఖంబుల కల్లాడెడి
నీకావలికి మిగిలేదది ఏది? ॥శివ॥

పొద్దుపోక ఊరివారి సుద్దులంటే
మీరు సిద్ధమౌదురే కడు శ్రద్ధతోడ
ముద్దుముద్దుగాను సాయి ముచ్చటలు
చెప్పునప్పుడొద్దికగ నుండరె చెవులార! ॥శివ॥

పనిమాలి సినిమాలు పలుమారు
మీరు చనిచని కనినను తనివిలేదె
క్షణమైన దైవ సన్నిధిని నిల్వగ
కనులార కడు కష్టమౌగా ॥శివ॥

అవినీతి రోత మాటలందరితో
నీవనుటకు గౌరవమయ్యెనుగా!
నవనీతచోరుని నామము పల్కుట
నాల్కా, అవమానంబగునా! ॥శివ॥

పనిలేని శునకంబువలె మీరు
పరుగిడి వగరించి తిరిగేరు
క్షణమైన సత్సంగములో నిల్వగ
సాధ్యము కాదా చరణములార! ॥శివ॥

ఇచ్చవచ్చు చెడ్డపనులెల్ల సేయ
ఆ ఈశ్వరుండు మిమ్ము సృజియించినాడ
తెచ్చుకొని చేతులార తెల్వి యింకనైన మీరు
చెచ్చెరను హరిపూజ సేయరారె ॥శివ॥

పాటలు పాడిన ఫలమేమి?
మంచి మాటలు నేర్చిన మహిమేమి?
సూటిగ పెద్దల బాటనె పోయిన
సుఖముల మూటలు దొరుకునుగా ॥శివ॥

సులువుగ దొరికిన సుందర సాయిని
చులకన చేయగ చూతువుగా

పలు బొమ్మలకే పడిపడి మ్రొక్కిన
భయ భక్తులతో బ్రతుకుదువా ॥శివ॥

ప్రాపంచికమైన సుఖ భోగాలకోసం ఒళ్ళు మరచి తిరుగుతున్నావు, ఓ మనసా! నీకు సిగ్గులేదా? సుఖ భోగాల కోసం అల్లల్లాడిపోతున్న నీకు చివరకు మిగిలేదేమిటో తెలుసా? అని సూటిగా ప్రశ్నిస్తారు స్వామి. అలా ప్రేమగా మందలించకపోతే మన మనసు మారుతుందా? ఈ మందలింపులో కన్న తల్లి లాలన, పాలన సూచించే పదాల పొందిక కనిపిస్తుంది మనకి. ఇక జ్ఞానేంద్రియాల గురించి ముచ్చటిస్తూ, ఓ చెవులారా! మీకుగాని, వారికిగాని ప్రయోజనం చేకూర్చని ఊరివారి మాటలన్నీ శ్రద్ధగా వినడానికి సిద్ధపడతారే! ఏం బావుకుందామని! సాయి ముచ్చటలు ముద్దుగా చెపుతుంటే చక్కగా, వినయంగా వినకూడదా?! కృష్ణ నామ సంకీర్తన చేయకూడదా అంటూ ఎంతో ప్రేమతో సలహా ఇస్తున్నారు స్వామి ఈ గీతంలో.

"సర్వేంద్రియాణాం నయనం ప్రధానం" అంటారు. భగవంతుడు మనకు ప్రసాదించిన గొప్ప వరం కళ్ళు. చూడకూడని దృశ్యాలు చూసి అపురూపమైన ఈ వరాన్ని మనం దుర్వినియోగం చేసుకుంటున్నాము. అందుకే స్వామి, "మీకు ఏవిధంగానూ ఉపయోగపడని సినిమాలు మాటిమాటికి చూస్తారే! ఎంత చూసినా మీకు తనివి తీరదా? కనులారా! ఒక్క క్షణం దైవ దర్శనం చేసుకోవడం అంత కష్టమా?" అని ప్రశ్నిస్తారు. అంటే, "మీ దృష్టిని దైవంవైపు మళ్ళించి సద్వినియోగం చేసుకోండి" అని నర్మగర్భంగా మళ్ళీమళ్ళీ వినాలని కుతూహలం రేకెత్తించేలా ముద్దుముద్దుగా ఎంత చక్కగా చెప్పారో చూశారు కదా!

మనకి కీర్తినైనా, అపకీర్తినైనా సంపాదించేది మన మాటే! అందుకే, 'మిత భాష అతి హాయి, అతి భాష మతి హాని' అని స్వామి సూక్తి. అందుకే, ఓ నాలుకా! అవినీతి మాటలు అందరితో మాట్లాడటం నీకు గౌరవం తెస్తుందా? ఆ కృష్ణ పరమాత్మ నామస్మరణం నీకు అవమానమా? అని ప్రేమగా మందలిస్తారు స్వామి. అంటే, మన నాలుకను నిరంతర భగవన్నామ సంకీర్తనతో పునీతం చేసుకోవాలని సద్గురువుగా చక్కని హితబోధ చేశారు.

పనీ పాటా లేని శునకంలా అలసిపోయేలా ఎందుకు తిరుగుతారు బంగారూ! భగవత్కథలు వినిపించే సత్సంగానికి వెళ్ళడానికి మీకు సాధ్యం కాదా? అని ప్రశ్నిస్తారు స్వామి. అంటే, సత్సంగానికి వెళ్లే సన్మార్గంలో మీ నడక సాగించండి, అని సున్నితంగా, కన్నతండ్రిలా, హృదయానికి హత్తుకునేలా బోధించి చేయిపట్టి నడిపిస్తున్నారన్నమాట.

మీకిష్టమైన చెడ్డపనులు చేయడానికే భగవంతుడు మిమ్మల్ని సృజించాడా? ఒక్క క్షణం ఆలోచించండి. కాలం గడిచిపోతున్నది. ఇప్పటికైనా తెలివి తెచ్చుకుని ఊపిరి ఉన్నంతవరకు హరిపూజ చేయండి అని మృదువుగా హెచ్చరిస్తారు బాబా.

భక్తిరస ప్రపూర్ణమైన భజనలు చేస్తాం. విన్నవీ కన్నవీ మంచి కథలు చెప్తాం. ఏం ప్రయోజనం? అవి ఆచరించడమే విజ్ఞుల లక్షణం. పెద్దలు నడిచిన బాటను మనమూ అనుసరిస్తే, కేవలం సుఖం కాదు, సుఖాల మూట దొరుకుతుంది బంగారూ! అంటారు స్వామి.

కఠోరమైన సాధన చేస్తేగాని దైవదర్శనం లభించదు. అటువంటిది ఏ సాధనా చేయనవసరం లేకుండా సుందర సాయి దివ్యదర్శనం సులువుగా మీకు లభించింది. సర్వేశ్వరుడైన సత్యసాయి ఎదురుగా ఉండగా మీ జీవితాన్ని ఎందుకు వృథా చేసుకుంటారు? అని తాను పిలిస్తే పలికే దైవం అని స్వామి తెలియజేశారు.

దైవాన్ని తెలుసుకుని, వారి దివ్యదర్శనం చేసుకుని, ఆరాధించి, వారి బోధనలను విని, మన జీవితాల్ని తరింపజేయవలసిన మనస్సును, ఇంద్రియాల్ని సద్వినియోగం చేసుకుని దైవానుగ్రహం పొందండి అనే హితబోధను చంటిబిడ్డకు తల్లి బోధించినంత ప్రేమతో సున్నితంగా, చిన్నిచిన్ని పదాలతో గోరుముద్దలు తినిపించినట్టుగా ఈ గీతంలో రచించారు స్వామి.

లలితమైన పదాలతో, మనస్సుకు హత్తుకునే భావాలతోపాటు సునిశితమైన హాస్యం కూడా స్వామి కవిత్వంలో వినిపిస్తుంది. "దయచేత ధన్యులు కావలెరా" అన్న గీతం దీనికి గొప్ప ఉదాహరణ. ఆ గీతాన్ని పరిశీలిద్దాం.

దయచేత ధన్యులు కావలెరా!
ఎంతటివారైనా నీ దయచేత ధన్యులు కావలెరా!
అసురులైనా భూసురులైన
అఖండ తెలివిగలవారైనా ॥దయ॥

విద్య నేర్చి వాదాడినగాని
పద్యములెంతో చదివినగాని
కొండ గుహలలో నుండినగాని
కూర్చుని జపములు చేసినగాని ॥దయ॥

యోగాభ్యాసము చేసినగాని
భాగవతాదులు చూచినగాని
బాగుగ గడ్డము పెంచినగాని
పట్టెనామములు పెట్టినగాని ॥దయ॥

ముక్కుమూసి జపమాచరించిన
మ్రొక్కుచు బాగా నిలిచియుండిన
మ్రొక్కి యెంతయు యేడ్చినగాని
మొరలిడినను నీకు కరుగదు మనసు ॥దయ॥

కాషాయ వస్త్రము వేసినగాని
కంఠమాల ధరియించినగాని
గడగడమని జపమాల త్రిప్పిన
కడకు నీయొద్దకు రావలె బాబా ॥దయ॥

భక్తితో మిమ్ము గొలచినగాని
పుట్టపర్తికే వచ్చినగాని
పూజలు బాగా చేసినగాని
పుడమియంతయు తిరిగినగాని ॥దయ॥

సాధకునిలో అప్పుడప్పుడు తాను తన సాధనచేత భగవంతునికి చేరువవుతున్నాననే సాత్వికమైన అహంకారం తలెత్తుతూ ఉంటుంది. అటువంటి సాత్వికాహంకారాన్ని త్రుంచడానికి స్వామి, ఎంతటి గొప్ప సాధకునికైనా తన సాధనలో సాఫల్యం కేవలం భగవంతుని దయచేతనే సాధ్యమవుతుందంటారు.

మీరు గొప్ప విద్వాంసులు కావచ్చు, గొప్ప పాటలు పాడవచ్చు, కొండ గుహల్లో కూర్చుని తపస్సు చేయవచ్చు, నిష్ఠతో జపం చేయవచ్చు. అయినా సరే, ఆ జప తపాల ఫలితం మాత్రం దైవానుగ్రహంవల్ల మాత్రమే లభిస్తుందని ఈ గీతంలో హెచ్చరిస్తారు. దీనివల్ల తన సాధనను భగవంతుడు అనుక్షణం గమనిస్తూ ఉంటాడన్న ఎఱుక సాధకునిలో ఏర్పడి, ఆ సాధనను సక్రమంగా కొనసాగించగలుగుతాడు. ఈవిధంగా సాధకుని సన్మార్గంలో పెట్టడానికి కవిత్వాన్ని ఒక సాధనంగా స్వామి ఉపయోగించుకున్నారు.

నామాలు, ఊర్ధ్వ పుండ్రాలను మతసంప్రదాయాలుగా ధరించి, గడ్డాలు పెంచి, కాషాయ వస్త్రాలు ధరించి, గొప్పగా యోగాభ్యాసాలు చేసి, మెడనిండా రుద్రాక్షలు, తులసీ మాలలు ధరించి, నిరంతరం జపమాల త్రిప్పుతూ గొప్ప భక్తులమనుకుంటారు, కొందరు. అలాంటివారికి కనువిప్పు కలిగించడానికి వారిని విమర్శించకుండా, సునిశితమైన హాస్యం జోడించి, "బాహ్యాడంబరం భగవంతుని దగ్గరకు తీసుకువెళ్ళదు బంగారూ! అంతస్సాధన ముఖ్యం. అప్పుడే తన దయచేత మిమ్మల్ని ధన్యులను చేస్తాడు" అని చక్కని చమత్కారాన్ని తమ కవిత్వంలో ఆవిష్కరించారు, స్వామి.

భగవంతుడికి బాహ్యంగా దగ్గరగా ఉంటే చాలదు. మానసికంగా దగ్గర రావాలి. అప్పుడే వారి దయచేత ధన్యులవుతారని స్వామి హెచ్చరిస్తారు, ఈ గీతంలో.

పుట్టపర్తి వచ్చినా, ఆడంబరంగా పూజలు చేసినా, భూమిపై ఉన్న పుణ్యక్షేత్రాలన్నీ తిరిగినా సాయి దగ్గరికి చేరుకోలేవు. త్యాగంచేత, అచంచల విశ్వాసము, నిరంతర చింతన, ఆజ్ఞాపాలనచేత మాత్రమే స్వామి దయకు పాత్రుడవవుతావు. దయచేత ధన్యుడవవుతావు, అని నిజమైన సాధన భగవంతునిపట్ల మనఃపూర్వక ప్రార్థనతో చేయాలి సుమా అని సాధకుణ్ని చేయిపట్టి నడిపించడానికి ఉద్దేశించిన అపురూపమైన, అనన్య సామాన్యమైన గీతం ఇది.

ప్రత్యక్షరమూ మానవుల్లో చైతన్యాన్నీ, అచంచల విశ్వాసాన్నీ, సాధనలో పటిష్ఠతనూ చిగురింపజేసిన స్వామి కవితా సౌరభాలు శిరోధార్యాలు, చిరస్మరణీయాలు, అనుసరణీయాలు.

f

పిలిచితే పలుకుతావట!

ప్రొ॥ జి.ఎన్. మూర్తి

L

భగవంతుడు ప్రేమమయుడు. ప్రేమద్వారానే భగవంతుణ్ని ప్రసన్నం చేసుకోగలము. భగవంతుని ఆజ్ఞల్ని అనుసరించి, 'అందర్నీ సేవించు - అందర్నీ ప్రేమించు' ఆచరణలో పెట్టినప్పుడు తన అనుగ్రహాన్ని ప్రసాదిస్తాడు.

"నన్ను అందరిలో వీక్షించి, నన్ను సేవిస్తున్నట్లే అందర్నీ సేవించటం నాకు అమితానందాన్ని కల్గిస్తుంది. గాఢంగా ప్రార్థిస్తే, అంటే మనసు, మాట, క్రియ పవిత్రమై, ఏకీకృతమై పరిపూర్ణ విశ్వాసంతో, శరణాగతి భావంతో ప్రార్థిస్తే నా అనుగ్రహం వెన్వెంటనే లభిస్తుంది. అహంకార నిర్మూలనము, ఇంద్రియ నిగ్రహము, ఆహార విహారాలలో హితము, మితము పాటిస్తే నా అనుగ్రహం పూర్తిగా పొందగలుగుతారు" అని ప్రబోధించారు, భగవాన్.

మనము ఇతరుల సంక్షేమంకోసం, ఆనందంకోసం భగవంతుణ్ని ప్రార్థించాలి. వ్యధలకు, బాధలకు లోనైన వ్యక్తిగురించి కూడా మనం స్వామిని ప్రార్థించవచ్చు. లేదా సమాజ సంక్షేమంకోసం ప్రార్థించవచ్చు. మనం మంచి ఆలోచనలద్వారా స్వామిని ప్రార్థించటంకూడా సేవయే. ఇతరులను నొప్పించకుండా ప్రేమతో మాట్లాడటంకూడా సేవయే. దయా ప్రేమలతో ఎవరికి సహాయం చేసినా అది సేవయే.

పిలిచితే పలికే స్వామి, "సాయీ!" అని హృదయ పూర్వకంగా పిలిస్తే వెంటనే "ఓయీ!" అని పలికే స్వామి మన స్వామి.

ఒకసారి జాన్ హిస్లాప్, "స్వామీ, భక్తుడు అస్వస్థతకు, గాయానికి గురి అయినప్పుడు విభూతినే వాడితే సరిపోతుందా?" అని అడిగినప్పుడు స్వామి, "తీవ్రమైన అస్వస్థతకు గురియైనప్పుడు విభూతి వాడినా వాడక పోయినా స్వామిని గాఢంగా ప్రార్థించాలి" అన్నారు.

సుప్రసిద్ధ వైద్యుడు గాలెన్, "నేను ఔషధాలు ఇచ్చాను, భగవంతుడు నయం చేశాడు" అంటాడు.

1982వ సం॥లో స్వామి జన్మదినోత్సవం పూర్ణచంద్ర సభా మండపంలో అత్యంత వైభవంగా జరుగుతోంది. సుప్రసిద్ధ గాయని శ్రీమతి ఎస్. జానకి, "కాలినడకన తిరుమలకు వచ్చి నీ దర్శనం చేసుకుంటాను" అని ప్రతిన బూనిన ఒక వృద్ధురాలి అవస్థగురించి హృద్యంగా, కరుణారస, భక్తిరస పూర్వకంగా గానం చేస్తున్నారు. ఆ పాటలోని వృద్ధ భక్తురాలు తాను ప్రారంభించిన నడక వయోభారం వలన కొనసాగించలేక వేదనతో, "గోవిందా! నా ప్రతిన నెరవేరకుండానే నన్ను తీసుకుపోతావా? నన్ను కాపాడవా?" అని పరితపిస్తుంది. వేంకటేశ్వరస్వామి బాలుని రూపంలో ప్రత్యక్షమై చెయ్యిపట్టుకుని ఆమెను నడిపించి, తిరుమలకు చేర్చి, ఆమెకు దర్శనమిచ్చి తనలో ఐక్యం చేసుకోవడాన్ని వర్ణిస్తూ శ్రీమతి జానకి పాడిన పాట అందర్నీ ముగ్ధుల్ని చేసింది. 'పిలిచితే పలుకుతావట' అన్న భావనకు ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది.

ఆనాడు పూర్ణచంద్ర సభామందిరం భక్తులతో క్రిక్కిరిసిపోయింది. ఆ మందిరంలో కూర్చుని ఉన్న ఒక భక్తురాలు శ్రీమతి జానకి పాటకు ముగ్ధురాలై, మురిసిపోయి ఆ పాటలోని వృద్ధురాలి అదృష్టానికి పరవశిస్తుంది. "స్వామీ, ఆ వృద్ధురాలి ప్రార్థనకు నీవు వెంటనే స్పందించి పలికేవు. ఆమె కోరిక తీర్చేవు. నేను ఇక్కడ కూర్చుని నిన్ను ప్రార్థిస్తున్నాను. మరి నా కోరిక తీర్చి నాతో మాట్లాడవా? నా వేదన పరిహరించవా స్వామీ?" అని దీనాతిదీనంగా కళ్ళు మూసుకొని ప్రార్థిస్తూంటుంది.

స్వామి హఠాత్తుగా సింహాసనం దిగి లేచి నడచి వచ్చి ఆమె ఎదురుగా నిల్చున్నారు. ఆమె కళ్ళు తెరిచేసరికి ఆమెను జాలిగా, ప్రేమతో చూస్తూ, "నువ్వు నీ ప్రార్థనకు స్పందిస్తానో లేదో అనుకున్నావు కదా! ఇదిగో వచ్చి నీ ముందున్నాను" అన్నారు.

"స్వామీ, నువ్వు పిలిచితే పలుకుతావన్నమాట సార్థకమైంది" అంటూ ఆమె ఆనందబాష్పాలు రాల్చింది.

మరణ సమయంలో ఆర్తితో పిలిచిన భక్తులు కరణం సుబ్బమ్మ, కస్తూరి ప్రభృతులకు స్వామి దర్శనమిచ్చి ముక్తి ప్రసాదించిన సంఘటనలు మనకు విదితమే.

ఒకసారి త్రయీ బృందావనంలో స్వామి సన్నిధిలో విద్యార్థులు భజన చేస్తున్నారు. తాళం వేస్తున్న స్వామి ఉన్నట్లుండి తాళం ఆపివేశారు. స్వామి వదనారవిందములో భావం మారిపోయింది. ఎక్కడో దూరంగా ఆలోచనలో ఉన్నట్లు కనిపించారు. విద్యార్థుల పాటలకు స్పందించటం లేదు. కొన్ని క్షణాల తర్వాత హఠాత్తుగా లేచి నిలబడి హారతి తీసుకుని మధ్యలోనే వెళ్ళిపోయారు.

ఆ మరుసటిదినం విద్యార్థులతో ముచ్చటిస్తూ, "నిన్న భజన సమయంలో అజిత్ దత్ (ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్) మరణావస్థలో, అవసాన దశలో స్వామి దర్శనంకోసం ప్రార్థించాడు. అందువలన నేను అతనికి దర్శనం ఇవ్వటానికి వెళ్ళవలసి వచ్చింది" అన్నారు.

హృదయాంతరాళాలలోనుండి భక్తి విశ్వాసాలతో నోరారా పిలిచితే పలకటం అంటే ఇదే మరి!

ఒకసారి గుంటూరులో మద్యపాన నిషేధం మీద చాలా పెద్ద సభ జరిగింది. మేధావులు, విద్యావంతులు, ఆధ్యాత్మిక వేత్తలు, స్వామి భక్తులు అనేకమంది సభకు హాజరయ్యారు. ఆ సభలో స్వామి ప్రేరణతో నేను చేసిన ప్రసంగంలో ప్రధాన భాగం ఇక్కడ వివరిస్తాను:

"సారాయి వైన్ (wine), సాయి డివైన్ (divine);
సారాయి వదలరా అన్నా! సాయిని తలచుటే మిన్న;
'వైన్' త్రాగితే వశం తప్పుతావు;
'డివైన్' అయితే పరవశమవుతావు;
వశం తప్పడంకన్నా పరవశమవటం మిన్న;
సారాయి వదలరా అన్నా! సాయిని తలచుటే మిన్న;

సాయి (SAI) అంటే See Always Inside; నిరంతరం అంతర్దృష్టితో జీవితాన్ని గడుపు. 'నేను స్వర్గాన్ని కోరను, రాజ్యాన్ని కోరను, మోక్షాన్ని కోరను. దుఃఖతప్తులైన జీవుల ఆర్తి నశింపజేయాలని కోరుకుంటున్నాను' అన్న ఉపనిషద్వాక్యంతో ప్రసంగాన్ని ముగించాను.

ఒక పర్యాయం స్వామి సన్నిధిలో ప్రసంగిస్తూ చెప్పాను, If I succeed it is Yours; if I fail, it is mine, but I will never fail because 'I' always embraces SAI.

(నేను విజయం సాధిస్తే అది నీ అనుగ్రహమే. ఒకవేళ నేను ఫెయిల్ అయితే అది నా దోషమే. కానీ, నేను ఫెయిల్ కావటమన్నది అసంభవం. ఎందుకంటే నేను (I) అన్నది SAI లో అంతర్భాగమే).

భక్తులు అనేక ఆకస్మిక, విపత్కర సన్నివేశాలలో స్వామిని ప్రార్థిస్తే వెంటనే ఆదుకుని 'నీ ప్రార్థన నాకు వినిపించింది' అన్నారు, భగవాన్.

స్వామి పిలిచితే పలుకుతారన్నది నాడు, నేడు, ఎల్లప్పుడూ సత్యమే! అనుభూతుల, అనుభవాల సమాహారమే!

అచంచలమైన భక్తి, స్థిరమైన చిత్తము, దృఢమైన విశ్వాసము – ఈ మూడూ ఉన్నప్పుడే దైవాన్ని ప్రత్యక్షం చేసుకోవడానికి వీలౌతుంది.

- బాబా

స్వామి సన్నిధిలో పురుషోత్తమానంద

డా॥ జంధ్యాల సుమన్‌బాబు



భగవాన్ బాబావారు కొందరు భక్తులతో హృషీకేశ్ నుంచి బయలుదేరారు. ప్రయాణంలో ఒకచోట బస్సులు నిలిపి, బాబా ఒక్కరే కాలిబాటన గంగాతీరం వెంట నడిచి ఒక ఋషిని అనుగ్రహించటంకోసం ప్రక్కన ఉన్న వసిష్ఠ గుహలోకి వెళ్ళారు. అప్పుడు రాత్రి 9 గంటలయింది. ఆ గుహలో 70 సంవత్సరాల వయస్సుగల పురుషోత్తమానంద కఠిన తపస్సుతో జీవితం గడుపుతున్నారు. బాబా అందరినీ బయట ఉండమని చెప్పి లోపల తలుపు వేసుకున్నారు.

కొంతసేపటికి వేంకటగిరి వాస్తవ్యుడు, దివ్యజీవన సంఘ అధ్యక్షుడు, అడ్వొకేట్ సుబ్బరామనాయుడుగారు స్వామి ఇంకా రాలేదే అని గుహ దగ్గరకు వెళ్ళి తలుపు సందులోనుంచి లోపలకు చూశారు. ఆ దృశ్యం పరమాద్భుతమైనది. పురుషోత్తమానంద ఒడిలో భగవాన్ తలపెట్టుకొని పవళించారు. శ్రీ సత్యసాయినాథుని శరీరం దివ్యకాంతులతో జ్యోతిర్మయమై భాసించింది. బాబావారి ఆకృతి చాలా పెద్దదైనట్లుగా కనిపించింది. భగవాన్ బాబా వారి ముఖం నుంచి, శరీరం నుంచి అమితమైన కాంతి తరంగాలు వెలువడసాగాయి. ఆ గుహ అంతా కాంతి మండలమయింది. ఆ దర్శనానికి పురుషోత్తమానంద పారవశ్యంతో బాహ్యస్మృతిని కోల్పోయారు.

బాబా లేచి వృద్ధుడైన ఆ మహర్షి ప్రక్కన కూర్చొని, పేరుపెట్టి పిలిచి, నిదానంగా ఆయనను బాహ్యస్మృతికి తీసుకొని వచ్చారు. మనోహరంగా త్యాగరాజస్వామి కీర్తనను పాడి వినిపించి, వారికి ఆనందం కలిగించారు. హస్తచాలనం చేసి, గులాబీరంగు స్ఫటికమాలను సృష్టించి పురుషోత్తమానందకు ప్రసాదించారు. తరువాత బాబావారి సంభాషణలో పురుషోత్తమానందకు పద్మనాభస్వామి అంటే చాలా ఇష్టమని, అందువల్ల ఆ వృద్ధతపస్వికి భగవాన్ బాబా జ్యోతిపద్మనాభస్వామి దర్శనమనుగ్రహించారని తెలిసింది.

బాబా సంభాషిస్తుంటే, పురుషోత్తమానంద ముకుళిత హస్తాలతో, మెరిసే చిరునవ్వుతో బాబా చెప్పే ప్రతి మాట ఎంతో ఆరాధనాభావంతో వినటం అందరూ గమనించారు. పురుషోత్తమానంద ఆ గుహలో ప్రవేశించిన తొలి రోజుల్లో పడిన అవస్థలను, జరిగిన సంఘటనలను బాబా వివరిస్తుంటే, బాబాతోపాటు వచ్చిన కస్తూరిగారు తదితరులు ఆశ్చర్యంతో వినసాగారు.

మొదట్లో వారు చాలాకాలం నిప్పు రాజేసుకోవడానికి చెకుముకి రాళ్ళనే ఉపయోగించేవారట. ఒకసారి గుహలో ఒక మూల అగ్గిపెట్టెల కట్ట ఒకటి కనిపించిందట.

ఆ మాట వారు చెప్పినప్పుడు బాబా, "అవును, ఆ అగ్గిపెట్టెల కట్ట అక్కడ ఉంచింది నేనే" అన్నారు. ఆ మాట విని ఆ ఋషి ఆశ్చర్యంతో తటాలున లేచి నిటారుగా కూర్చున్నారు. ఆ శిష్యులుకూడా ఆ రహస్యాన్ని తెలుసుకొని ఆనందించారు. "బాబాకు సమస్తము తెలుసు. కారణం ఏమిటంటే సమస్తము ఆయనే" అన్నారు వారు.

మరునాడు కూడా బాబా వసిష్ఠ గుహలోకి వెళ్ళి పురుషోత్తమానందతో సమావేశమయ్యారు. బయట వాతావరణమంతా కుంభవర్షం కురవటానికి సిద్ధంగా ఉంది. లోపల బాబా పురుషోత్తమానంద కోరికపై "శ్రీ రఘువర సుగుణాలయ" అనే కృతిని మధుర మధురంగా ఆలపించారు. వాతావరణం వర్షం లేకుండా చల్లగా మారిపోయింది.

2005 అక్టోబరు 11వ తేదీనాడు భగవాన్ బాబా ప్రశాంతి నిలయంలో నవరాత్రి ఉత్సవాలలో ప్రసంగిస్తూ, పురుషోత్తమానందను కొనియాడుతూ ఇలా అన్నారు:

"నేను హృషీకేశ్‌కు వెళ్ళినప్పుడు అక్కడ వసిష్ఠ గుహలో పురుషోత్తమానంద ఉండేవాడు. ఆ గుహలో ఒక చిన్న దీపము పెట్టుకొని ఆయన ఒక్కడే అక్కడుండేవాడు. రోడ్డుపైకి వచ్చి ఎవరైనా వెళుతుంటే 'కొంచెం పాలు ఇవ్వండి' అని అడిగి తీసుకునేవాడు. వాటితో టీ చేసుకుని త్రాగేవాడు. అప్పటికి ఆయన బాగా వృద్ధుడైనాడు. కట్టకడపటికి రోడ్డుమీదకు వెళ్ళడానికి కూడా ఆయనకు శక్తి లేకపోయింది. ఆ కొండ చాలా ఎత్తైనది. రెండు చేతులు, రెండు కాళ్ళ సహాయంతో ప్రాకుతూ ఆయన కొండనెక్కేవాడు. ఎవరైనా పాలు ఇస్తే వాటిని ఒక వారం రోజులు పెట్టుకునేవాడు. తిరిగి వారంవరకు ఎవరివద్దకూ పోయేవాడు కాదు.

నేను అక్కడికి వచ్చానని తెలుసుకొని, 'భగవాన్, దయచేసి ఒకసారి వచ్చి దర్శనమివ్వండి' అని ఒక చీటీ వ్రాసి పంపించాడు. అది చూసి నేను వెంటనే వెళ్ళాను. నావెంట కస్తూరికూడా వచ్చాడు. పురుషోత్తమానంద ఆనందానికి అవధుల్లేవు. 'ఈనాడు నేను నిజంగా పురుషోత్తముని దర్శించుకున్నాను. నా జన్మ తరించింది' అంటూ ఆనందబాష్పాలు రాల్చాడు. ఆయనకు తాళం కొట్టడానికి కస్తూరి కూడా అక్కడే ఉన్నాడు. ఆయన నన్ను తనదగ్గరే కూర్చోపెట్టుకొని కస్తూరితో, 'మీరు లోపలికి వెళ్ళి చూడండి' అని చెప్పాడు. కస్తూరి ఎంతైనా జర్నలిస్టు కదా! లోపల ఇంకేమైనా సమాచారం లభిస్తుందేమోనన్న ఆశతో లోపలికి పోయాడు. పురుషోత్తమానంద మాత్రం నాపైననే తన దృష్టిని కేంద్రీకరించి సమాధి స్థితిలోకి వెళ్ళాడు.

ఆయన ప్రార్థనను మన్నించి రెండవ దినం కూడా నేనక్కడికి వెళ్ళాను. అక్కడినుండి తిరిగి వచ్చేసేటప్పుడు కస్తూరి దగ్గర ఒక చిన్న కాగితం తీసికొని 'నేను మళ్ళీ ఫలాని తేదీన, ఫలాని టైమ్‌కు వస్తాను' అని వ్రాసి పురుషోత్తమానంద చేతికిచ్చాను. ఆరోజున ఆయన గంగానదిలో స్నానం చేసి వచ్చి నా దర్శనంకోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు. చెప్పిన సమయానికి నేను ఆయన ఎదుట సాక్షాత్కరించాను. ఆనందంగా స్వామిని చూస్తూ చూస్తూ ఆయన స్వామిలో ఐక్యం చెందాడు.

'పురుషోత్తమానంద మీలో చేరిపోయారు' అని ఆయన శిష్యులు నాకు టెలిగ్రామ్ ఇచ్చారు. ఆ సమయంలో రాజారెడ్డి కూడా ఉన్నాడు. పురుషోత్తమానంద పుట్టిన దినము, సమాధి చెందిన దినము రెండూ ఒక్కటైనాయి. 'ఆయన గుహలోకి వెళ్ళి మీరు చూడండి' అని చెప్పాను. ఆ గుహను తెరచి చూస్తే అంతా భస్మంతో నిండి ఉంది.

ఆ తరువాత ఆయన శిష్యులందరూ పుట్టపర్తికి వచ్చి పదిరోజులున్నారు. వారికి నేను తగిన గౌరవ, మర్యాదలు చేసి పంపించాను. ఈవిధంగా చాలామంది ఋషులు స్వామి దర్శనంకోసం ఎంతో పరితపిస్తున్నారు."



సాయి సన్నిధి

వివిధ సాయిసంస్థలలో పనిచేస్తున్న పూర్వ విద్యార్థులు సెప్టెంబరు 8వ తేదీన సాయంకాలం సాయికుల్వంత్ హాలులో ఒక సంగీత విభావరిని సమర్పించారు. ముందుగా శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయ కామర్స్ విభాగములో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎన్. శివకుమార్ విద్యార్థులను స్వామే ఎంపిక చేసి తమ సందేశాన్ని చాటడానికి ఉపకరణములుగా తీర్చిదిద్దారని చెప్పారు. స్వామి ప్రతి విద్యార్థిపై ప్రేమను వర్షించి మాతృభావనకు విశిష్టతను చేకూర్చారన్నారు.

వీరి ప్రసంగానంతరం భక్తులకు స్వామి సందేశాన్ని వినిపించారు. స్వామి తమ సందేశములో సాయి సంస్థలు క్రమశిక్షణను తప్పక పాటించాలన్నారు. సాయి భక్తులు వారు భారతీయులైనా, విదేశీయులైనా ఆదర్శవంతమైన జీవితాన్ని గడపాలన్నారు.

అనంతరం, పూర్వ విద్యార్థులు తమ సంకీర్తనను "నా జీవితములో క్షణమైనా మీనుండి ఎడబాటు ఉండకూడదు" అన్న అర్థం వచ్చే ఆంగ్ల గీతముతో ప్రారంభించారు. ఒక గంటా నలభై నిమిషాలపాటు సాగిన ఈ సంకీర్తన త్యాగరాజ కీర్తనతో, ఖవ్వాలీ పాటతో ముగిసింది.

గణేశ చతుర్థి

సెప్టెంబరు 9వ తేదీన ఉదయం రుద్ర పఠనముతో గణేశ చతుర్థి కార్యక్రమములు ప్రారంభమయ్యాయి. సాయి విద్యార్థులు గణేశ అష్టకాన్ని పఠించి తదుపరి గణేశుని స్తుతిస్తూ భజన పాటలను పాడారు. నాటి సాయంకాలం కుల్వంత్ హాలులో డాక్టొరల్ రీసర్చ్ స్కాలర్ డా॥ సాయి గిరిధర్ సాయిరాం భారతీయ సంస్కృతియొక్క విశిష్టతపై ప్రసంగించారు. దైవమే భారత భాగ్య విధాతగా వ్యవహరించడం మన అదృష్టమన్నారు. "నా సంస్మరణ నిన్ను నా అనుగ్రహానికి పాత్రుడను చేస్తుంది" అన్న స్వామి మాటలను ఉటంకించారు.

వీరి ప్రసంగానంతరం స్వామి సందేశాన్ని భక్తులు విన్నారు. విద్యార్థులు వ్యర్థమైన ప్రాపంచిక విషయాలపట్ల ఆసక్తిని విడనాడాలని స్వామి చెప్పారు.

గణేశ నిమజ్జనం

సెప్టెంబరు 11వ తేదీన నిమజ్జనానికి ముందు సాయం వేళలో గణేశ ప్రతిమలను ఊరేగింపుగా సాయి కుల్వంత్ హాలుకు తీసుకు వచ్చారు. సంప్రదాయమైన ఎలుక వాహనాన్నేకాక విద్యార్థులు సృజనాత్మకముగా తీర్చిదిద్దిన అనేక ఇతర వాహనాలను అధిరోహించిన గణేశ ప్రతిమలు భక్తులను ఆకట్టుకున్నాయి. శ్రీ సత్యసాయి హైయర్ సెకెండరీ స్కూలు బాలలు నర్తించారు.

ఓణం పండుగ

కేరళ భక్తులు వారి అత్యంత ప్రధానమైన ఓణం పండుగను ప్రశాంతి నిలయంలో మూడు రోజులపాటు సెప్టెంబరు 14 నుండి జరుపుకున్నారు. శ్రీ సత్యసాయి హాస్పిటల్‌లో గుండె ఆపరేషన్లు చేయించుకొని వారివారి గ్రామాలకు వెళ్ళిన రోగులకు శ్రీ సత్యసాయి సేవాసంస్థల ద్వారా శస్త్ర చికిత్సా అనంతర వైద్యసేవలను (శ్రీ సత్యసాయి రిహాబిలిటేషన్ ప్రాజెక్టు) ఎన్నో సంవత్సరాలుగా అందిస్తున్నారు.

ఈ సంవత్సరము కేరళ రాష్ట్రమునుండి సాయి రిహాబిలిటేషన్ పథకం వలన లబ్ధి పొందిన 400 మంది కేరళ నుండి వేలాది భక్తులతో కలసి ప్రశాంతి నిలయం వచ్చారు. సెప్టెంబరు 14వ తేదీన సాయికుల్వంత్ హాలులో కేరళ రాష్ట్ర సాయిసంస్థల అధ్యక్షులు ప్రొ॥ ముకుందన్ గతములో స్వామి సన్నిధిలో జరిగిన ఓణం ఉత్సవాలు నేటికీ మధుర భావనగా నిలిచిపోయి స్ఫూర్తిని అందిస్తూనే

ఉన్నాయన్నారు. డా॥ ఆనంద మోహన్ శ్రీ సత్యసాయి రిహాబిలిటేషన్ పథకం వలన రోగులు పొందుతున్న ప్రయోజనాన్ని వివరించారు. వీరు ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర స్థాయిలో కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో వాలంటీర్లుగా పని చేస్తున్న శ్రీ మిథున్, శ్రీ బాలకృష్ణన్ క్షేత్ర స్థాయిలో వారు పొందిన అనుభవాలను వివరించారు. అడ్వొకేట్ అయిన శ్రీ బాలకృష్ణన్ ఈ పథకమువలన ప్రయోజనము పొంది ఆ స్ఫూర్తితో వాలంటీర్‌గా పని చేస్తున్నారు.

వీరి ఉపన్యాసాల అనంతరం బాలవికాస్ పూర్వ విద్యార్థి అయిన శ్రీ సత్యనారాయణ్ ప్రశాంతి భజన గీతాలను పాడారు. ప్రఖ్యాత గాయకులు అనూప్ జొలోటా శిష్యులైన వీరు 'సాయిబాబా బోలో', 'మేరా జీవన్ తేరే హవాలే ప్రభూ' పాటలను పాడారు. శ్రీ సత్యనారాయణ్ సోదరీమణులు ముగ్గురు గాత్ర సహకారాన్ని అందించగా శ్రీ నిశికాంత్ బరొడేకర్ తబలాపై, శ్రీ శ్రీధర్ వయొలిన్‌పై సహకారాన్ని అందించారు.

సత్సంగ మాహాత్మ్యం: శ్రీ సత్యసాయి విద్యావిహార్, శ్రీశైలం బాలలు సెప్టెంబరు 15వ తేదీన 'సత్సంగ మాహాత్మ్యం' సంగీత నృత్య నాటికను సమర్పించారు. సత్సంగము ఆత్మసాక్షాత్కారానికి తోడ్పడుతుందని ఈ నాటిక సందేశం. విశ్వామిత్రుని ఆధ్యాత్మిక సాధన అతనికి వసిష్ఠునిపట్ల గల అసూయవలన కుంటుపడుతుంది. ఆదిశేషునివద్ద సత్సంగముయొక్క మాహాత్మ్యాన్ని గ్రహించిన విశ్వామిత్రుడు సాధన చేసి బ్రహ్మర్షిగా గుర్తింపు పొందుతాడు. భగవాన్ బాబావారి స్వరములో, "సత్సంగత్వే నిస్సంగత్వం" పాటను వినిపించి నాటికకు ముగింపు పలికారు.

ఈ ప్రదర్శనకు ముందు డా॥ కె.ఎస్. రాధాకృష్ణన్, డా॥ కె.బి.ఎస్. రాజన్ ఉపన్యసించారు. డా॥ రాధాకృష్ణన్ కేరళవాసులకు ప్రశాంతి నిలయంలో ఓణం పండుగను జరుపుకునే భాగ్యాన్ని ప్రసాదించిన స్వామికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఆధ్యాత్మిక అభివృద్ధి కొందరికే పరిమితము కాక అందరూ సాధించవలసిన ఆవశ్యకతను వివరించారు. జుడిషియల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ సభ్యులైన డా॥ రాజన్ ప్రస్తుత కాలములో మానవుని జీవితం ప్రతికూలమైన దృష్టితో మలినమైందనీ, భగవాన్ ప్రబోధించినట్లుగా హృదయాన్ని ప్రేమమయం గావించుకోవాలన్నారు.

తిరు ఓణం

సెప్టెంబరు 16వ తేదీన ఓణం పండుగను కేరళ వాసులు స్వామి సన్నిధిలో అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆరోజు ఉదయం రుద్ర పఠనానంతరం శ్రీ టి.ఎస్. రాధాకృష్ణన్, వారి కుమారుడు శంకర్, కుమార్తె లక్ష్మి మళయాళములో భక్తిగీతాలను గానం చేశారు. అనంతరం కేరళ భక్తులు భజన గీతాలను ఆలపించారు. ఆరోజు సాయంకాలం శ్రీ టి.ఎ. ఆనంద్ వయొలిన్‌పై భక్తిగీతాలను వినిపించగా, పాలక్కాడ్ ముఖేష్ కుమార్ మృదంగ సహకారాన్ని, శ్రీ వి. శ్రీజిత్ ఘట సహకారాన్ని అందించగా శ్రీ పి.జి. ప్రసాద్ శంఖ వాదనతో సహకరించారు.

సంగీత కార్యక్రమానంతరం వార్షిక వ్యాస రచన పోటీలలో నెగ్గిన విద్యార్థినీ విద్యార్థులు బంగారు పతకాలను శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులు శ్రీ ఆర్. జె. రత్నాకర్, ట్రస్టు సెక్రెటరీ శ్రీ ప్రసాదరావులనుండి అందుకున్నారు. ఈ వ్యాస రచనల పోటీలలో 750 విద్యాసంస్థలనుండి 20,699 మంది పాల్గొన్నారు.

తిరు ఓణం పండువను పురస్కరించుకొని కేరళ భక్తులు 'మహాబలి' నృత్య నాటికను సమర్పించారు. ఈ నాటికలో వామనమూర్తి మహాబలిని అడిగిన మూడు అడుగులు మనస్సు, వాక్కు, ఆచరణలకు సంకేతాలు. పరమ భాగవతోత్తముడైన మహాబలి వాక్కును, ఆచరణను భగవదర్పితం గావించాడు. అయితే, మనస్సును సంపూర్ణంగా భగవదర్పితం చేయలేదు. విష్ణువు బలిని అనుగ్రహింపదలచి వామనాకారములో వచ్చి అతనికి కనువిప్పు కలిగించి సంపూర్ణ శరణాగతుడను చేయటం ఈ నాటిక అంతరార్థం.

భాగవత సప్తాహం

శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయ ప్రశాంతి నిలయం క్యాంపస్ విద్యార్థులు భాగవత సప్తాహాన్ని నిర్వహించారు.

ముగింపు కార్యక్రమాన్ని సెప్టెంబరు 20వ తేదీన సాయికుల్వంత్ హాలులో జరుపుకున్నారు. నృత్యాలతో, పాటలతో, వ్యాఖ్యానాలతో ఈ కార్యక్రమం రసవత్తరంగా సాగింది. "హరి బిన్ సావన్" పాట భక్త మీరాకు శ్రీకృష్ణుని ఎడబాటు కలిగించిన వ్యధకు అద్దం పట్టింది. "సర్వేశ్వరీ జగదీశ్వరీ" పాట పాడినప్పుడు వ్యాఖ్యాత శ్రీ రామకృష్ణ పరమహంసకు కాళీమాతపట్ల గల దాస్యభక్తిని వివరించారు. శ్రీరామకృష్ణ తనను తాను హనుమంతునిగా, కాళీమాతను శ్రీరామునిగా భావించి సాధన చేయగా అతనికి తోక కూడా ఏర్పడటం శ్రీరామకృష్ణుని భక్తికి, ఏకాగ్రతకు తార్కాణమన్నారు. చివరగా విద్యార్థులు, "భాగవతం వింటే బాగవుతాం" అన్న ఇతివృత్తం ఆధారంగా నర్తించారు.

పర్తి యాత్ర

ఉత్తరాఖండ్ మరియు ఉత్తరప్రదేశ్ భక్తులు సెప్టెంబరు 24 నుండి 27 వరకూ ప్రశాంతి నిలయంలో ఉండి ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. వారి పర్తియాత్రలో భాగంగా సెప్టెంబరు 25వ తేదీన ఒక సంగీత విభావరిని సమర్పించారు. వారణాసి భక్తులు శ్రీ రాజేంద్ర కుమార్ మురళీ వాదనను వినిపించగా శ్రీ భూపేంద్ర కుమార్ ప్రధాన తబలా సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి ముందు సాయిసంస్థల రాష్ట్రీయ అధ్యక్షులు శ్రీ రాజీవ్ చోప్రా ఉత్తరాఖండ్ వరద ముంపుకు గురి అయినప్పుడు సాయి సంస్థలు అందించిన సేవలను వివరించారు.

- దివి చతుర్వేది

f
g~ P`ãf~∂ÑÅ

భగవాన్ ఆంధ్రప్రదేశ్ పర్యటిస్తూండగా వారి వెంట కస్తూరిగారు కూడా వెళ్ళేరు. స్వామి దివ్యోపన్యాసములలో ముఖ్యాంశములు నోట్ చేసుకుని 'సనాతన సారథి'లో ప్రచురించే అవకాశం ఉంటుందన్న ఉత్సాహంతో వెళ్ళేరు. స్వామి అయిదారు రోజుల్లో ఎక్కడికి వెళ్ళినా తమ దివ్యోపన్యాసములలో, "మీరందరూ ఆత్మస్వరూపులు. మీరు దేహములనే భ్రాంతితో మీ నిజస్వరూపాన్ని మరచిపోతున్నారు" అనే అంశాన్నే అనేక ఉపమానాలతో, నిత్య జీవితంలోని అనుభవాలతో విశదీకరిస్తున్నారు.

కస్తూరిగారికి ఒక ఆలోచన వచ్చింది. ఆయనకీ పర్యటనలో ట్రాన్స్‌లేషన్ బాధ్యత లేదు. సనాతన సారథిలో ప్రచురించడానికి కావల్సిన విషయాలను స్వామి దివ్యోపన్యాసములనుండి సేకరించటమే ఆయన లక్ష్యం. ఒకసారి ఆయనకు స్వామితో ఏకాంతంగా మాట్లాడే అవకాశం లభించింది. వెంటనే ధైర్యం చేసి ఆయన స్వామితో, "ఈరోజున భగవద్గీతమీద తమ దివ్యోపన్యాసం ఇవ్వండి" అని ప్రార్థించేరు.

సర్వజ్ఞులైన స్వామి, "కస్తూరీ! నీ పత్రికలో ప్రచురించే అంశాల వైవిధ్యంగురించి నువ్వు ఆలోచిస్తున్నావుకానీ, మానవులను ప్రాపంచిక భోగ భాగ్యాలు, భవ బంధాలయొక్క ఆకర్షణ నుంచి తప్పించి వారి నిజస్వరూపాన్నిగురించి, నిత్య సత్యమైన భగవత్తత్త్వాన్నిగురించి మనస్సుకు నాటుకునేటట్లు పదేపదే బోధించడం అవసరం" అన్నారు. దానితో కస్తూరిగారికి కనువిప్పు కలిగింది.

ÇÏ#∞=∂< qQÇÏ Ñu+

అవతార పురుషునికి తన భక్తుని మీద ఉన్న అపారమయిన ప్రేమకు చిహ్నంగా ప్రశాంతి నిలయంలోని విద్యాగిరిమీది అద్భుతమయిన హనుమంతుని విగ్రహం నిలిచి ఉన్నది. భగవంతుని ప్రణాళికలో భక్తికున్న ఆధిక్యాన్నికూడా అది తెలుపుతున్నది. మనం ఆ కొండ దిగువన నిలబడి పైకి చూస్తే శ్రీకృష్ణుడూ, శిరిడీ సాయిబాబా, శివుడు, బుద్ధుడు, జీసస్, జొరాస్టర్ మొదలైన అవతారాలూ ప్రవక్తల విగ్రహాలూ కాస్త క్రిందుగానూ, సాటిలేని మేటి అయిన ఈ భక్తుని విగ్రహమేమో అందరికంటే ఎత్తైనచోటా కన్పిస్తుంది. 1990లో ఈ హనుమాన్ బృహద్విగ్రహాన్ని కొండమీద నిలిపిన కథ ఎంతో బాగుంటుంది.

భగవాన్ బాబావారు తమ 65వ జన్మదినంనాడు ఆ కొండమీద 65 అడుగుల ఆంజనేయ విగ్రహాన్ని ప్రతిష్ఠాపించాలనుకోవడంతో ఈ ప్రాజెక్టు మొదలయింది. పని మొదలవడానికి ముందు వారు కొండమీదకు వచ్చినప్పుడు విగ్రహం ఉంచాల్సిన స్థలాన్ని ఎన్నుకొన్నారు. **"ఆ శిల్పం అక్కడ వందల సంవత్సరాలు ఉండబోతున్నది. అందువల్ల అక్కడ లోపల ఖాళీగా, పైపైన పోతపోయడం లాంటి పైపై పనులు వద్దు. ఘనంగా, బలిష్ఠంగా శిల్పాన్ని తయారు చేయండి"** అని ఆదేశించారు.

1990 ఫిబ్రవరి 19వ తేదీనాడు భూమి పూజ సమయంలో స్వామి సుమారు మూడున్నర అంగుళాల ఎత్తు ఉన్న బంగారు హనుమంతుని విగ్రహం సృష్టించి, శిల్పి సుబ్రమణియన్ గారికి ఇచ్చి, విగ్రహాన్ని కూడా సరిగ్గా అట్లాగే నిర్మించమని ఆదేశించారు. విగ్రహాన్ని కొండరాతిమీదనే సరాసరిగా కాకుండా, కాంక్రీట్ వేదికమీదకు ఎక్కించాలని భగవాన్ ఇంజనీర్లను ఆదేశించారు. ఆ వేదిక ఏ ఎత్తులో కట్టాలో సూచించాల్సిందిగా స్వామిని ప్రార్థించగా, **"అది నా అంత ఎత్తు ఉండవచ్చు"** అని బాబావారు తెలిపారు. విగ్రహం మీదకు వీచే గాలికి అది దొర్లిపడకుండా ఉండేటందుకు కూడా ఆ వేదికా నిర్మాణం సాయపడ్తుంది. తరువాత ఇంజనీర్లు వేసిన లెక్కలుకూడా స్వామి ఎత్తు ఎంతో అంతే ఎత్తు వేదిక ఉండాలని తేల్చాయి. అంటే ఐదడుగుల నాలుగంగుళాలు! ఒకవేళ ఈ వేదికనే కనుక నిర్మించకపోతే విగ్రహాన్ని నిలిపి ఉంచడంకోసం కొండరాతిలో బాగా వెడల్పయిన, లోతయిన రంధ్రాలను తొలవాల్సి వచ్చేది.

నిర్మాణం పని రాత్రింబగళ్లూ జరుగుతూ ఉండేది. బాబావారు తరచుగా నిర్మాణ స్థలానికి వస్తూండడంతో అక్కడ ప్రతి ఒక్కరూ ఎంతో ఆనందోత్సాహాలతో పనిచేసేవారు. స్వామి తాము వస్తున్నప్పుడు పుష్కలంగా స్వీట్లూ, పండ్లూ, బిస్కెట్లూ కూడా తెచ్చి తామే స్వయంగా వాళ్లకు పంచిపెట్టేవారు. పని ఒడిదుడుకులు లేకుండా వేగంగా సాగింది. అరవై టన్నుల ఉక్కూ, నూట యాభై టన్నుల సిమెంటూ, ఆ విగ్రహం పని పూర్తవడానికి పట్టింది. వేదికతో కలిపి విగ్రహం మొత్తం బరువు సుమారు తొమ్మిది వందల టన్నులు. బాబావారి అరవై అయిదవ జన్మదినంనాటికి కొన్ని రోజులముందు అరవై అయిదు అడుగుల ఆ విగ్రహం ప్రతిష్ఠకు సిద్ధమయింది. 1990 నవంబరు 22వ తేదీనాడు భగవాన్ ఆ విగ్రహానికి ప్రారంభోత్సవం చేశారు. భారతదేశంలోని ప్రతి నగరంలోనూ, పల్లెలోనూ దేవాలయాలుండి తనకు సాటిలేని మహాభక్తుడయిన హనుమాన్‌కి ఘనమైన, బృహత్తరమయిన వాత్సల్య ప్రతీకగా ఈ విగ్రహం నిలుస్తున్నది.



REGD. WITH REGISTRAR OF NEWSPAPERS R.NO. 10772/64 REGN.NO. HDP/001/2012-2014
Licenced to post without prepayment No. HDP/001/2012-2014

గోకులాష్టమి వేడుకలు

గణేశ్ నిమజ్జనోత్సవం

'మహాబలి' నృత్య రూపకం

జన్మదిన సందేశం

ఈనాడు స్వామి పుట్టిన పండుగ అని మీరు అనేకవిధముల ఆనందమును అనుభవిస్తున్నారు. నాకు పుట్టిన పండుగ అనేదే లేదు. పుట్టుక ఉంటేకదా చావు, చావు ఉంటేకదా పుట్టుక. నాకు రెండూ లేవు... ఏనాడు దివ్యత్వమును మీ హృదయములో ప్రకటింపజేస్తారో ఆనాడే స్వామి జన్మదినముగా మీరు భావించుకోవాలి. స్వామి నిమిత్తమై మీరు ప్రాకులాడుతూ, స్వామి ఆశయములను మీరు ఆచరణలో పెట్టకపోయినప్పుడు స్వామి జన్మదినములు చేసుకొని ప్రయోజనం లేదు. ఆచరణరూపమైన ప్రచార ప్రబోధలు మీరు ఏనాడు సల్పుతారో ఆనాడే స్వామియొక్క జన్మదినముగా మీరు భావించుకొని ఆనందించాలని నేను ఆశిస్తున్నాను.... దేవుని ప్రేమించగోరువారు మొట్టమొదట జీవులను ప్రేమించటం నేర్చుకోవాలి... దాని నిమిత్తమై సమాజసేవకు కంకణం కట్టుకొని సేవలు సల్పటానికి పూనుకోవాలి. సేవకుడై నాయకుడు కావటానికి ప్రయత్నం చేయటం ఆధ్యాత్మిక మార్గములో అత్యవసరం.

- బాబా

వార్షిక చందా: ₹ 60 (భారతదేశంలో) ₹ 550, లేక $ 13 లేక £ 9 (విదేశాలకు)
చందా రుసుము ఒకటి లేక, రెండు, లేక మూడు సంవత్సరములకు స్వీకరింపబడును.

సనాతన సారథి చందాలు మనీయార్డరుద్వారా, లేక పర్సనల్ చెక్‌ద్వారా, లేక డిమాండ్ డ్రాఫ్ట్‌ద్వారా లేక, ఆన్‌లైన్ పద్ధతిన మా వెబ్‌సైటు **www.sanathanasarathi.org** ద్వారా చెల్లించవచ్చును. చందాలు పంపవలసిన చిరునామా: కన్వీనర్, శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం, ప్రశాంతి నిలయం – **515134**, ఆంధ్రప్రదేశ్.

Printed and published by K.S. Rajan on behalf of the owner Sri Sathya Sai Sadhana Trust, Publications Division, Prasanthi Nilayam - 515134, Anantapur district (A.P.) and printed at Sri Sathya Sai Press, within Sri Sathya Sai Ashram premises, Prasanthi Nilayam and published at Prasanthi Nilayam. Editor : B.V. Ramana Rao